www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 192 | సోమవారం | 1 జనవరి, 2018

2018...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



కొత్త రాష్ట్రం తెలంగాణ మూడున్నరేళ్ళలో ఆవిష్కరించిన అద్భుతం

నేటి నుండి వ్యవసాయానికి 24 గంటలు నిరంతరంగా నాణ్యమైన ఉచిత విద్యుత్

Reliable Power Supply to all sectors in Telangana
24x7 Hrs POWER

దేశంలో ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి కృషితో మూడున్నర దశాబ్దాల కరెంటు కష్టాలకు చరమగీతం



తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు నేటి నుండి 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది.

ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్రను సగర్వంగా లిఖిస్తున్నది.

సమైక్య రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరత వల్ల గంటల కొద్దీ విద్యుత్ కోతలతో జనజీవనం దుర్భరంగా మారింది. కనీసం మూడు నాలుగు గంటలు కూడా కరెంటు అందక పంటలు ఎండిపోయినయి. అర్ధరాత్రి, అపరాత్రి నీళ్లు పెట్టుకోవడానికి పోయిన రైతుల ప్రాణాలు కరెంటు షాకులకు బలైపోయినయి. లో ఓల్టేజి సమస్యతో ట్రాన్స్ ఫార్మర్లు పటాకుల వలె పేలిపోయేవి. నిరంతరం మోటార్లు కాలిపోయేవి.

పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వారంలో కొన్నిరోజులు పవర్ హాలిడేలు ప్రకటించే దుస్థితి ఆవరించి, పరిశ్రమలు మూతపడే స్థాయికి సంక్షోభం చేరింది.

సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో, కార్యదీక్షతో కృషి చేసి, మూడున్నరేళ్ల అనతికాలంలోనే అద్భుతాన్ని ఆవిష్కరించింది. తెలంగాణలో కరెంటు కోతలు ఇప్పుడు ప్రజలు మరిచిపోయిన గతం. 24 గంటల విద్యుత్ సరఫరా ఇప్పుడు ప్రజల నిత్యానుభవం. పవర్ హాలిడేలు పోయి ఎవ్రీ డే ఈజ్ పవర్ డే అనే రోజులొచ్చినయి. నిరంతర విద్యుత్ సరఫరాతో పరిశ్రమలలో ఉత్పత్తి పెరిగింది. కార్మికులకు కావాల్సినంత పని దొరుకుతున్నది. పెరిగిన వ్యవసాయోత్పత్తులతో రైతాంగంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. కొద్ది కాలంలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ అవతరించబోతున్నది.

వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

తెలంగాణలో ఇప్పుడిక అన్ని రంగాలకు 24x7 నాణ్యమైన విద్యుత్

ఎత్తిపోతల పథకాలకు 12వేల మెగావాట్ల విద్యుత్

కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 12వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి సర్వసన్నద్ధం.

లోటు నుంచి మిగులు వరకు

2వ జూన్ 2014 తెలంగాణ అవతరించే నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,573 మెగావాట్లు.

1 జనవరి 2018 నాటికి అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 14,913 మెగావాట్లు.

కొద్ది కాలంలోనే అందుబాటులోకి వచ్చే విద్యుత్ 28,000 మెగావాట్లు.

రూ.12,316 కోట్లతో పంపిణీ, సరఫరా వ్యవస్థల పటిష్టం

వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో విద్యుత్ సంస్థలు రూ.12,316 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేశాయి. 514 కొత్త సబ్ స్టేషన్లు, 1,724 కొత్త పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, 19,154 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించింది.

సోలార్ పవర్‌లో దేశంలో నెంబర్ వన్

3,142 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ఇప్పుడు తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

జాతీయ సగటును దాటిన తలసరి విద్యుత్ వినియోగం

ఆర్థిక ప్రగతికి సూచికగా చెప్పబడే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించింది. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1,200 యూనిట్లు, నేడు 1,505కు పెరిగింది. ఇది తెలంగాణలో జీవన ప్రమాణాల పెరుగుదలకు అద్దం పడుతున్నది.

శరవేగంగా అల్ట్రా మెగా & సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ల నిర్మాణం

- 4000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో టి.ఎస్.జెన్‌కో సారథ్యంలో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు నిర్మాణం జరుగుతున్నది.
- 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి పవర్ ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిశంబరు 2018 లో పూర్తి కానున్నవి
- 800 మెగావాట్లు కెటిపిఎస్ పవర్ ప్లాంటు ఈ మార్చిలో ఉత్పత్తి ప్రారంభం కానున్నది.

తెలంగాణ చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల అనుసంధానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల మధ్య వార్ధా నుండి హైదరాబాద్-765 కెవి డిసి లైన్ ప్రారంభం పి.జి.సి.ఐ.ఎల్ ద్వారా నిర్మించబడింది. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే సౌలభ్యం ఈ లైన్ వల్ల కలిగింది.

రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన - దళారీ వ్యవస్థ నిర్మూలన

- జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్ లలో కొత్తగా 16వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నది. వేల మందికి ఏకకాలంలో పదోన్నతి కల్పించింది.
- విద్యుత్ సంస్థల్లో 24,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత. దళారీ వ్యవస్థను నిర్మూలించింది.




తెలంగాణ రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ | ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

R.O.No.62/17

S & D

ముస్లింల అభివృద్ధిని పట్టించుకోని ఎంఐఎం : దత్తాత్రేయ



మన తెలంగాణ/హైదరాబాద్: ముస్లింల అభివృద్ధిని ఎంఐఎం ఏనాడూ పట్టించుకోలేదని, వారి గురించి కనీసం ఆలోచించలేదని బిజెపి ఎంపి బండారు దత్తాత్రేయ విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు ముస్లింలను ఒక ఓటు బ్యాంక్‌గానే పరిగణించాయన్నారు. లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ఎఐసిసి మహిళా విభాగం కార్యదర్శి నసీమా దత్తాత్రేయ సమక్షంలో ఆదివారం బిజెపిలో చేరారు. అనంతరం దత్తాత్రేయ మీడియాతో మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్ విధానం చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు ఇదివరకే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ట్రిపుల్ తలాక్ పేరు మీద ఎవరినీ జైలుకు పంపించే ఉద్దేశం బిజెపికి లేదని, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారని ఆరోపించారు. అసదుద్దీన్ తన రాజకీయ ఉద్దేశ్యాన్ని బిజెపికి అంటగట్టవద్దని సూచించారు. లోక్‌సభలో తలాక్ బిల్లు ఆమోదం పొందడం చరిత్రాత్మకమైనదిగా దత్తాత్రేయ అభివర్ణించారు. మహిళలు, పురుషులు సమానులేనని ఖురాన్‌లోనే పేర్కొనబడిందన్నారు. 1400 ఏళ్లుగా ట్రిపుల్ తలాక్ ఒక సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు. ట్రిపుల్ తలాక్ మీద ముస్లిం మహిళలు అనేక పోరాటాలు చేశారని తెలిపారు. మహిళలకు సామాజిక న్యాయం కావాలని, సమాజ మార్పు కోసమే కేంద్ర ప్రభుత్వం కఠిన నిబంధనలను విధించిందని వివరించారు.

పిజిటి గురుకుల ఫలితాలు విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పిజిటి) నియామక ఫలితాలను టిఎస్‌పిఎస్‌సి విడుదల చేసింది. గణితం, జీవ, భౌతిక, సాంఘిక శాస్త్రాల పిజిటి ఫలితాలను ఆదివారం ప్రకటించింది. మొత్తం 513 పోస్టులకు 2017, జూలై 18,19 తేదీల్లో రాత పరీక్షలు నిర్వహించింది. గణితంలో 126 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన టిఎస్‌పిఎస్‌సి 114 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. వికలాంగులకు సంబంధించిన వైద్య ధ్రువీకరణ పత్రాలు అందిన వెంటనే మిగతా ఫలితాలు ప్రకటిస్తామని పేర్కొంది. అలాగే జీవశాస్త్రంలో 22 పోస్టులకు 21 మంది పోస్టులు భర్తీ చేసింది. మరో పోస్టుకు అర్హులు లభించలేదని తెలిపింది. సాంఘిక శాస్త్రంలో 177 పోస్టులకు 166 పోస్టులను, భౌతిక శాస్త్రంలో 188 పోస్టులకు 174 పోస్టులను భర్తీ చేసినట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఎ.వాణీప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 921 పిజిటి పోస్టుల ఫలితాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు.

ఫారెస్ట్ కళాశాల ప్రొఫెసర్ల ఫలితాలు విడుదల: ములుగులో కొత్తగా ఏర్పాటు చేసిన అటవీ కళాశాలలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగ నియామకాల ఫలితాలను కూడా టిఎస్‌పిఎస్‌సి ప్రకటించింది. ఈ పోస్టులకు 8 మందిని ఎంపిక చేసినట్లు కమిషన్ కార్యదర్శి ఎ.వాణీప్రసాద్ పేర్కొన్నారు. లైబ్రేరియన్ పోస్టు కోసం జనవరి 5,6 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భూ రికార్డుల ప్రక్షాళనలో తహసీల్దార్ల కృషి అభినందనీయం

- డిప్యూటీ సిఎం మహమూద్ అలీ

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలో తాసీల్దార్ల కృషి అభినందనీయమని, రెవిన్యూ ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేసి ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ వ్యాఖ్యానించారు. తెలంగాణ తహసీల్దార్ల సంఘం 2018 డైరీని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదలను ఉద్దేశించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో రెవెన్యూ శాఖదే కీలకమైన పాత్ర అని, వీరి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని స్పష్టం చేశారు. తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు ఖాళీ పోస్టుల భర్తీపై సత్వరం నిర్ణయం తీసుకుంటామని, తహసీల్దార్లందరికీ ఒకే రకమైన వాహనాలను సమకూరుస్తామని తెలిపారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెవెన్యూ శాఖలో పదోన్నతులు వచ్చాయన్నారు. పని భారాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సిబ్బంది కొరతను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

24 గంటల కరెంటు చరిత్రాత్మకం

- భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

మన తెలంగాణ/హైదరాబాద్: గతేడాది పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో పెనుమార్పులు తీసుకువచ్చామని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయమని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు హరీశ్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంబురంగా వేడుకలు చేసుకోవాలని మంత్రి ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

గ్రామ పంచాయతీల విలీన కసరత్తు

- కార్పొరేషన్‌గా సిద్ధిపేట?
- పురపాలిక హోదా జాబితాలో 50 పంచాయతీలు
- తీర్మానించిన 22 గ్రామ పంచాయతీలు




మన తెలంగాణ/హైదరాబాద్: గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. 15వేలకు పైబడి జనాభా కలిగిన మేజర్ గ్రామ పంచాయతీల ఆర్థిక, భౌగోళిక పరిస్థితులపై అధ్యయనం చేసిన మున్సిపల్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 నుంచి 50 గ్రామ పంచాయతీలకు పురపాలిక హోదా కల్పించడానికి అర్హమైనవిగా గుర్తించింది. సిద్దిపేట పురపాలిక కార్పొరేషన్‌గా రూపాంతరం చెందే అవకాశం ఉంది. మేజర్ గ్రామ పంచాయతీల విలీనానికి డి నోటిఫికేషన్ అడ్డంకిగా మారుతున్న నేపథ్యంలో ఆయా గ్రామ పంచాయతీలే స్వచ్ఛందంగా తమను పురపాలికలలో విలీనం చేయాలని కోరుతూ తీర్మానం చేయాలని మున్సిపల్ శాఖ సదరు గ్రామ పంచాయతీలకు సూచించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే 22గ్రామ పంచాయతీలు పురపాలికలలో విలీనం చేసేలా తీర్మానం చేసి మున్సిపల్ శాఖకు పంపాయి. మరి కొన్ని గ్రామ పంచాయతీలు కూడా త్వరలోనే ఈ తరహా తీర్మానం చేయనున్నట్లు సమాచారం. ప్రధానంగా కొన్ని గ్రామ పంచాయతీలను పురపాలికలలో విలీనం చేయాలని మున్సిపల్ శాఖ గుర్తించినప్పటికీ ఆ గ్రామ పంచాయతీలు విలీనంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. పురపాలికలలో విలీనమైతే పన్నుల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. పురపాలికలలో విలీనమైతే పన్నుల భారం కొంత మేరకు పెరిగినా వారి ఆస్తుల విలువ కూడా పెరుగుతుందని, అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు వచ్చే అవకాశాలు ఉంటాయని అధికార యంత్రాంగం సదరు గ్రామ పంచాయతీలకు నచ్చజెప్పినట్లు సమాచారం. ఇదే అంశంపై గ్రామ పంచాయతీలకు, అక్కడి ప్రజలలో అవగాహన కల్పించాలని కూడా అధికార యంత్రాంగం భావిస్తోంది. గ్రామ పంచాయతీల విలీన పక్రియ వివాదాస్ప దం కాకుండా ఆ శాఖ జాగ్రత్తలు పాటిస్తోంది. అందుకే గ్రామ పంచాయతీల నుంచి తీర్మానం అందిన తర్వాతే ప్రక్రియను చేపట్టాలని మున్సిపల్ శాఖ యోచిస్తోంది. ఒకవేళ సదరు పాలకమండలి పురపాలికలలో విలీనాన్ని వ్యతిరేకిస్తే మాత్రం ఆ పాలక మండలి పదవి కాలం పూర్తయిన తర్వాతనే విలీన పక్రియను చేపట్టాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

జులై నాటికి ప్రక్రియ పూర్తి

పురపాలికలలో గ్రామ పంచాయతీల విలీన పక్రియను ఈ ఏడాది పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రస్తుత గ్రామ పంచాయతీల పదవీకాలం 2018 జులై నాటికి ముగియనుంది. దీంతో 2011 జనాభా, 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 15 వేలకు పైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను ఇప్పటికే మున్సిపల్ శాఖ గుర్తించింది. 22 గ్రామపంచాయతీల నుంచి తీర్మానాలు అందగా, త్వరలోనే మరి కొన్ని గ్రామ పంచాయతీలు కూడా తీర్మానం చేయనున్నట్లు తెలిసింది. మిగిలినవాటిల్లో పాలకమండలి పదవీకాలం పూర్తి కాగానే విలీన పక్రియ ప్రారంభంకానుంది. మొత్తానికి 44 గ్రామ పంచాయతీల నుంచి ప్రతిపాదనలు అందవచ్చని అధికార యంత్రాంగం అంచనా. విలీన పక్రియను మున్సిపల్ శాఖ వేగవంతం చేస్తోంది.

నలుగురికి సర్వోన్నత పోలీస్ పతకాలు



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో: అసాధారణమైన పోలీసు విధులను నిర్వర్తించిన పోలీస్ అధికారులు, పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ స్టేట్ ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీ స్ పతకం' ప్రకటించింది. నూతన సంవత్సర దినోత్సవం సందర్భంగా జనవరి 1న అందజేయనున్నట్టు వెల్లడించింది. విధి నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించిన, అసాధారణమైన సేవలు, మంచి పనులు చేసిన ఈ పతకాలను బహూ కరించి గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే పోలీస్ విభాగంలో ఉత్తమ అధికారులైన నలు గురికి ఈ పతకాలను ప్రకటించారు. పథకం అందుకున్న వారిలో యరబాటి శ్రీనివాస్‌రావు (కమాండెంట్ 1వ బెటాలియన్ టిఎస్ఎస్‌పి), కిరన్‌రాయ్ (డిఎస్‌పి, ఐఎస్ డబ్ల్యూ, టిఎస్, హైదరాబాద్), మద్ది ప్రవీణ్ కుమార్ (అదనపు ఇన్‌స్పెక్టర్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్), కొక్కొండ బాలరా జు (ఎస్‌ఐ, సిసిఎస్, శంషాబాద్) ఉన్నారు. వీరికి ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం రూ. 5లక్షలను మంజూరు చేసినట్టు వెల్లడించింది.

ఢిల్లీలోనే దీక్ష చేస్తాం టిఆర్‌ఎస్ మద్దతిస్తుందా?

- ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మన తెలంగాణ/ హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్‌సి వర్గీకరణ కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నుంచి హైదరాబాద్‌లో దీక్ష చేపడుతామని చెబితే గల్లీలో కాదు ఢిల్లీలో దీక్ష చేయండి అని డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి కోరారని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఒయు గెస్ట్‌హౌస్‌లో ఆయన మాదిగ విద్యార్థులతో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో దీక్ష చేపడితే టిఆర్ ఎస్ మద్దతిస్తుందా అని, ఈ విషయమై కడియం శ్రీహరికి 24 గంటల్లోపు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎంఆర్ పిఎస్ ఉద్యమంపై స్పందించడానికి మీడియా ముందుకు రావొద్దని కడియంను కోరారు. మాదిగ ఉద్యమంపై సిఎం, డిప్యూటీ సిఎంలకు చిత్తశుద్ధి లేదన్నారు. గతంలో ఢిల్లీలో ఎంఆర్‌పిఎస్ 30 రోజుల పాటు దీక్ష చేస్తే అన్ని పార్టీల నాయకులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు తమ దీక్షను సం దర్శించి మద్దతు తెలిపారని, ఒక్క టిఆర్ఎస్ ఎంపిలు మాత్రమే రాలేదని గుర్తుచేశారు. తాము హైదరాబాద్‌లో తలపెట్టిన దీక్షకు అనుమతించాలన్నారు. సమావేశంలో మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ, ఒయు అధ్యాపకులు డా.కాశీం, ఎంఎస్‌ఎఫ్ నాయకులు పల్లెర్ల సుధాకర్, కొమ్ముశేఖర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభలో మాట్లాడాలి: వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ బిజెపికి చెందిన సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యులు దత్తన్న (బండారు దత్తాత్రేయ) మాట్లాడాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర బిజెపి నాయకులు డా.కె.లక్ష్మణ్, జి. కిషన్‌రెడ్డిలు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాలను కలిసి వర్గీకరణ గురించి వివరించాలని కోరారు.

రానున్నది సంక్షేమ బడ్జెట్?

- ప్రతిపాదనల తర్వాత శాఖల వారీ స్పష్టత



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 201819 బడ్జెట్ కసరత్తును ప్రారంభించింది. జనవరి 8 కల్లా ప్రతిపాదనలను పంపాల్సిందిగా ఇప్పటికే ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్ని విభాగాల కార్యదర్శులకు సర్క్యులర్‌ను రాశారు. ఆయా విభాగాల నుంచి వచ్చే ప్రతిపాదనలను క్రోడీకరించి 10వ తేదీకల్లా స్పష్టమైన నివేదికలను పంపాల్సిందిగా సచివాలయంలోని అన్ని విభాగాలకు సూచించారు. అయితే రానున్నది ఎన్నికల సంవత్సరం కాబట్టి ఈ బడ్జెట్ సంక్షేమ బడ్జెట్‌గా ఉండనుంది. రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల అవసరాల కోసం ప్రతి ఎకరానికి ఒక్కో సీజన్‌కు నాలుగు వేల రూపాయల చొప్పున రెండు సీజన్‌లకు కలిపి సంవత్సరానికి ఎనిమిది వేలను ఆర్థికసాయం రూపంలో ఇవ్వాలని నిర్ణయించినందువల్ల బడ్జెట్‌లో ఇది చోటుచేసుకోనుంది. దీనికి సుమారు రెండున్నర వేల కోట్ల రూపాయల కేటాయింపు అవసరమవుతుంది. ఇలాంటి మరికొన్ని కొత్త పథకాలను కూడా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అన్ని వర్గాల ప్రజలకు దగ్గరయ్యేందుకు ఈ బడ్జెట్‌లో ప్రకటనలు ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రస్తుత పథకాల అమలు, లబ్ధిదారుల స్పందన, వీటిని మరింతగా చేరువ చేయడానికి ఏం చేయాలి తదితరాలపై సమీక్షించినట్లు సమాచారం. ప్రజాకర్షక పథకాలపై ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిసింది. సత్వరం ఫలితాలనిచ్చే తరహా పథకాల ద్వారా ప్రజల మనస్సుల్ని గెలవవచ్చనేది టిఆర్ ఎస్ భావన. అందువల్ల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గత బడ్జెట్‌తో పోలిస్తే 25% మేర అంచనాలు పెరిగే అవకాశం ఉందని మంత్రి ఈటల రాజేందర్ ఇప్పటికే సూచనప్రాయంగా తెలియజేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో సామాజిక సంక్షేమ పథకాలకు 50% మేర నిధులు ఖర్చవుతున్నందువల్ల ఈసారి బడ్జెట్‌లో ఇది 65% వరకు పెరిగే అవకాశం ఉంది. గడచిన మూడేళ్లుగా బడ్జెట్ రూపకల్పనలో, అప్పుల నిర్వహణలో తెలంగాణ రాష్ట్రం చాలా రాష్ట్రాలకంటే ఉత్తమంగా ఉందని, ప్రభుత్వం నిర్దేశించుకున్న అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు చేసే వ్యయానికి పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని ఆర్థికశాఖ అధికారుల అభిప్రాయం. గడచిన మూడేళ్లలో రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరిగిందని, జీవన ప్రమాణాల్లో కూడా మెరుగుదల కనిపించిందని అభిప్రాయపడుతున్న ఆర్థికశాఖ అధికారులు ఇదంతా పాలనా సామర్థ్యానికి నిదర్శనమని భావిస్తున్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో నీరు చేరి సాగు విస్తీర్ణం పెరిగిందని, దాని వెన్నంటే ఉత్పత్తి కూడా పెరిగిందని, సులభ వాణిజ్య విధానంతో, టిఎస్ఐపాస్‌తో పారిశ్రామికాభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగం వృద్ధి చెందిందని... ఇవన్నీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంకేతాలని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ వర్గాలు సంతృప్తిగా ఉన్నందున రానున్న బడ్జెట్ అంచనాలు పెరగడంతో పాటు సంక్షేమానికి ఎక్కువ కేటాయింపులు చేసే అవకాశం ఉంది.

43 హామీల సంగతేంటి?



మన తెలంగాణ / హైదరాబాద్ : ఎన్నికల సందర్భంగా టిఆర్ఎస్ అనేక హామీలిచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడున్నరేళ్లలో 43 హామీలు ఇంకా నెరవేరలేదని, వాటి సంగతేంటని శాసన మండలి ప్రతిపక్ష నాయకులు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. టిఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిఎం కెసిఆర్‌కు లేఖ రాసినట్లు ఆయన గుర్తుచేశారు. సిఎల్‌పి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్ నుంచి లోటు బడ్జెట్‌లోకి తీసుకెళ్తోందని, సిఎం కెసిఆర్ ప్రగతిభవన్‌లో కూర్చొని ఇదే సుపరిపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రం టిఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతిలో 12వ స్థానానికి చేరిందన్నారు.


గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులను పరిరక్షించాలి

మన తెలంగాణ/హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్యాక్రాంతమవుతున్న చెరువులు, కుంటలను పరిరక్షించాలని సేవ్ అవర్ అర్బన్ లేక్స్ (సోల్) అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి లుబ్నా సర్వత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శామీర్‌పేట, యాప్రాల్, కాప్రా ప్రాంతాల్లోని చెరువులన్నీ అన్యాక్రాంతమైనట్లు వెల్లడించారు. షామీర్‌పేట మండలం బాబాగూడ గ్రామంలోని ఎర్రకుంట చెరువులో కొందరు రాత్రికి రాత్రే స్మశాన వాటికలను నిర్మించారని, శవాలను దహనం చేసే ప్లాట్‌ఫాం నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. దీని వెనుక కొందరు రాజకీయ నాయకులు ఉన్నారని ఆమె ఆరోపించారు. ఆదివారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ మిషన్ కాకతీయ ద్వారా ప్రభుత్వం ఓ పక్క చెరువులను పరిరక్షిస్తున్నట్లు చెప్పుకుంటోందని, అన్యాక్రాంతమవుతున్న చెరువుల, కుంటల గురించి కూడా స్పష్టత ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

పునరుద్ధరణకు పూనుకునేదెన్నడు?



- నిరీక్షిస్తున్న ఖాయిలా పరిశ్రమలు
- నిజాం షుగర్స్, సిర్పూర్ పేపర్ మిల్, రేయాన్‌పై ఏడాదిగా ఊరిస్తున్న ప్రభుత్వం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో మూతపడ్డ భారీ పరిశ్రమలను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా ఆచరణ రూపం దాల్చడం లేదు. ఖాయిలా పరిశ్రమల పునరుద్ధరణపై స్వయంగా సిఎం, డిప్యూటీ సిఎం, పలువురు ఎంపిలు చెరుకు రైతులు, కార్మిక వర్గాలకు చేసిన వాగ్దానాలు ముందుకు కదలడం లేదు. ఫలితంగా వాటిపై ఆధారపడిన చెరుకు రైతులు, కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. మూతపడ్డ పరిశ్రమలను పునరుద్ధరించేందుకు వివిధ కంపెనీలకు రివైవల్ ప్యాకేజీలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా పరిశ్రమలు మాత్రం తెరుచుకోవడం లేదని రైతులు, కార్మికులు చెబుతున్నారు. ఈ ఏడాది సరే.. కనీసం వచ్చే ఏడాదైనా పునరుద్ధరణకు నోచుకుంటోయో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరుకు అత్యధికంగా సాగయ్యే నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో ఈ కర్మాగారాలు మూత రైతులుపైనా, కార్మిక వర్గంపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. చక్కెర కర్మాగారాలు మూత పడడంతో చెరుకు పంట దిగుబడికి, చెరుకు వినియోగానికి మధ్య అంతరం నెలకొంది. నిజాం షుగర్స్‌ను తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ చెరుకు రైతులు ఈ ఏడాదిలో పలు సందర్భాల్లో ఆందోళనలు కూడా చేశారు. నిజామాబాద్ ఎంపి కవితతోనూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద ప్రస్తావించి నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని కవిత కూడా హామీ ఇచ్చిందని చెరుకు రైతులు గుర్తు చేస్తున్నారు. బోధన్ నిజాం షుగర్స్ కర్మాగారం (ఎన్ఎఫ్‌సి)తో పాటు కోమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్ పేపరు మిల్లు (ఎస్‌పిఎం) లోనూ ఇదే పరిస్థితి. అటు చెరుకు రైతులు, ఇటు పేపర్ మిల్లు కార్మికులు కర్మాగారాల సంక్షోభాలతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్‌పిఎం సమస్యపై డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి రెండు పర్యాయాలు కాగజ్‌నగర్‌లో పర్యటించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఏడాది పూర్తి అయినా పరిశ్రమ పునరుద్ధరణను నోచుకోక పోవడంపై కార్మికులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. తమ వద్ద చెరుకు తీసుకున్న షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం డబ్బులు చెల్లించకుండా గత కొన్ని ఏళ్లుగా బకాయి పెడుతోందని, డబ్బులు చెల్లించాలని నిలదీసినా ఇదిగో అదిగో అంటూ దాట వేస్తోందే తప్ప ఇంతవరకు డబ్బులు మాత్రం చెల్లించలేదని చెరుకు రైతులు చెబుతున్నారు. రైతుల బకాయిలను ప్రభుత్వమే చెల్లించి ఫ్యాక్టరీని నడిపించేందుకు చర్యలు తీసుకుంటామంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా హామీ ఇచ్చారని చెరుకు రైతులు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. ఇక వరంగల్ జిల్లాలోని బిల్ట్ (రేయాన్) కర్మాగారాన్ని కూడా త్వరలోనే తెరిపిస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చినా ఈ పరిశ్రమ కూడా ఇంత వరకు పునరుద్ధరణకు నోచుకోవడం లేదు.

S & D

www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 192 | సోమవారం | 1 జనవరి, 2018

2018 ...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

కార్పొరేషన్‌గా సిద్దిపేట? 2

50 పంచాయతీలకు పురపాలక హోదా?



భ్రష్ట రాజకీయాల దుమ్ము దులుపుతా

తమిళనాడు పరిణామాలు తల దించుకునేలా చేశాయి

ఇప్పుడు నేను రాజకీయాల్లోకి రాకపోతే ప్రజలు మన్నించరు

అందుకే వచ్చేశా

అసెంబ్లీ ఎన్నికల్లోగా పార్టీని ప్రకటిస్తా


అభిమానుల కోలాహలం మధ్య రజనీకాంత్

8 లో

విజన్ - 2024

మూడున్నరేళ్ల తెలంగాణలో సాధించిన ఫలితాల ప్రాతిపదికగా 2014-24 వాస్తవిక అభివృద్ధి ప్రణాళిక

బంగారు తెలంగాణ లక్ష్యంగా రూపొందుతున్న అపురూప డాక్యుమెంట్



మన తెలంగాణ / హైదరాబాద్ : సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ 2024' దశాబ్ది (2014 –2024) దిక్సూచి డాక్యుమెంట్‌ను రూపొందిస్తోంది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో ప్రభుత్వం రూపొందిస్తున్న ఈ డాక్యుమెంట్ అంతిమంగా 'బంగారు తెలంగాణ' స్ఫూర్తిని ప్రతిబింబించనుంది. మార్చి నెలకల్లా దీన్ని ప్రభుత్వం ప్రజల్లోకి తీసుకెళ్ళనుంది. ఈ డాక్యుమెంట్‌కు ఇంకా నిర్దిష్టమైన నామకరణం జరగలేదు. మూడున్నరేళ్ళలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును, ఫలితాలను ప్రామాణికంగా తీసుకొని 2024వ సంవత్సరంకల్లా తెలంగాణ ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో రంగాలవారీగా, ప్రతి ఏటా సాధించే లక్ష్యాన్ని పేర్కొంటూ ఈ డాక్యుమెంట్ రూపుదిద్దుకుంటోంది. 14వ ఆర్థిక సంఘం సమావేశంలో సిఎం కెసిఆర్ ఇచ్చిన ప్రసంగంలోని ''సమాజంలో అభివృద్ధికి నోచుకోని అణగారిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపర్చకపోతే స్థిరీకృత అభివృద్ధి సాధించినట్లుగా పరిగణించలేం. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం ఆలోచన, ఆచరణ ఆ దిశగానే ఉంది''.. అనే వాక్యాలే 'తెలంగాణ 2024'కు తొలి పలుకుగా ఉంటున్నాయి. 2017 నాటి పరిస్థితుల్ని 'బేస్ లైన్'గా తీసుకొని 2024 నాటికి తెలంగాణ ఏ రూపంలో ఉంటుందో వివరించనుంది. ఇప్పటికే ప్రాథమిక 'కాన్సెప్ట్ నోట్ 2024' తయారైంది. ఇందులో దశాబ్ది ప్రణాళిక లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర సమగ్ర ముఖచిత్రం తదితరాలు ఉన్నాయి. ఈ డాక్యుమెంట్ తయారీ కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. ముఖ్య కార్యదర్శి స్థాయి హోదా కలిగిన ఒక నోడల్ అధికారిగా నియమితులయ్యారు. అన్ని విభాగాల నుంచి సమాచారం, గణాంకాలను ఈ అధికారి సేకరిస్తున్నారు. ఈ మొత్తం డాక్యుమెంట్ రూపకల్పన ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ నేతృత్వంలో జరుగుతోంది.

'బంగారు తెలంగాణ' అంటే...?: ప్రభుత్వం పదేపదే చెప్తోన్న 'బంగారు తెలంగాణ'కు నిర్దిష్టమైన లక్ష్యాన్ని, నిర్వచనాన్ని ఈ డాక్యుమెంట్ తరువాయి 6లో

పిజిటి గురుకుల ఫలితాలు విడుదల

వెలువడిన అటవీ కళాశాల నియామక ఫలితాలు 2

డ్రగ్స్ ప్రధాన నిందితుడు కెల్విన్‌కు బెయిల్ 7



పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

– ఎడిటర్, మన తెలంగాణ

విద్యుత్ సంబురం

రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ కొత్త సంవత్సర కానుకగా అమల్లోకి వచ్చిన నిరంతర విద్యుత్ పథకం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా కొత్త సంవత్సర కానుకగా అమల్లోకి వచ్చింది. తెలంగాణ ఏర్పడితే రాష్ట్రం అంధకారంలో పడిపోతుందనే విమర్శలు అర్థరహితమైనవని ప్రభుత్వం రుజువుచేసింది. ఎన్నో సవాళ్ళను అధిగమించి ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం మాత్రమే కాకుండా అక్షరాలా దీన్ని విజయవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 6,574 మెగావాట్ల విద్యుత్ సరఫరా ఉంటే సిఎం కెసిఆర్ ఈ సంక్షోభం నుంచి గట్టెక్కడానికి ఐదు నెలల పాటు ముమ్మర కసరత్తు చేసి 2014 నవంబరు నాటికే గృహ, వాణిజ్య, పరిశ్రమల విద్యుత్ వినియోగానికి 24 గంటల సరఫరా చేసి రికార్డు సృష్టించారు. అప్పటివరకూ గ్రామాల్లో ఎనిమిది గంటలు, పట్టణాల్లో ఆరు, హైదరాబాద్ నగరంలో నాలుగు గంటల విద్యుత్ కోత అమలవుతూ తరువాయి 6లో

ప్రగతి పరుగులు – సంక్షేమ వెలుగులు 6



నలుగురికి సిఎం సర్వోన్నత పోలీసు పతకం

జనవరి 1న ప్రదానం 2

కుంచెపోటు



కృష్ణ బోర్డుకు మళ్లీ ఎపి పక్షవాతం!

మారని ఆంధ్రప్రదేశ్ అనుకూల వైఖరి, వచ్చే యాసంగికి తిప్పలు

మన తెలంగాణ/ హైదరాబాద్: కృష్ణా బోర్డు వైఖరితో మరో మారు కృష్ణా నీటిలో అన్యాయం జరుగుతుందా? ఆంధ్రప్రదేశ్ ఆలోచనలకు అనుగుణంగా బోర్డు నడుచుకోవడమే దీనంతటికీ కారణమా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నీటి ఆధారంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తమ వ్యవసాయ ప్రణాళికను అమలు చేస్తున్నాయి. తెలంగాణలో ప్రధానంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులు యాసంగి నుంచి బయటపడతామనే ధీమా ఇప్పటి వరకు ఉంది. కానీ ఎపిపై పక్షపాతంతో బోర్డు వ్యవహరిస్తున్న తీరు ఇటు రైతులకు సాగునీరు, అటు హైదరాబాద్ ప్రజల తాగునీటికీ ఇబ్బందులు తెచ్చే ప్రమాదం పొంచివుంది. శ్రీశైలంలో నీరు 854 అడుగుల సమీపంలోకి వచ్చే వరకు బోర్డు సమావేశాలు కానీ, త్రిసభ్య కమిటీ సమావేశాలు కానీ నిర్వహించవద్దన్న ధోరణితో ఆంధ్రప్రదేశ్ ఉంది. దీంతో ప్రతిసారి సమావేశాలను రకరకాల కారణాలు, లోపాయికారీ ఒప్పందాలతో త్రిసభ్య కమిటీ వాయిదావేస్తూ వస్తోంది. హైదరాబాద్‌లో నవంబరు 4న జరిగిన కృష్ణా బోర్డు సమావేశంలో బేసిన్‌లో అందుబాటులో ఉన్న నీటిని 330 టిఎంసిలుగా తేల్చారు. ఈ నీటిలో తెలంగాణ 34 శాతం, ఆంధ్రప్రదేశ్ 66 శాతం మేర పంచుకోడానికి అంగీకారం కుదిరింది. ఈ మేరకు తరువాయి 6లో

మన తెలంగాణ
www.manatelangana.news
4
హైదరాబాద్
సోమవారం
1, జనవరి 2018

‘కథానిక ఆలోచింపజేస్తుంది’

గురజాడ, గిడుగు, శ్రీపాద, పాలగుమ్మి, బుచ్చిబాబు వంటి సాహితీ దిగ్గజాల జ్ఞాపకాల సేవలో తరించినవాడు ‘పాపం పసివాళ్ళు’గా అనాథ బాలల్ని గుండెలకు హత్తుకుని కలం నడిపిన వాడు. బయటి ప్రపంచానికి కానరాని యదార్థాలను జైలు లోపలికి వెళ్లి శోధించినవాడు. ‘కథానిక’ అనే సాహితీ ప్రక్రియనే ఆరోప్రాణంగా బ్రతుకు వెళ్ళదీస్తున్నవాడు. అష్టకష్టాల్లో ఉన్నా ఎందరికో ఆసరాగా నిలిచి కథానికా సాహిత్యానికి ఊతకర్రయై నిలుస్తున్నవాడు. నటుడిగా, జర్నలిస్టుగా, దర్శకుడిగా, నిర్మాతగా, రచయితగా పేరు గాంచినవాడు. పేజీ కథలు, కాలం కథలు, గల్పికలు, స్కెచ్‌లు, కల్పికలు, ఆత్మకథలు, పరిశోధనాత్మక కథలు, వైద్యరంగపు కథలు వంటి ఎన్నెన్నో సాహితీ ప్రక్రియల్ని స్పృశించి సుసంపన్నం గావించినవాడు. పాత్రికేయ వృత్తినుండి సాహిత్య సృజనాత్మక పాత్రను పోషించిన వాడు. ప్రసార మాధ్యమాలన్నింటిలో రాణించిన వాడైన కథానికల వైతాళికుడు వేదగిరి రాంబాబు విశిష్ట సాహితీసేవకు గుర్తింపుగా ఈనెల 6న గుంటూరులో అజో–విభో–కందాళం ఫౌండేషన్ వారు ‘విశిష్ట సాహితీ మూర్తి జీవితకాల సాధన పురస్కారం’ అందించబోతున్నారు. ఆ సందర్భంగా మన తెలంగాణ ‘కలం’ పేజి ఆయనతో కాసేపు ముచ్చటించింది–.

ప్ర : మీకు కథానికపై ఆసక్తి కలగడానికి కారణం?

జ: 1974 ప్రాంతంలో అనుకోకుండా విహారి గారి ఉపన్యాసం విన్నాను. తర్వాత ఆయనతో చనువు పెంచుకున్నాను. బందరు నవ కళా టాకీస్ ఎదురుగా ఉన్న పార్క్‌లో విహారిగారితో పాటు సింగ రాజు రామచంద్రమూర్తి, ఆదివిష్ణు, యర్రంశెట్టి సాయి, చందు సోంబాబు, పిశుపాటి ఉమామహేశ్వరమ్, విశ్వభరత్ లాంటి వారు రోజూ అక్కడ కలుసుకుని సాహిత్య చర్చలు సాగించేవారు. వాళ్లు పోటీపడి రాస్తుండేవారు. వారి స్ఫూర్తితో కథానికలు రాస్తుండేవాడిని. విహారిగారు, యర్రంశెట్టి సాయి రచనా మెలకువలు తెలిపారు. బందరులో డిగ్రీ పూర్తయ్యేనాటికి ఆంధ్రపత్రిక దీపావళి కథానికల పోటీలో బహుమతి కూడా పొందాను.

ప్ర: ఆకాశవాణితో మీ అనుభవాలు తెలుపుతారా?

జ: రేడియో అన్నయ్యగా ప్రసిద్ధులైన న్యాయపతి రాఘవరావుగారు నన్ను క్యాజువల్ ఆర్టిస్టుగా ఆకాశవాణి హైదరాబాద్ ద్వారా పరిచయం చేశారు. నాకప్పటికి 19 ఏళ్ళు. అనంతరం రేడియో అనౌన్సర్‌గా, రిపోర్టర్‌గా, డ్రామా వాయిస్ ఆర్టిస్ట్‌గా, డ్రామా ప్రొడ్యూసర్‌గా, న్యూస్ రీడర్‌గా వివిధ భూమికలు పోషించాను. ఆ సమయంలో పి.ఎస్.నారాయణ, పి.వి.ఆర్.శివకుమార్, మైనంపాటి భాస్కర్, తులసీ బాలకృష్ణ, పురాణం శ్రీనివాసశాస్త్రి, ప్రతాప రవిశంకర్ వంటి రచయితలమంతా కలివిడిగా ఉండేవాళ్ళం.

ప్ర : పత్రికారంగంలో మీ సేవ లెలాంటివి?

జ: ఆంధ్రభూమిలో ఏడేళ్లు సీనియర్ సబ్ ఎడిటర్‌గా చేశాను. ‘పల్లకి’ వారపత్రికకి కొంతకాలం ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా చేశాను. ఆంధ్రభూమిలో వీక్లీతోపాటు సినిమా పత్రిక, మాస పత్రికను కూడా నేనే చూశాను. పల్లకిలో– ఇచ్ఛాపురం జగన్నాధరావు, వీరాజీ వంటి వారితో కథలు రాయించాను. అప్పుడు బాపుగారు ఆ రెండు పత్రికలకు మంచి ఖ్యాతిని పెంచారు.

ప్ర : ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా మీ సాహిత్య కృషి ఎలాంటిది?

జ : ఆ కాలంలో ఆర్థికంగా చాలా కష్టపడ్డాను. చంచల్‌గూడా జైలును సందర్శించి వాళ్ళ కథనాలతో ‘జైలుగోడల మధ్య’ అనే పేరిట స్వాతిలో సీరియల్ కథనాలు రాశాను. వీధిబాలలు, అనాథబాలల వాస్తవ కథలతో ఆంధ్రభూమిలో, దూరదర్శన్‌లో ప్రసారితాలైనాయి. వాటికి నిర్మాత, దర్శకుడు, రచయిత బాధ్యతల్ని తీసుకున్నాను. నిర్మాతగా బంగారు నంది, దర్శకుడిగా నంది అవార్డును పొందాను. వరకట్నాలమీద వాస్తవ కథనాలుగా ‘అగ్నిసాక్షి’ రాశాను. అవీ ఆంధ్రభూమి, దూరదర్శన్‌లో వచ్చాయి. సమాజంలో నిరాదరణకు గురైన వారిగురించి ఆంధ్రప్రభలో ‘వీళ్లేమంటారు?’ అని వారిని స్వయంగా సంప్రదించి రాశాను. నేను రాసి, దర్శకత్వం వహించి, నిర్మించిన ‘అడవి మనిషి’ బాలల చిత్రానికి నంది అవార్డు లభించింది. ఇస్కాన్ (మధుర, బృందావనం), బ్రహ్మకుమారీస్ (మౌంట్ ఆబూ), స్వామి సమర్థ (అక్కల్ కోట్), గాయత్రీ పరివార్(హరిద్వార్), గాడ్ గారు (వెదురుపాక) లాంటి క్షేత్రాలు దర్శించి అక్కడి సమాచారాలతో ఆయా ‘స్కూల్స్ ఆఫ్ థాట్స్’ని తెలుపుతూ డాక్యుమెంటరీగా చేశాను. అది దూరదర్శన్‌లో సీరియల్‌గా వచ్చింది. తర్వాత నా రచనా, దర్శకత్వాలతో ‘కథావీధి’పేరుతో, దిద్దుబాటు, కలుపుమొక్కలు, దాసరి పాట లాంటివి అట్లాగే విద్యావిషయక డాక్యుమెంటరీలు చేశాను. అవన్నీ దూరదర్శన్‌లో ప్రసారమైనాయి. బాల సాహిత్యంలో తొలిసారిగా చిల్డ్రన్స్ వీడియో మేగజైన్‌ను 7 సంపుటాలుగా ‘ఇంద్రధనస్సు’ పేరుతో తయారు చేశారు. ఇవి దూరదర్శన్‌లో వచ్చాయి. కేంద్ర సాహిత్య అకాడెమీ పక్షాన 5 రోజుల కథానికా రచయితల కార్యగోష్టికి సంచాలకుడిగా నిర్వహించాను. 1991లో ‘నాలుగు శతాబ్దాల నగరం’ రాశాను. అది ఆకరగ్రంథం, అనేక భాషల్లోకి అనువాదమైంది. కడప, నరసరావు పేట పట్టణాల ప్రత్యేక చరిత్రా సంచికలకు సంపాదకత్వం చేశాను. పిల్లల కోసం


వేదగిరి రాంబాబు

రచనలు చేశాను. అందులో ‘మన హైదరాబాద్’, సంక్షిప్త ఆంధ్రుల చరిత్ర వంటివి ముఖ్యమైనవి.

వైద్య విజ్ఞాన రంగంలో ‘సీరీస్’ పుస్తకాలు రాశాను. ‘మన ఆరోగ్యం’ వంటి పత్రికల్ని ఎడిట్ చేశాను. ఉస్మానియా, తెలుగు , అంబేద్కర్ యూనివర్శిటీల్లో జర్నలిజం కోర్సులకు విజిటింగ్ ఫ్యాకల్టీ నైనాను. అనేక ప్రయోగాత్మక రచనల చేశాను. ఇప్పటివరకు 60 వరకు పుస్తకాలు రాయడం, 50కి పైగా సంపాదకత్వం వహించడం. యాభైకిపైగా వీడియో డాక్యుమెంటరీలు, 200కి పైగా ఆడియోలు నాటికలు, నాటకాలు, రూపకాలూ ఉన్నాయి.

ప్ర: కథ కథానికలకు తేడా చెప్పండి?

జ: కథ అందమైన అబద్ధాల్ని కాల్పనికతో చెపుతుంది. కథానిక నిజ జీవితానికి శిల్ప సమేతంగా అద్దం పట్టేది కథానిక అంటే నాకు అమితమైన ఇష్టం. ఆ ప్రక్రియను బతికించుకోవడానికై అనేక సదస్సులు నిర్వహించాను. డైరెక్టు కథలతో కొత్త కథ, సరికొత్త కథ, విన్నూత కథ, నవతరం కథానికా సంకలాల్ని తెచ్చాను. రచన, ఆహ్వానం వంటి పత్రికల సహకారంతో సాహితీ లోకంలో నవచైతన్యానికి నాంది పలికాను. ఆర్థికంగా నష్టపడినా భరించాను.

ప్ర: గురజాడ, గిడుగులంటే మీకెందుకంత ఇష్టం?

జ: మనుషులు కష్టసుఖాలు చెప్పుకునే భాషను గ్రంథరచనలో ఉండాలని తాపత్రయ పడినవారు వారిద్దరు. క్రియాశీలంగా గురజాడ కథానిక, నాటకం, కవితల వంటి పక్రియల్లో ఆధునికతను ప్రవేశపెట్టాడు. తన 52 ఏళ్ళ జీవితకాలంలోనే గొప్ప సాహితీసేవ చేశాడు. నిబద్ధత గలవాడు. విశ్వ మానవతావాది, గిడుగు వాడుకభాషకు పట్టంకట్టాడు. ఎంతో మంది ఛాందస సంప్రదాయ వాదుల నెదుర్కొని గెలిచి నిలిచాడు. అందుకే విజయ నగరంలో గురజాడ ఇంటిని స్వంత ఖర్చులతో బాగుచేయించాను. ఆయన దేశభక్తి గేయాన్ని పోరంకి వారి సహకారంతో 24 జాతీయ, అంతర్జాతీయ భాషల్లోకి అనువదింపజేసి ప్రచురించాను. అనేక చోట్లా సెమినార్లు నిర్వహించాను.

గిడుగు సాహిత్య మంతా సేకరించి తెలుగు అకాడెమీ ద్వారా ప్రచురింపజేశాను. సామల రమేష్ బాబుతో కలిసి పర్లాకిమిడి మొదలు గిడుగు అడుగు పెట్టిన అనేక చోట్లతో పాటు ఆయన మరణించిన చెన్నై వరకు సెమినార్లు పెట్టాం.‘గిడుగు పిడుగు’ గ్రంథం రాశాను. ‘సవర సంబంధి’కి సంపాదక, ప్రచురణ బాధ్యతల్ని నిర్వహించాను.

ప్ర:ఇంకా ఇతర సాహితీవేత్తలపై మీ అభిమానాన్నిచాటుకున్నారా?

జ: ఔనండీ! చాలా పేదరికంలో ఉండి కూడా శ్రీపాద వారిజన్మస్థలమైన రాజమండ్రిలో వారి నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశాను. ఆ తర్వాత దాన్నెవరూ పట్టింకోకుంటే దానికో వెల్ల గొడుగునీ ఏర్పరిచాను. జర్నలిస్టు వీరాజి రాసిన శ్రీపాద వారి మోనోగ్రాఫ్‌నీ ప్రచురించాను. శ్రీపాద మంచికథలు కు సంపాదకత్వం వహించాను. అట్లాగే, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, కొనకళ్ళ వెంకటరత్నం గారల శత జయంతి ఉత్సవాల్ని నిర్వహించాను. పాలగుమ్మికి తిరుపతిలో విగ్రహం పెట్టించాను.

ప్ర: మీరు పాతతరం రచయితల్నే గౌరవిస్తారని అపప్రద ఉంది? ఏమంటారు?

జ : ఎవరన్నా రండీ! వేదగిరి కమ్యూనికేషన్స్ ద్వారా విహారి రచన కథాకృతి’ మూడు సంపుటాలు, ఇనాక్ గారి ‘దళితకథలు’ యర్రంశెట్టి హాస్య కథలు, కాలువ మల్లయ్య ‘నేలతల్లి’, శిరంశెట్టి కాంతారావు ‘మట్టి తాళ్ళవల’ కథానికా సంపుటాల్ని ప్రచురించాము. అట్లాగే బాలసాహిత్య కారులెందర్నో ప్రోత్సహించాను.

ప్ర: నేటి యువరచయితలకు ‘కథానిక’ పక్షాన మీరిచ్చే సందేశం!

జ: ‘కథానిక’ రచన విస్మరించరానిది. అతి తక్కువ సమయంలో చదివించబడి, ఎక్కువ సమయంగా ఆలోచింపజేస్తుంది. అది ఆ ప్రక్రియ అంతస్సత్వం ఆ సజీవ ప్రక్రియ నేటియువతరం రచయితలు కాపాడతారనే ఆశ ఉంది.

ముఖాముఖి : డా. పల్లేరు, 9441602605

నేనే గొప్ప వస్తుప్రపంచాన్ని




ఒకప్పుడు
కవితావస్తువుకోసం తలపట్టుకునేవాణ్ణి
దొరికేదిగాదు
బుర్రలో లోకమంతా గిర్రున తిరిగినా
వస్తువు పలికేదిగాదు
అక్షరాలున్నా లాభంలేకపోయేది
భావాలున్న ఫలితం శూన్యం
చెరువెంతున్నా
ఎరలెన్నున్నా ఏంలాభం!?
చెరువులో చేపలు లేనపుడు!
అక్షరాలెన్నున్నా
రాసే చెయ్యి ఎంత పెద్దగున్నా
బుర్రలో వస్తువు మెదలకుంటే సృజనొస్తుందా!?

కవితావస్తువునివ్వని
లోకాన్ని చూసిచూసి విసుగొచ్చింది
నిరసనొచ్చింది
గడ్డంకూడా పెరిగిపోయింది
గడ్డంచేయించుకుంటూ
సెలూన్ అద్దంలో నన్నునేను చూసుకున్నాను
అంతే
కవితావస్తువు దొరికేసింది
నాజీవితం నాకుదొరికేసింది
నాగతం నాకుస్ఫురణకొచ్చేసింది
నాఅనుభవాలన్నీ మనసున కదలాడాయి
గప్పటినుంచి
నాలోంచి
నాఅడుగులసవ్వడిలోంచి కవిత్వం రాస్తున్నా!

తెలుసుకున్నా
కవితావస్తువుకోసం
నన్ను మించిన ప్రపంచంలేదని కళ్లుతెరుచుకున్నా!
ఇప్పుడు
నాజీవితంనుంచే ప్రపంచాన్ని కవిత్వీకరిస్తున్నా!

మెట్టా నాగేశ్వరరావు

జంట పథం



ముద్దు సరే
అరుగు మీది ధారావాహిక ముచ్చట ఎచ్చోట?
అడ్డు లేని ,ఆకాశం ముట్టే స్వేచ్ఛ సరే
అదుపు తప్పిన ,పరిధి మీరిన
పర్యవసాన సోపానాల్లో చోటెక్కడ?
నింగి మబ్బుల్లో చందమామలా దోబూచులాడుతవు మజాలే
నేల లోపల విత్తనమై చిట్ల రావెందుకు
కాకుల అరుపుల చికాకుల దాడుల
కలెబడతవు మరే
చితి దాకా చింత తరలుట ఎట్ల?
గతానుభవాల సుడుల రాత్రుల కలియ తిరుగుతవు భలే
పయన ముంటది
వెలుగు కోసమే అని కదా

దాసరాజు రామారావు, 9618224503

గేయ కవితల్ని పంపండి

విజయ నగరంలోని గేయ కవితా ప్రస్థానం వారు ప్రచురించనున్న గేయ కవితా సంకలనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి గేయ కవితల్ని ఆహ్వానిస్తున్నారు. అచ్చులో ఒక పేజీ మించని, ఐదు చరణాలకే పరిమితమైన గేయాన్ని పంపాలి. అది బాల గేయమైనా సరే, కానీ పంపించే గేయం సామాజిక జీవితానికి సంబంధించినదై ఉండాలి. గేయం తను స్వంతమని హామీ పత్రం, కవి సంక్షిప్త పరిచయం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో ఈ నెల 20 వరకు ఈ చిరునామాకు పంపాలి. సేరపాణి, మురళీ మోహన్ నగర్, పాలకొండ– 535440, జిల్లా: శ్రీకాకుళం, సెల్ : 6281319940

‘జీవిత ఖైదు రద్దు’ పై కవిత్వం కోసం

ఢిల్లీ విశ్వ విద్యాలయ ఆచార్యులు జి.ఎన్. సాయిబాబాను పాలక వర్గాలు అక్రమంగా జైల్లో పెట్టి చిత్రహింసలతో తన మరణం తానే పొందేలా కుట్ర చేస్తున్నారు. ఇది అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు భిన్నంగా జరుగుతున్నదని, ఈ అంశంపై స్పందించి కవితల్ని పంపవలసిందిగా, వచ్చిన కవితల్ని సంపుటీకరించి పుస్తక రూపం కలిగిస్తామని నల్లెల్ల రాజయ్య కోరారు. ఈ నెల 28 వరకు నల్లెల్ల రాజయ్య 7–1–384, పద్మాక్షి నగర్, హన్మకొండ, వరంగల్ అర్బన్‌కుగాని, rajaiahnallella@gmail.comకు మెయిల్ ద్వారా గానీ, పంపాలని ఆయన కోరారు.

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం

కొలకలూరి విశ్రాంతమ్మ పేరిట ప్రతి ఏడాదిలాగే ఈ సారి నాటకానికి పురస్కారాలిస్తున్నారు. పోటి కోసం2015 నుండి 2017 వరకు ప్రచురితాలైన తెలుగు నాటకాలు/ నాటక సంపుటులు మూడు ప్రతులను పంపాలి. ఎంపికైన వారికి పదివేల రూపాయల నగదు, శాలువా, జ్ఞాపిక అందిస్తారు. ఈ నెల 18 వరకు డా॥ కొలకలూరి సుమకిరణ్, ఆంగ్ల శాఖాచార్యులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి – 517502, ఆం.ప్ర.కు అందజేయాలి. సంప్రదించాల్సిన సెల్: 9963564664

కొలకలూరి భాగీరథి కవితా పురస్కారం

పద్యగేయ/ వచన కావ్యాలు/ సంకలనాలు 2015– 2017 మధ్యకాలంలో ముద్రితమైన వాటిని పోటీకై మూడు ప్రతులుగా కొలకలూరి భాగీరథి కవితా పురస్కారానికై పంపాలని కోరుతున్నారు. ఎంపికైన కవి, కవియిత్రికి, పదివేల రూపాయల నగదు, శాలువా, జ్ఞాపికతో పురస్కారం అందిస్తారు. ఈ నెల 18 వరకు – ఆచార్య కొలుకలూరి మధుజ్యోతి, ఆంధ్రాచార్యులు, తెలుగు శాఖ, శ్రీపద్మావతి, మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి–517502, ఆం.ప్ర.కు పంపాలి. సంప్రదించవలసిన సెల్ : 94419 23172

ధిక్కార కవి ఊటుకూరు రంగారావు


సంగిశెట్టి శ్రీనివాస్
9849220321

‘‘నేనొక కవిని/ నేనొక రవిని
కొందరి కమృతం నా కవిత
కొందరికి హాలాహలం నా వెలుగు....’’
‘‘నా కవితా సుధా ధారల్తో
ఈ దరిద్ర ప్రపంచాన్ని
స్వర్గంగా మార్చేస్తా/ నాకెవ్వరి భయం లేదు
నాకొకరి దయ పనికి రాదు
తప్పక పాడేస్తానొక
నిప్పుల తుపాను గీతమై’’

ఊటుకూరు రంగారావు

ఈ కవిత 1950లో ‘నవ్యాంధ్ర’ అనే పత్రికలో అచ్చయింది. అంటే అప్పటికి ఊటుకూరు రంగారావుకు 21 ఏండ్లే. ఈ కవిత ఒక విధంగా ఆయన ఆత్మ. నిప్పుల తుపాను గీతమై తెలుగు నేల మీద వర్షించిండు. తన కవిత్వాన్ని రైతులు, శ్రామికులు, నిరాశ్రయులు, నిరుపేదలు, నిర్జీవులు సైతం వింటారు. ఈ దరిద్ర ప్రపంచాన్ని తన కవితా ధారలతో స్వర్గంగా మార్చేస్తాను అనే హామీని, విశ్వాసాన్ని ప్రకటించాడు. 1949వ సంవత్సరం నుంచి రచనలు చేస్తున్న ఈయన గురించి తెలంగాణ/ తెలుగు సమాజానికి తెలిసింది చాలా తక్కువ. అయితే ఖమ్మం జిల్లాలోని కొంతమంది పాత తరానికి ఈయన గుర్తుండి ఉంటాడు. నిజానికి ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత 55 ఏండ్లకు ఆయన యాదికున్నాడా? అని అడగలేము కాని ఆయన రచనలు, అవి చూపించిన ప్రభావం అంచనా వేయడానికి వీలవుతుంది. శాంతి విప్లవం, సమతావాదం ఆయన మార్గం. అయితే హక్కులు మింగే వాళ్లను ముక్కలుగా కొట్టేస్తాను అని కూడా అనగలిగాడు. ఇలాంటి అద్భుతమైన కవిత్వాన్ని ఎంతగానో సృజించిన రంగారావు తాను బతికున్న కాలంలో అచ్చేసుకున్న ‘శరధార’ను, ఇవే గాకుండా ఆయన రాసిన అనేక విడి కవితలున్నాయి. తర్జుమా చేసిన కథలు, కవిత్వం, అముద్రిత నవల ‘మలిగిన దీపం’ అచ్చు కావాల్సి ఉన్నది. త్వరలో ఆయన తెలుగులో రాసిన డజన్‌కుపైగా కథలు వెలువరించనున్నాము.

ఊటుకూరు రంగారావు గురించి తెలంగా ణ కథలపై పరిశోధన చేస్తున్న క్రమంలో తెలిసి వచ్చింది. ఉర్దూలో హీరాలాల్ మోరియా, కవిరాజ మూర్తి రాసిన అనేక కథలను ఈయన తెలుగులోకి తెచ్చినాడు. వారి కవి త్వాన్ని తెలుగువారికి తెలియ జేసిండు.కవిగా, రచయితగా, జర్నలిస్టుగా, నవలాకారుడిగా, సంగీతం తెలిసిన పాటగాడిగా, బహిరంగ సభల్లో ఉపన్యాసకుడిగా, హక్కుల కార్యకర్తగా, కాంగ్రెస్ అభిమానిగా, సంస్థల నిర్వాహకుడిగా, లైబ్రేరి యన్‌గా, తెలంగాణ రచయితల సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఇట్లా బహుముఖ ప్రతిభను ప్రదర్శించిన ఊటుకూరు రంగారావు తెలంగాణవాడైనందుకు ఈ నేల గర్వించాలి. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ, సంస్కృత భాషల్లో నైపుణ్యం ఉన్న రంగారావు ఉర్దూ మాధ్యమంగా మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువు అక్కడితో ఆగిపోయింది. చదువు ఆగిపోయింది అనే కన్నా తన 16వ యేట నుండి అటు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు జమలాపురం కేశవరావు, హీరాలాల్ మోరియా తదితరుల ప్రోత్సాహంతో సభలు, సమావేశాల్లో పాల్గొనేవాడు. ఎక్కడ ఏ మీటింగ్ జరిగినా దాని ప్రార్థనా గీతం రంగారావే పాడేవాడు. ఉపన్యాసకుల కన్నా ఆయనే ఆనాడు ఎక్కువ పాపులర్. తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా తెలంగాణ సాహిత్యానికి భావజాల మైకం చాలా అన్యాయం చేసింది. కమ్యూనిస్టు భావజాలం ఉన్న వారు వారితో విభేదించే వారిని విస్మరించారు. అలాగే ఆర్యసమాజ్ భావజాలంతో ఉన్నవారు కమ్యూనిస్టులను చీల్చి చెండాడడం ధ్యేయంగా పెట్టుకున్నారు. అయితే ఈ రెండింటికీ అతీతంగా ప్రజల పక్షాన నిలబడి, భావజాలాలకు అతీతంగా ఏది మంచి, ఏది చెడో విచక్షణతో, క్షితతో వ్యవహరించిన వారికి గౌరవం దక్కలేదు. ఇప్పటికీ ఆస్థితి కొన సాగుతోంది. తమ భావజాలం వారు ఏది చేసినా, చెప్పినా, రాసినా దాన్ని గుడ్డిగా నమ్మి ఆచరించడమే ఆనవాయితిగా వస్తోంది. ప్రశ్నించడం, తర్కించడం, బేరీజు వేసుకోవడం తమ పని కాదని ‘ఇజా’ల మతు లో ఉన్నవాళ్ళు భావిస్తున్నారు. తెలుగు సాహిత్యాన్ని ఈ ‘ఇజా’లు కమ్మే యడంతో ‘ప్రజాయిజం’తో ఉన్నటువంటి ఊటుకూరి రంగారావు వెలుగులోకి రాలేదు. ఇట్లా ఆయన రచనలు వెలుగులోకి రాక పోవడం మూలంగా, విమర్శ, విశ్లేషణ, పరిశోధన అనేది ఆయన రచనలపైన జరగలేదు. నిజానికి ‘యిజా’లకు అతీతంగా ఒక ‘సెంట్రిస్ట్’గా కాంగ్రెస్ వాదిగా ఖమ్మం జిల్లాలో దాశరథి, హీరాలాల్ మోరియా, తాళ్ళూరి రామానుజస్వామి, చందా రామకవి, కొలిపాక మదుసూధనరావు, కవి రాజమూర్తిల మాదిరిగా ఎంతో విలువైన సాహిత్యాన్ని కేవలం పదేళ్ళ కాలంలో సృజించిండు. రజాకార్ల దురాగతాలను గూర్చి రాసినాడు. నిజానికి వాటిని ఆయన కుటుంబ సభ్యులు స్వయంగా అనుభవించారు. రంగారావు సోదరుడు ఒకరు కాల్పుల్లో గాయపడ్డాడు కూడా! కాంగ్రెస్ వాదిగా ఆయనకు కొండంత అండగా ఉన్నటువంటి జమలాపురం కేశవరావు ఎన్నికల్లో ఓడిపోవడం, ఆ తర్వాత అర్థాంతరంగా చనిపోవడం అశనిపాతమైంది. ఆయనకు నివాళిగా కవితలు రాసినాడు. రంగారావు కాంగ్రెస్ వాది అయినప్పటికీ స్వాతంత్ర్యానంతరం వారిలో వచ్చిన మార్పును తన కవిత్వంలో తూర్పారా బట్టిండు. ‘‘ఏదో జిత్తుల మాయ నాటకము లెన్నెన్నో ప్రయోగించి, నూ/త్నాదర్శం బిదియంచు జెప్పి, ప్రజలన్ నమ్మించి, పీఠాలు సం/పాదించంగను జూచుచున్న పదవీ వ్యామోహ లుబ్ధా త్ములన్ /బాధించున్ శరధార శూల సమమ్మై, ప్రచ్ఛనమై, మృత్యువై’’ ‘‘నాకు చీకట్లు లేవు చీకాకు లేదు/నా కొక నిరంకుశ ప్రభువాజ్ఞ లేదు/యే నౌకరి జాలిపై బ్రతుకీడ్వలేను/ నేను భారత శక్తి జీర్ణించుకొంటి’’ అని ఇండియాలో హైదరాబాద్ విలీనానంతరం రాసినాడు. మార్పు తథ్యం.అది మంచి వైపు ఉంటుందని విశ్వాసం ప్రకటించినాడు. అందులో ‘‘ఓనిరు పేదలారా! విజయోద యమాన సులౌ చ


ఊటుకూరు రంగారావు–హీరాలాల్ మోరియాతో

సాగిరం/డో నిరుపాధి జీవితము లూడ్చెడి యీ ధనరాజ్య సీమలన్/ ఈ నరక ప్రవాసముల నీ సరిహద్దుల దాటి స్వేచ్ఛ, ప్రా/గ్భాను సమానులై దిశల బ్రాకగ రండిక లెండు వేగమే’’ అని ఉద్బోధించాడు. అంతే గాకుండా ఎవ్వరేమనుకున్నా తన కవి త్వాన్ని ప్రజల కోసమే రాస్తానని జెప్పిండు. ఎదురేదిలేదిక నా కలానికి ఏరేమ న్ననున్ గూడ నాయెదలోనుండు మహాగ్ని జ్వాలలకు చన్నీరే కవిత్వంబింకన్
పదునెక్కింతు పవిత్రలేఖినికి దర్పంబొప్ప లంఘించి, కూల్చెద దౌర్భాగ్య ప్రపంచ గోళమును దోర్లీలా ప్రభావోన్నతిన్ ఇలాంటి ప్రజాభ్యుదయమైన కవిత్వాన్ని రాసిన రంగారావు కాంగ్రెస్ వాది కావడమే ఆయనకు శాపమయింది. ఎందుకంటే ఆయన గురించి పట్టించుకునే వారు, కాంగ్రెస్‌లో సాహిత్యాన్ని ఒక భాగంగా జేసి ప్రోత్సహించే మెకానిజం లేక పోవడంతో ఆయనకు గుర్తింపు దక్కలేదు. పోనీ గుర్తింపు దక్కకున్నా తినడానికి ఒక్కొక్కసారి తిండి కూడా కరువుగా ఉండింది. వీటన్నింటిని అధిగమించి ఆయన కవిత్వం రాసిండు. అదీ నాయకుల మెరమెచ్చుల కోసం కాదు. తాను నమ్మింది ప్రచారం చేయడం కోసం, తనకు తెలిసింది చెప్పడం కోసం, తాను ఆచరించింది ప్రచారం చేయడం కోసం రాసిండు. కేవలం 33 ఏండ్లు మాత్రమే జీవించిన ఈయన ఎప్పటికీ గుర్తుండి పోయే సాహిత్యాన్ని సృజించిండు. రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఆంధ్రప్రాంత విమర్శకులు, చరిత్ర కారుల మూలంగా తెలంగాణ ప్రతిభకు గుర్తింపు లేకుండా పోయిందని చెప్పినాము. ఇప్పుడు ఆమాట చెప్పడానికి వీలులేదు. ఎవరో ఒకరు పూనుకొని తెలంగాణ వాళ్ళే ఆ పని చేయాలి. అందుకే కారణాల గవేషణ గాకుండా, నిర్మాణాత్మకంగా, నిర్దుష్టంగా విస్మరణకు గురైన సాహితీ వేత్తలను, సాహిత్యాన్ని వెలుగులోకి తేవాలి. ఆ ప్రయత్నంలో భాగమే ఈ పుస్తకం. గత 20 ఏండ్లుగా ఆయన గురించి తెలుసుకుంటూ ఉన్నాను. ఆయన కథలు అద్భుతమైనవి. అవి రావాల్సిన అవసరమున్నది. అందులో ఒక అడుగుగా ఈ అక్షరమాల. ఊటుకూరు రంగారావు జీవితం గురించి గూడా కొంచెం పరిచయం కావాలి. ఆయన 1929 డిసెంబర్ ఎనిమిదిన మధిర తాలూకా సత్యనారాయణపురంలో జన్మించినాడు. ఇంట్లో తల్లి, తండ్రి, సోదరులు, సోదరీ అందరూ సాహిత్య సృజన చేసినవారే కావడం ఆయన అదృష్టం. ఇంట్లో కవిత్వముండింది అట్లే కడుపు నిండేందుకు మాత్రం కటకట ఉండింది. కాంగ్రెస్ వాదిగా తన 16వ యేట నుండి ఒక వైపు రజాకార్లను, మరోవైపు కమ్యూనిస్టుల ఆగడాలను కూడా ఆయన స్వయంగా చూసిండు. అనుభవించిండు. ఊరూరా తిరిగి కాంగ్రెస్ భావజాలాన్ని వ్యాప్తి చేసిండు. విజయవాడలోని సాహిత్య సమావేశాలకు తరచుగా హాజరయిండు. అయితే ఖమ్మం పట్టణానికి రమ్మని మోరియా చెప్పినా అక్కడ నేనిమడలేను.. తాను ఊళ్ళోనే ఉంటానని ఒక గ్రామీణుడిగా ప్రపంచాన్ని పరికించిండు. రాసిండు. ప్రజాసేవలో నిమగ్నం కావాలనుకున్న రంగారావుపై ఆయన తండ్రి వత్తిడి తీసుకు రావడంతో అందుకు ఒప్పుకు న్నా డు. అయితే తీరా ముహూర్త సమయానికి రంగారావు తండ్రి చనిపోవడంతో ఆ పెళ్ళి ఆగిపోయింది.

ఆ తర్వాత పూర్వం నిశ్చి తార్థమైన అమ్మాయినే 1955 ఆగస్టు నాలు గున వివాహమాడినాడు. వీరి ద్దరికి 1963 ఫిబ్రవరి 19న ఒక బాబు జన్మించిండు. ఇంట్లో 20 ఏండ్ల పసికందు ఉన్నాడు. మొత్తం సమాజం బాధ్యతంతా తనదిగానే భావించేవాడు గావడంతో తీవ్రమైన వత్తిడికి లోనై 1963 మార్చి 11న ఖమ్మం జిల్లా వైరాలో గుండెపోటుతో మరణించినాడు.
ఖమ్మంలోని విజ్ఞాన నికేతనం గ్రంథపాలకుడిగా 195055 మధ్య కాలంలో, ఆ తర్వాతా, అంతకు ముందు హైదరాబాద్ బులిటెన్, ప్రజాపత్రిక, సార థి, ఆంధ్రపత్రిక విలేకరిగా పనిజేసిండు. ఈయన రచనలు తెలుగు స్వతంత్ర, ఆంధ్రజ్యోతి, సారథి పత్రికల్లో అచ్చయ్యాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం ఖమ్మంలో ‘హిందీ ప్రేమీ మండలి’ని స్థాపించి, భాషా ప్రచారాన్ని మోరియా ప్రభావంతో చేసినాడు. అలాగే అంతకు ముందు ‘తెలంగాణ రచయితల సంఘం’ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేసిండు. జిల్లాలో సాహిత్య వాతావరణం పెరగడానికి ఆయన ప్రధాన కారకుడు రంగారావు. యువకుల నుంచి వృద్ధుల వరకూ అందరితో కలసి పనిచేసిండు. ఎవరెక్కడికి రమ్మన్నా అక్కడికి వెళ్ళి తన పాటలు, ఉపన్యాసాల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసినాడు. తన సాహిత్యం ద్వారా చిరస్థాయిగా నిలిచిండు. రంగారావు సోదరులు గోవిందరావు, కృష్ణమూర్తిలు ‘అశ్రుతర్పణం’ పేరిట సంస్మరణ సంచికలో ఇట్లా రాసినారు. స్వంతము కోస మొక్క నిమిసంబును యోచన సేయ లేదు, శ్రీమంతులవటంచు దుర్మలిన మత్తు స్తోత్రమొనర్చలేదు, వారెంతపదస్థులైన గణియింపగలేదు, నిజమ్ము పల్కుచో సుంత భయమ్మెరుంగవు విశుద్ధము నీ చరితమ్ము సోదరా! అట్లాంటి మహనీయుడి గురించి భవిష్యత్తరాల వారికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మన తెలంగాణ
5
హైదరాబాద్
సోమవారం
1 జనవరి, 2018
www.manatelangana.news



ఎం.జి.గోపాల్

నైపుణ్యంతోనే అవకాశాలు అధికం

లక్ష్యానికి ఆర్థిక సమస్యలు అడ్డుకావు. నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్తేనే గమ్యాన్ని చేరుకోవచ్చు. ఏ సబ్జెక్ట్‌లో మీకు నైపుణ్యాత ఉంటుందో దాంట్లోనే అభివృద్ధి సాధించే అవకాశాలు అధికంగా ఉంటాయి. సివిల్స్ శిక్షణలో నిర్వహించే స్వతంత్ర శాఖలు బాధ్యతలు చేపట్టిన అనంతరం పాఠాలుగా ఉపయోగపడతాయని సుధీర్ఘ అనుభవంతో ఇటీవల పదవీవిరమణ చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.జి. గోపాల్ జీవన గమనంలో స్పష్టమవుతున్న అంశాలు. ఎనిమిది మంది ముఖ్య మంత్రులతో బాధ్యతలు నిర్వహించిన ఆయన జీవితం ఓ పుస్తకం. తెలంగాణ ప్రభుత్వంలో కీలక శాఖల్లోని విధులు నిర్వహించి అభివృద్ధి కోసం అనేక చట్టాలు తయారు చేసిన ఎం.జి.గోపాల్‌తో విజేత మాటామంతీ..

సివిల్స్ చదవాలనే ఉత్సాహం ఉన్నవారికి, శిక్షణ పొందుతున్న వారికి మీరు ఇచ్చే సూచనలు ?

అందరు సివిల్స్ చదవడం ఒక యజ్ఞంలా భావిస్తారు. నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళితే సులువుగా గమ్యాన్ని చేరుకోవచ్చు. అభిరుచి ఉన్న సబ్జెక్ట్‌లో నైపుణ్యత సాధించేందుకు కృషి చేయాలి. ప్రధానంగా మన చుట్టూ ఉన్న సమస్యలు, అభివృద్ధి సంఘటనలను నిరంతరం అధ్యయనం చేయాలి. నాకు కామర్స్ అంటే ఇష్టం అందుకే ఇంటర్ తర్వాత బికాంలో చేరాను. ఆ తర్వాత ఎంకాం చేశాను. అలాగే ఐ.పి.ఇ చదవడంతో పాటు ఆనాటి ఆర్థిక పరిస్థితులను తట్టుకునేందుకు పార్ట్ టైం జాబ్స్ కూడా చేసాను. కామర్స్‌లో పట్టు ఉందనే అభిప్రాయం వచ్చిన అనంతరం సివిల్స్ రాశాను .అయితే తొలి ప్రయత్నంలో మెయిన్స్ రాలేదు, అయినా కుంగిపోకుండా 1982 లో చేసిన ప్రయత్నం ఫలించింది. "మసోరిలో" శిక్షణ పొందాను. శిక్షణ కాలంలో ఆర్మూర్ తహసిల్దార్, బి.డి.ఒలతోపాటు బోధన్ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించాను. శిక్షణ పూర్తి అయిన అనంతరం ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్‌గా 1985లో బాధ్యతలు తీసుకున్నాను. ఏటూరినాగారంలో పి.ఓ. ఐటిడిఏ బాధ్యతలు నిర్వహించాను.

పార్ట్ టైం జాబ్స్ చేసి చదివారని తెలిసింది?

అవును పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తూ ఉన్నత చదువులు చదివాను. మా నాన్న ఖమ్మంలోని ఎస్.ఆర్.ఎన్.బి.ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఎం.ఏ హిందీ పండితుడు. నాకు ఇంట్లోనే చదువు నేర్పించి, ఏడేళ్ల వయసులో 5వ తరగతిలో చేర్పించారు. ఇంటర్మీడియట్ వరకు అక్కడ చదివించి, ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కి పంపించారు. అయితే ఆనాటి ఆర్థిక పరిస్థితుల కారణంగా పార్ట్ టైం ఉద్యోగం చేసి చదువుకోవాలని ఎం.బి.ఐ. శర్మ చెప్పారు. ఈ అంగీకారంతో హైదరాబాద్‌లో ఎల్.ఐ.సి ఏజెంట్ గా చేరి నిజాం కళాశాలలో సాయంత్రం సమయంలో బికాం చదివాను. ఆ తర్వాత యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లరికల్, పి.ఓ గా ఉద్యోగం చేసి ఎం.కాం, ఐ.పి.ఇ పూర్తి చేశాను. ఓ వైపు కామర్స్‌కు సంబంధించిన ఉద్యోగాలు, మరోవైపు కామర్స్ చదువులతో ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులతో సివిల్స్ ప్రిపేర్ అయ్యాను.

ఆదిలాబాద్ జిల్లాలో మీ పేరుతో ఒక గ్రామం ఉంది ఎప్పుడు ఎవరు నిర్మించారు ?

> **ఏటూరినాగారంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి శ్రమించాను. కాంతనపల్లిలో గిరిజనులకు వ్యవసాయం చేయడం, దానికి సంబంధించిన పద్ధతులను నేర్పించడంతో అక్కడ మిర్చి, పసుపు పంటకు ప్రాధాన్యం పెరిగింది. మేడారం జాతరలో గిరిజనులకే కాంట్రాక్టు పనులను అప్పగించడం నా ఆధ్వర్యంలోనే జరిగింది.**

ఆ రోజుల్లో ఎస్టీల భూములు కొంతమంది మధ్యదళారుల పేర్లపై ఉన్నట్లు రికార్డులు పరిశీలించగా బహిర్గతమైంది. గిరిజనుల భూములు గిరిజనులకే చెందాలనే చట్టాలను రూపొందించి వారికి భూముల వివరాలు తెలియచేశాను. మధ్య దళారులను పంపించడంతో కౌటాల మండలం బాబాసాగర్ దగ్గర అక్కడి గిరిజనులు నాపై అభిమానంతో నాకు తెలియకుండానే నా పేరుతో ఒక గ్రామం నిర్మించుకున్నారు. అలాగే ఏటూరినాగారంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి శ్రమించాను. కాంతనపల్లిలో గిరిజనులకు వ్యవసాయం చేయడం దానికి సంబంధించిన పద్ధతులను నేర్పించడంతో అక్కడ మిర్చి, పసుపు పంటకు ప్రాధాన్యం పెరిగింది. మేడారం జాతరలో గిరిజనులకే కాంట్రాక్టు పనులను అప్పగించడం నా ఆధ్వర్యంలోనే జరిగింది.

ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ రాష్ట్రంలో అనేక శాఖలకు మీరు ముఖ్యకార్యదర్శిగా బాధ్యలు నిర్వహించారు. వాటిలో ఏ శాఖలో తృప్తి లభించింది?

తిరుమల తిరుపతి దేవస్థానంలో సి.ఇ.ఓ గా బాధ్యతలు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మూడు వరుసల క్యూ విధానం ప్రవేశపెట్టడంతో పాటు ఆన్‌లైన్ టిక్కెట్ విధానాన్ని నేను ప్రవేశపెట్టినందుకు ఎంతో తృప్తిగా ఉంది. అలాగే ఇంజనీరింగ్ కళాశాలల క్రమబద్ధీకరణ, ఫీజుల నియంత్రణ, హైదరాబాద్‌కు కృష్ణా నీటి తరలింపు తొలిదశ, ఏలూరు భూకుంభకోణాన్ని వెలికితీయడం. వర్షాఛాయ ప్రాంతాల ప్రణాళిక రూపకల్పన, ఎక్సైజ్ శాఖలో సంస్కరణలు, మూసీ సుందరీకరణ ఉత్తర్వులు అనేకంగా ఉన్నాయి. ఏ విధానమైనా, ఏ ప్రణాళిన అయినా ఆయా ప్రభుత్వాల ఆలోచనలకు దర్పణం పడతాయి. తెలంగాణ ప్రభుత్వంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నిర్వహించిన విధులు ఉన్నతమైనవి. రెవెన్యూ సంస్కరణలపై ప్రభుత్వం చేసే పాలసీలు భవిష్యత్ అవసరాలకు ఎంతో ముఖ్యం.

విధుల నిర్వహణలో ఎవరి మాట వినేవారు కాదంటారు ?

ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ప్రణాళికల సాధ్యాసాధ్యాలను పరిశీలించి పాలసీలను రూపొందించాల్సి ఉంటుంది. అయితే అనేక సందర్భాల్లో ధీర్ఘమైన చర్చలు జరుగుతాయి. పాలకవర్గాలకు నచ్చకపోతే ఐ.ఏ.ఎస్‌లకు బదిలీలు తప్పవని అంటారు.

తెలంగాణలో అధికారుల కొరత ఉందంటారు నిజమా ?

అధికారులు ఇంకా అవసరం ఉన్నారు. అయితే ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు వెళ్ళడంతో పాటు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుగారి ఆలోచనలు దూరదృష్టి ప్రణాళికలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి.

వి. భూమేశ్వర్
మన తెలంగాణ ముఖ్య ప్రతినిధి

మీకు మీరే పోటీ



పోటీ మంచిదేనా కాదా అంటే కచ్చితంగా మంచిదే అని చెప్పొచ్చు. ఉద్యోగ జీవితంలో ఎదగాలంటే ఆరోగ్యకరమైన పోటీ అనేది ఉండాలి. అది విమర్శలకు దారితీసేదిగా ఉండకూడదు. శతృత్వాన్ని తెచ్చుకొనేదిగా ఉండొద్దు. ఎదుటివారి లోపాలను చూడటమే పనిగా పెట్టుకుని, ప్రతి పనికీ అడ్డుకొట్టడమనేది ఆరోగ్యకరమైన పోటీ కానేకాదు. ఒకవేళ అటువంటి లక్షణాలు మీలో ఉంటే కనుక వాటి నుంచి కచ్చితంగా బయటపడాల్సిందే...

పక్కవారితో తమ ఆలోచనల్ని చాలా మంది పంచుకోరు. ఎక్కడ వాళ్లు తమ ఐడియాలను కొట్టేస్తారనే భయం ఉంటుంది. దాంట్లో చేసిన పనిపై ఇతరుల అభిప్రాయాల్ని అడగరు. ఇది తప్పు. ఎదుటివారి ఆలోచనల్ని ఆహ్వానించాలి. బాగుంటే అభినందించాలి. ఇలాంటి ఆరోగ్యకరమైన పోటీ ఉంటే కార్యాలయాల్లో ఒత్తిడికి గురికాకుండా పనిచేసుకోవచ్చు. ఎదగడానికి ఇలాంటి మనస్తత్వం పనికొస్తుంది. మీకు మీరే పోటీ అనుకోవాలి. మీ పాత విజయాలను మీరు దాటి మరికొంత సాధించడానికి కృషి చేయాలి. మీకు మీరే గొప్ప విమర్శకులు కావాలి. అంతేకాకుండా కార్యాలయాల్లో లేనిపోని ఇగోలకు పోకుండా ఎదుటివారిలో మంచి లక్షణాలుంటే వాటిని తీసుకోవాలి. కానీ మీ లక్ష్యం మాత్రం మిమ్మల్ని మీరు అధిగమించడమే అయి ఉండాలి. ఉద్యోగంలో మీకంటూ ఒక మెంటార్ ఉండటం అవసరం. అనవసరమైన అలజడులు, సమస్యల నుంచి వారి ద్వారా దూరం కావచ్చు. మీ పనితీరూ సామర్థ్యం పెరగడానికి దోహదపడతారు. అలా అనుభవజ్ఞుల సాయం తీసుకోవడం తప్పులేదు.

సరదాగా..

మీ అబ్బాయి ఏం చేస్తూ ఉంటాడు ?
ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ బిజినెస్.
అవునా ఏమి బిజినెస్ ??
వాట్సాప్‌లో వచ్చినవి ఫేస్‌బుక్‌లోకి, ఫేస్‌బుక్‌లో వచ్చినవి వాట్సాప్‌లోకి పంపుతూ ఉంటాడు.

ఉద్యోగి: సార్, నాకు జీతం పెంచండి. మూడు కంపెనీలు నా వెంట పడుతున్నాయి తెలుసా ?
యజమాని: మూడు కంపనీలా, ఏంటవి ?
Electricity, mobile and Credit Card.

రెండు రోజులు ఆఫీసుకి రాని సురేష్‌ను మర్నాడు పిలిచిన బాస్ ఇలా అడుగుతున్నాడు.
బాస్: ఏమయ్యా రెండు రోజులు చెప్పకుండా ఎక్కడికి వెళ్లిపోయావు?
సురేష్: మా తాతగారు సడెన్‌గా పోయారండి దహానానికి వెళ్లాను.
బాస్: ఇక మీదట ఇలాంటి సందర్భాల్లో ముందే చెప్పి వెళ్లు..

సమతౌల్యం పాటించండి..



ఇప్పుడున్న రోజుల్లో ఉద్యోగస్తులకు ఆఫీసే మొదటి పెళ్లాం అయింది.....పెళ్లిరోజు కూడా ఆఫీసుకు వెళ్తుంటే మొహం మాడ్చుకుంటుంది మీ జీవిత భాగస్వామి. కనీసం ఈ ఒక్క రోజయినా సెలవు పెట్టొచ్చు కదా అని కొందరు... అమ్మ నాన్న పేరెంట్స్ మీటింగ్‌కు రావడంలేదని టీచర్ చిన్నోన్ని తిడుతుంటే వాళ్లు ఇంట్లో చేసే అల్లరి. బాధ్యతలు పెరిగే కొద్దీ వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో వారికి తీవ్ర సమస్య అవుతుంది.

ఇంట్లో కూర్చుని ఆఫీసులోని వ్యవహారాల్ని చర్చించుకోవడం, ఆఫీసులో కూర్చుని ఇంటి విషయాలు ఆలోచించడం తప్పు. దీని వల్ల.... అటు వృత్తి జీవితం దెబ్బ తింటుంది. ఇటు వ్యక్తిగత జీవితమూ ఇబ్బందుల్లో పడుతుంది. ఆఫీసు ఒత్తిడిని ఇంటికీ, ఇంట్లోని చికాకుల్ని ఆఫీసుకూ మోసుకెళ్లడం వల్ల –రెండు వైపులా నష్టమే. వృత్తి, కుటుంబ జీవితాల మధ్య చక్కని సమతౌల్యాన్ని పాటించడం వివేకవంతుల లక్షణం. ఆ మధ్య రతన్‌టాటా యువ గ్రాద్యుయేట్లతో సంభాషిస్తూ ఒకే రోజు మీ చేతికి ప్రమోషన్ లెటరూ, విడాకుల నోటీసూ వచ్చాయనుకోండి, సంతోషిస్తారా, బాధపడతారా అని అడిగారు. నిజమే దేనికదే ముఖ్యం, దేనికదే విలువైంది. మనిషి జీవితంలో రెండూ కలిస్తేనే బతుకు పరిపూర్ణం. రెండు విజయాల్నీ ఆస్వాదించాలంటే రెండు జీవితాల్నీ సమర్థంగా నిర్వర్తించాలి. కెరీయర్‌లో పోటీ, లక్ష్యాల కోసం ఒత్తిడి, అభద్రత, ఇంకా ఎదగాలన్న బలమైన ఆకాంక్ష... రకరకాల కారణాల వల్ల వృత్తి జీవితానికి సాధ్యమైనంత సమయాన్ని వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుటుంబానికి కొంత తక్కువ సమయం కేటాయించినా, ఆ కేటాయించేదేదో అందరితో సంతోషంగా నాణ్యమైన సమయాన్ని కేటాయిస్తే ... ఎంతోకొంత నయం. కుటుంబం కోసం ఇన్‌కమ్, కంపెనీ కోసం అవుట్‌కమ్ రెండూ ముఖ్యమే. ఒకదాన్ని తగ్గించుకోకుండా, రెండోదాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలి. వ్యక్తి జీవితంలో ఇటు ఉద్యోగం అటు కుటుంబం రెండూ కూడా ముఖ్యమైనవి.

సిఎం, గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



మన తెలంగాణ / హైదరాబాద్ : ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్, గవర్నర్ నరసింహన్‌లతో పాటు పలువురు మంత్రులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో గడపాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలన్నీ 2018 సంవత్సరంలో కూడా విజయవంతంగా ముందుకు సాగాలని కెసిఆర్ ఆకాంక్షించారు. కొత్త సంవత్సరం తెలుగు ప్రజలకు సుఖ సంతోషాలనివ్వాలని, ప్రతి ఒక్కరూ సంతోషంగా గడిపే పరిస్థితులు చోటుచేసుకోవాలని గవర్నర్ రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాలల చిన్నారులు, వివిధ సెక్షన్ల ప్రజల నుంచి రాజ్‌భవన్‌లో శుభాకాంక్షలందుకున్న గవర్నర్ ప్రతి ఒక్కరికీ నూతన సంవత్సరం శుభం కలిగించాలని కోరుకున్నారు. శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ సైతం ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తన సందేశంలో రాష్ట్రంలోని రైతులు, కార్మికులు, బడుగు బలహీనవర్గాల ప్రజలు, అట్టడుగు వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల కష్టాలు తొలగిపోయి ఆనందంతో ఉండేలా శుభగడియల్ని తీసుకురావాలని ఆకాంక్షించారు.

కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం



మన తెలంగాణ / జోగులాంబ గద్వాల : గద్వాల పట్టణంలోని జయలక్ష్మి కాటన్ మిల్లులో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పత్తి బేళ్లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది. మిల్లులో నాలుగు కోట్ల రూపాయల విలువ చేసే పత్తి ఉంది. అయితే ఈ ప్రమాదంలో సుమార యాభై లక్షల రూపాయల విలువ చేసే పత్తి దగ్ధమైనట్టు మిల్లు యజమాని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తత్కాల్‌పై సిబిఐ దృష్టి

దిల్లీ: రైల్వే తత్కాల్ బుకింగ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్స్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. ఇటీవల అక్రమ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి తత్కాల్ కుంభకోణానికి పాల్పడిన ఉదంతం వెలుగుచూసిన నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించింది. సిబిఐలో ప్రోగ్రామర్‌గా పనిచేస్తూ అక్రమ సాఫ్ట్‌వేర్‌ను ఏజెంట్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న అజయ్ గార్గ్ అనే వ్యక్తిని ఇటీవల సీబీఐ అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. గార్గ్‌ను విచారించిన సందర్భంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. తత్కాల్‌బుకింగ్‌కు సంబంధించి మోసపూరిత సాఫ్ట్‌వేర్‌లు ఆన్‌లైన్‌లో కొంతమొత్తం చెల్లింపుపై దొరుకుతున్నాయని గుర్తించారు. ఆయా సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి కొందరు ఏజెంట్లు బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేసి టికెట్లను పొందుతున్నారని సీబీఐ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అలాంటి సాఫ్ట్‌వేర్‌లపై దృష్టి సారించామని, ఎవరైనా తప్పుచేశారని తేలితే చర్యలు తప్పవని సీబీఐ అధికారి ఒకరు హెచ్చరించారు. అలా చేయడం ఐఆర్‌సీటీసీ, రైల్వే శాఖ నిబంధనల ప్రకారం అక్రమమని పేర్కొన్నారు.

అమిత్ షావి కాలం చెల్లిన వ్యూహాలు

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య మరోసారి భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు అమిత్ షాపై తీవ్ర విమర్శలు చేశారు. అమిత్ షావి కాలం చెల్లిన వ్యూహాలని ఆయన అన్నారు. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ విజయం తరువాత కర్ణాటక మీద బీజేపీ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రమైన కర్ణాటకలో మళ్లీ పాగా వేసేందుకు కమల దళం సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీ చీఫ్ అమిత్ షా శనివారం బెంగళూరు వచ్చారు. అమిత్ షా బెంగళూరు రావడంపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. అమిత్ షాది కాలం చెల్లిన వ్యూహాలని ఆయన మీడియాతో అన్నారు.

విద్యుత్ సంబురం

(మొదటిపేజీ తరువాయి)

ఉండేది. కానీ ఐదు నెలల వ్యవధిలోనే విద్యుత్‌రంగ ముఖచిత్రం మారిపోయింది. ఇప్పుడు ఏకంగా వ్యవసాయరంగానికి కూడా 24 గంటల ఉచిత విద్యుత్‌ను సమకూర్చే స్థాయికి చేరుకుంది. ఈ మూడున్నరేళ్ళలో 8,271 మెగావాట్ల అదనపు విద్యుత్‌ను సమకూర్చుకుని 14,845 మెగావాట్లకు చేరుకున్నాం. సమీప భవిష్యత్తులో (2022 సంవత్సరం నాటికి) మరో 13 వేల మెగావాట్లను సమకూర్చుకుని 28 వేల మెగావాట్ల లక్ష్యానికి చేరువకానున్నాం. వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్‌ను అనేక రాష్ట్రాలు సమకూరుస్తున్నా తెలంగాణ తరహాలో ఏ రాష్ట్రమూ ఉచితంగా ఇవ్వడంలేదు. విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం అవలంబించిన దశలవారీ విధానం ఆశించిన ఫలితాలనే ఇచ్చింది. గతేడాది జూలై నుంచి మెదక్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 24 గంటల విద్యుత్‌ను అందించే పైలట్ ప్రాజెక్టు ప్రభుత్వానికి స్ఫూర్తినిచ్చింది. దీని కొనసాగింపుగా గతేడాది నవంబరు నుంచి అన్ని జిల్లాల్లో గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా లక్ష్యాన్ని 15 రోజుల పాటు అమలుచేసి చూసింది. ఇది కూడా ప్రభుత్వం ఆశించిన ఫలితాలను ఇవ్వడంతో 2018 సంవత్సరం ప్రారంభం నుంచే రాష్ట్ర ప్రజలకు 24 గంటల విద్యుత్ సరఫరాను కానుకగా ఇచ్చింది. ఈ పదిహేను రోజుల వ్యవధిలో విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేసిన ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లు సగటున 9500 మెగావాట్ల విద్యుత్ అవసరం అని భావించింది. అయితే రానున్నది వేసవికాలం, ఆ తర్వాత వివిధ సాగునీటి ఎత్తిపోతల పథకాల ద్వారా విద్యుత్ వినియోగం మరింత పెరిగి 11 వేల మెగావాట్లు అవసరమవుతుందని అంచనా వేసింది. దీనికి తగిన ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో పాటు లోడ్ పెరగడం వల్ల వచ్చే సాంకేతిక సమస్యలను అధిగమించడానికి అప్రమత్తంగా ఉండాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రం ఏర్పడేనాటికి 400 కెవి సబ్‌స్టేషన్లు ఆరు మాత్రమే ఉంటే 13 వేల మెగావాట్లను లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం కొత్తగా తొమ్మిది సబ్‌స్టేషన్ల నిర్మాణానికి పూనుకుంది. సూర్యాపేట, నర్సాపూర్, అసుపాక, డిండి, మహేశ్వరంలలో ఐదు 400 కెవి (3980 మెగావాట్ల సామర్థ్యం) సబ్‌స్టేషన్లను నిర్మించింది. జూలూరుపాడు, నిర్మల్, కేతిరెడ్డిపల్లి, జనగామలలో మరో నాలుగు 400 కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణం ప్రస్తుతం జరుగుతూ ఉంది. వీటికి తోడు 220 కెవి సామర్థ్యంతో 19 కొత్త సబ్‌స్టేషన్లను, 132 కెవి సామర్థ్యంతో 35 సబ్‌స్టేషన్లను నిర్మించింది. అన్ని గ్రామాలకూ విద్యుత్ సౌకర్యం ఉండాలన్న ఉద్దేశంతో 2695 కి.మీ. మేర 400 కెవి విద్యుత్ లైన్లు, 6900 కి.మీ. మేర 220 కెవి లైన్లు, 10321 కి.మీ. మేర 132 కెవి లైన్ల నిర్మాణం జరిగింది. ఈ మూడున్నరేళ్ళ కాలంలో 1724 కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం కూడా జరిగింది.

గతంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు ఆటోస్టార్టర్లను సమకూర్చుకున్నారు. కానీ ఇప్పుడు 24 గంటల విద్యుత్ సరఫరా అమల్లోకి వచ్చినందువల్ల ఇక వాటి అవసరమే లేదని రైతుల్లో అవగాహన కల్పించిన ప్రభుత్వం తప్పనిసరిగా తొలగించుకోవాలని ఆదేశించింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రత్యేక దృష్టి పెట్టిన కారణంగా ఎట్టకేలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు రాష్ట్ర అవసరాలకు సరిపోయేంత విద్యుత్‌ను సమకూర్చుకోవడంలో విజయవంతమైన ఫలితాలే వచ్చాయి. మరో ఐదేళ్ళలో విద్యుత్ రంగంలో రాష్ట్రం సరికొత్త రికార్డును సృష్టించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రగతి పరుగు..సంక్షేమ వెలుగు



(వనం జ్వాలా నర్సింహారావు)

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ప్రప్రథమంగా అనేక వినూత్నమైన ప్రాజెక్టులు, పథ-కాలు, కార్యక్రమాలను అమలు పరుస్తోంది. అన్ని రంగాల్లోనూ ప్రగతిదాయకంగా నిలుస్తూ, సంక్షేమ ఫలాలను అందిస్తూ ముందుకు సాగుతున్న వాటిలో కొన్నిటి గురించి...



2018 జనవరి 1 నుంచి వ్యవసాయం, ఇతర రంగాలకు 24 గంటల పాటు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా ఇలాంటి తరహా పథకాన్ని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు ఎకరాకు రూ.8 వేల (రూ.4వేల చొప్పున)ను ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. తద్వారా వ్యవసాయ రంగం భవిష్యత్‌లో లాభాలను ఆర్జించే రంగంగా రూపుదిద్దుకోనుంది. రైతులకు ప్రభుత్వం పంట పెట్టుబడిని ఇస్తుండడం ఇదే ప్రప్రథమం. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు రైతు సమితులను ఏర్పాటు చేయడం దేశంలోనే ఓ విప్లవాత్మకమైన అడుగు. ఈ రైతు సమన్వయ సమితులు రైతులకు రూ.8వేలను పంట రుణంగా ఇచ్చేందుకు పారదర్శకమైన విధానంలో భూ రికార్డుల నిర్వహణను పర్యవేక్షిస్తాయి. రైతులు తమ ఉత్పత్తులకు కనీస మద్దతుధర పొందేందుకు ఇది దోహదపడుతుంది.

తెలంగాణ తన వార్షిక బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి ఏడాదికి రూ.25వేల కోట్లను కేటాయించింది. దీంతో తెలంగాణలో ఎత్తిపోతల పథకాల వంటి అనేక భారీ, పెద్ద, మధ్య తరహా, చిన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడాకి దోహదపడుతోంది. రాష్ట్రంలో కోటి ఎకరాల వ్యవసాయ పొలాలకు సాగునీరందించే కలను సాకారం చేసుకునేందుకు సాయపడుతోంది. రాష్ట్రంలో ఉద్యానవనాల సాగుకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. పాలీ హౌస్‌లు, గ్రీన్ హౌస్‌లకు సబ్సిడీలను ఇస్తున్నది. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 95 శాతం, ఇతర రైతులకు 75 శాతం వరకు సబ్సిడీని అందిస్తోంది. ఇందుకు గాను భూ పరిమితిని కూడా ఎకరం నుంచి మూడు ఎకరాలకు పెంచింది. బిందు సేద్యానికి కూడా 80—100 శాతం సబ్సిడీని అందజేస్తున్నది. కాకతీయుల పాలనలో వేలాదిగా ఉన్న గొలుసు కట్టు చెరువుల్లో పూడికతీత ద్వారా వాటిని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'మిషన్ కాకతీయ' పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా 46 వేల చెరువులను అంటే ఏడాదికి 9వేల చెరువులను పునరుద్ధరించి, వినియోగంలోకి తెస్తున్నది. మార్కెట్ కమిటీల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా రిజర్వేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. భూ వివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు, భూ రికార్డులను ప్రక్షాళన చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది.

వ్యవసాయాన్ని వృత్తిగా మార్చేందుకు, లాభాల బాట పట్టించేందుకు ప్రతి 5వేల ఎకరాలకు ఒక కమతాన్ని ఏర్పాటు చేసి, రైతులకు సూచనలు అందించేందుకు కమతానికో వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించింది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఇచ్చే పరిహారాన్ని సెప్టెంబరు 2015లో రూ. 6 లక్షలకు పెంచింది. అలాగే, గీత కార్మికులు, మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వతంగా వికలాంగులుగా మారినా రూ.6 లక్షలు అందిస్తోంది. హోంగార్డులు, జర్నలిస్టులు, నిర్మాణ రంగ కార్మికులు, డ్రైవర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.5 లక్షలు బీమా పరిహారం అందుతుంది. దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న ఉన్న కుటుంబాల్లో కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా అమ్మాయి వివాహానికి రూ.51వేల ఆర్థిక సాయాన్నిఅందిస్తున్న ప్రభుత్వం దీన్ని రూ.75,116 లకు పెంచింది. వికలాంగులు పెళ్లి చేసుకుంటే వారికి అందించే సాయాన్ని కూడా 50 వేల నుంచి లక్షకు పెంచింది.

పేదలకు ఉచితంగా రెండు పడకల ఇండ్లను అందిస్తోంది. 2017 జూన్ వరకు మొత్తం 2.66 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి సైతం సురక్షిత, స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు 'మిషన్ భగీరథ' పథకాన్ని ప్రారంభించింది. నాబార్డు, హడ్కో, మరో 18 ఇతర బ్యాంకులు ఈ ప్రాజెక్టుకు నిధులను సమకూరుస్తుండగా, మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. రెండు దశల్లో చేపట్టే ఈ పథకం మొదటి దశలో 2017 చివరి నాటికి 25,00కు మించి హ్యాబిటేషన్లకు సురక్షిత, స్వచ్ఛమైన, మంచినీరు అందనుంది. రెండో దశలో భూగర్భ పైపులైన్ల నిర్మాణం 2018 మధ్య నాటికి పూర్తవుతుంది. 'తెలంగాణకు హరితహారం' పథకం కింద 230 కోట్ల మొక్కలను నాటించింది. ప్రతి గ్రామానికి ఒక నర్సరీని ఏర్పాటు చేయనుండగా, కాంపా, తదితరాల ద్వారా నిధులు సమకూరుతున్నాయి.

దేశంలోనే ప్రప్రథమంగా రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించింది. రాష్ట్రమంతటా ఒక్క రోజులో నిర్వహించిన ఈ సర్వేలో కోటి తొమ్మిది లక్షల కుటుంబాలకు చెందిన సామాజిక—ఆర్థిక డేటాను సేకరించింది. మహిళా శాసనసభ్యుల కోసం ఆయా నియోజకవర్గాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసింది. తెలంగాణ రూపురేఖలను మార్చేందుకు, జిల్లా పాలనా యంత్రాంగాలకు మరింత ఊతాన్ని ఇచ్చేందుకు ప్రతి ఎంఎల్‌కు రూ.3 కోట్లను ముఖ్యమంత్రి కెసిఆర్ మంజూరు చేశారు. ఒంటరి మహిళలకు పెన్షన్ పథకాన్ని ప్రారంభించింది.

రాష్ట్రంలోని దాదాపు 5 వేల ప్రార్థన మందిరాల్లో ఇమామ్, మౌజామ్‌లకు నెలకు రూ.1500 చొప్పున పెన్షన్‌ను ప్రభుత్వం అందిస్తోంది. రూ.1000 నుంచి రూ.1500లకు పెరిగిన ఈ పెన్షన్‌ను 8,934 మంది అందుకుంటున్నారు. 2014 సెప్టెంబరులో 'సాంస్కృతిక సారథి'ని ఏర్పాటు చేసింది. తెలంగాణ ఉద్యమంతో క్రియాశీలకంగా పాల్గొన్న 550 మంది కళాకారులకు దీని ద్వారా ప్రభు త్వం ఉద్యోగాలు ఇచ్చింది. అలాగే, హాస్టళ్లలో విద్యార్థులకు పోషకారాన్ని అందించేందుకు సన్నబియ్యాన్ని అందిస్తోంది. అంగన్‌వాడీలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేసింది. రాష్ట్రంలో ఇప్పుడు 32,569 విద్యా సంస్థల్లో 32,70,370 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. 'న్యాయవాదుల సంక్షేమ నిధి'కి రూ.100 కోట్లను కేటాయించింది. అలాగే, జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్‌కు కూడా రూ.50 కోట్లను కేటాయించింది. బ్రాహ్మణ వెల్ఫేర్ ఫండ్‌కు రూ. 100 కోట్లను మంజూరు చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అర్చకులకు కూడా నెలసరి వేతనాన్ని అందిస్తోంది. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల కోసం రాష్ట్రంలో అదనంగా 542 రెసిడెన్షియల్ పాఠశాలలతోపాటు కళాశాలలను ప్రారంభించింది. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల విద్యార్థుల కోసం ఇచ్చే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ను రూ.20లక్షలకు పెంచింది. తండాలు, గూడెంలను పంచాయతీలుగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఎంబిసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, దానికి 2017—18 సంవత్సరానికి రూ.1000 కోట్లను కేటాయించింది. యాదవ్‌లు, కుర్మలకు 75 శాతం సబ్సిడీతో గొర్రెలను పంపిణీ చేస్తున్నది. రూ.5వేల కోట్ల బడ్జెట్ అంచనాతో ఈ పథకాన్ని 2017 జూన్ 20న ప్రారంభించింది. రూ.14.65 లక్షలతో వంద సంచార వెటర్నరీ క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చింది.

నూలు, రసాయనాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తోంది. నేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1200 కోట్లను కేటాయించింది. ఆటోలు, ట్రాక్టర్లకు రవాణా పన్నును ఎత్తివేసింది. ట్రాఫిక్ పోలీసులకు 30 శాతం కాలుష్య భత్యాన్ని, సెక్యూరిటీ వింగ్ పోలీసులకు 30 శాతం రిస్క్ అలవెన్స్‌ను అందిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు, పాత్రికేయుల కోసం వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి,11,35,701 హెల్త్ కార్డులను జారీ చేసింది. సింగరేణి కాలనీ కార్మికులకు 2017—18 సంవత్సరానికి గాను లాభాల్లో 25 శాతం బోనస్‌ను ప్రకటించింది.మాజీ సైనికుల ప్రత్యేక నిధికి ఏడాదికి రూ.80 కోట్లను అందిస్తోంది. అంగన్‌వాడీ టీచర్లు, కార్మికులు, మున్సిపల్ కార్మికులు, విఆర్‌ఎలు, వివిఓలు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధి హామీ కింద పని చేసే ఉద్యోగులు, ఆశావర్కర్లు తదితరుల వేతనాలను పెంచింది. మహిళా శిశు సంక్షేమం కోసం రూ.15వేల విలువైన కెసిఆర్ కిట్‌లను ప్రతి గర్భిణికి అందించింది. కొత్త పరిశ్రమలకు 15 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసేందుకు టిఎస్ ఐపాస్‌ను ప్రారంభించింది. ఆదాయ ప్రగతి, సోలార్ పవర్ ఉత్పత్తిలో నెంబర్ వన్‌గా నిలుస్తోంది. అత్యాధునిక సౌకర్యాలతో పోలీసు కమాండ్, కంట్రోల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసింది. వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్కు నెలకొల్పింది. హైదరాబాద్‌లో షీ టీమ్‌లను ఏర్పాటు చేసింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల కోసం స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లాలోని ముచ్చర్ల వద్ద 11వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. ఐటి ఎగుమతుల్లో 12 శాతం వాటాతో దేశంలోనే రెండవ స్థానం లో నిలిచింది. హైదరాబాద్‌లో ప్రప్రథమంగా టి—హబ్‌ను ఏర్పాటు చేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలో ఉన్న పది జిల్లాలను 31 జిల్లాలుగా విభజించింది.

పెన్షన్లతో లక్షల కుటుంబాలకు చేయూత

18 ఏళ్ల వయస్సు నిండి ఒంటరిగా ఉంటున్న, భర్తకు దూరంగా ఉంటున్న మహిళలకు పెన్షన్ పథకం కింద నెలకు రూ.1000లను ప్రభుత్వం అందిస్తోంది. దీని ద్వారా 1,20,000 మంది లబ్ధి పొందుతున్నారు. అలాగే, బీడీ కార్మికులకు నెలకు రూ.1000లు పెన్షన్ అంది స్తోంది.4.5లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. వృద్ధా ప్య, వికలాంగ, వితంతు, గీత, నేత, బీడీ కార్మికులు, ఎయిడ్స్ రోగులు, కళాకారులకు నెలకు రూ.1000లు 'ఆసరా' ద్వారా అందిస్తోంది. ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్‌తో కలిసి ఈపథకానికి ప్రతినెలా రూ. 442 కోట్ల ను వెచ్చిస్తోంది. 40లక్షల మంది లబ్ధి పొందుతున్నారు.

కెసిఆర్ హామీల అమలు ఇంకెన్నడు?

ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శ



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్‌పై సిఎం కెసిఆర్ మాట నిలబెట్టుకోవాలని, లేదంటే ముస్లింలను ఓట్లు అడిగే హక్కు కెసిఆర్‌కు లేదని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. టిఆర్‌ఎస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించారని, 40 నెలలైనా అమలుకాలేదని ఆయన విమర్శించారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన 70 ఏళ్ళ కాలంలో ప్రజలు ఏమి తింటున్నారనే ప్రశ్నలు రాలేదని, ప్రస్తుతం బిజెపి పాలనలో అలాంటి ప్రశ్నలను వినాల్సి వస్తుందని అన్నారు. పలువురు వైద్యులు, సంఘ సేవకులు, మాజీ క్రీడకారులు, రిటైర్డ్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ తదితరులు దూరదర్శన్ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ సుజాత్ అలీ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రసంగిస్తూ దళితులకు, గిరిజనులకు ఇచ్చిన సిఎం కెసిఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు.ముస్లింలలో ఎంతమందికి డబుల్ బెడ్ రూమ్‌లను ఇచ్చారని ప్రశ్నించారు. పాతనగరంలో మెట్రో పనులు ఎందుకు మొదలుకాలేదని, ఇలాంటి చర్యలు పాతనగరంపై వివక్షచూపడం కాదా అని ఆయన ప్రశ్నించారు. తుగ్లక్ పాలనకు చరమగీతం పాడాలని, వచ్చే 2019 ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పక్కగా విజయం సాధిస్తుందన్నారు. వివిధ వృత్తులకు చెందిన కాంగ్రెస్‌లో చేరడం మంచి పరిణామమని, కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టిపిసిసి అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ దేశంలో పెద్ద మోడీ రాష్ట్రంలో చిన్న మోడీ నిరంకుశ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. సుజాత్ అలీ మాట్లాడుతూ తన హార్ట్ బీట్ కాంగ్రెస్ అన్నారు.

విజన్-2024

(మొదటిపేజీ తరువాయి)

ఇలా వివరించింది.... ఆర్థికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, మౌలిక వసతులను మెరుగుపర్చడం, సాంఘిక సంక్షేమ పథకాలను ప్రోత్సహించడం.. అని పేర్కొనింది. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన తర్వాత వచ్చిన వివరాలను విశ్లేషించినప్పుడు వివిధ రంగాల్లో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థికాదాయం తదితర అంశాల్లో తారతమ్యాలు ఉన్నట్లు తేలింది. వాటిని తొలగించడానికి అభివృద్ధి ప్రణాళికను వికేంద్రీకరించడం అవసరంగా భావించి 'మన ఊరు మన ప్రణాళిక'ను ప్రభుత్వం చేపట్టిందని పేర్కొనింది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలంటే అన్ని రంగాల్లో అభివృద్ధి అవసరమని ప్రభుత్వం భావించి మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు, ఎస్సీ ఎస్టీ అభివృద్ధి నిధులు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మైనారిటీ రిజర్వేషన్లు, బీసీలకు సంక్షేమ పథకాలు, మహిళా శిశు అభివృద్ధి, రైతులకు ఎరువులు, విత్తనాలకు ఆర్థిక సాయం, గర్భిణీలకు ప్రత్యేక పథకాలు, శిశువులకు కెసిఆర్ కిట్... ఇలా అనేకం దోహదపడుతున్నాయని డాక్యుమెంట్ పేర్కొనింది. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు ఎలా పెరుగుతుంది, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎలా మెరుగవుతుంది, ప్రజల తలసరి ఆదాయంలో ఎలాంటి పెరుగుదల ఉంటుంది, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎన్ని రెట్లు పెరుగుతుంది, మాతా శిశు మరణాలు ఎలా తగ్గుతాయి, అక్షరాస్యత గరిష్ట స్థాయికి ఎలా పెరుగుతుంది, పారిశ్రామికాభివృద్ధిని ఏ స్థాయిలో పెరుగుతుంది, ఉపాధి కల్పనతో నిరుద్యోగం ఎలా తగ్గుతుంది, కెజి టు పిజీ విద్యా పథకం అమలుతో పాటు విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టడం ద్వారా సామాజిక పరిస్థితుల్లో మార్పు ఎలా ఉంటుంది... ఇలా అనేక అంశాలు ఈ డాక్యుమెంట్‌లో ప్రస్తావించబడ్డాయి. కేవలం 'విజన్'గా మాత్రమే కాకుండా ఆచరణాత్మక కోణం నుంచి ఈ నాలుగేళ్ళలో సాధించిన ప్రగతిని ప్రామాణికంగా తీసుకుని రానున్న ఆరేళ్ళలో సాధించే వార్షిక లక్ష్యం ఈ డాక్యుమెంట్ ప్రధాన ఉద్దేశం. రానున్నది ఎన్నికల సంవత్సరం కాబట్టి బడ్జెట్‌తోపాటే ఈ దశాబ్ది దిక్సూచిని కూడా ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. తెలంగాణ బలం, బలహీనతలు, అనుకూలతలు, ప్రతికూలతలు..ఇలాంటివాటిని ప్రస్తావించి విద్యుత్ సంక్షోభం నుంచి గట్టెక్కిన విధానం, మిషన్ కాకతీయ ద్వారా భూగర్భ జలమట్టం పెరగడం, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టును పెరగడం, రైతులకు విత్తనాలు, ఎరువులకు ఆర్థిక సాయం అందించడం, కులవృత్తులవారికి చేపలు, గొర్రెలుపంపిణీ చేయడం, ప్రతి సామాజిక వర్గానికి సంక్షేమ భవన్‌లనిర్మాణం..ఇలా ఇప్పటివరకు అమలులోకి తెచ్చిన అంశాలను, భవిష్యత్తులో వీటికి మరింత మెరుగులుదిద్ది ప్రతి ఏటా సాధించే ప్రగతిని వివరించనుంది. తెలంగాణ ఏర్పడినప్పుడున్న తలసరి ఆదాయం, రాష్ట్ర స్థూల ఆదాయం, అక్షరాస్యత, పరిశుభ్రత, లింగనిష్పత్తి... ఇలా ఒక్కో అంశంలో సాధించిన ప్రగతిని ఈ డాక్యుమెంట్ వివరించనుంది. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు, ఈ సంవత్సరాంతానికి సిద్ధం కానున్న రెండు లక్షల ఇళ్ళు, ప్రభుత్వ లక్ష్యంగా ఉన్న పది లక్షల ఇళ్ళను ఎప్పటికల్లా నిర్మిస్తుందో..ఇలా అనేక అంశాల్ని వాస్తవిక ఆచరణే ప్రామాణికంగా తీసుకుని 'బంగారుతెలంగాణ' లక్ష్యాన్ని దశాబ్ది డాక్యుమెంట్ ద్వారా ప్రజల ముందు సాక్షాత్కరించనుంది. మిషన్ కాకతీయను ప్రవేశపెట్టడానికి ముందు ఉన్న పరిస్థితి ఇప్పటివరకు అమలైన తర్వాత వచ్చిన ఫలితాలు, పెరిగిన ఆయకట్టు, ఎన్ని గ్రామాల్లో నీటి సౌకర్యం పెరిగింది, ఎన్ని కుటుంబాలకు లబ్ధి చేకూరింది, పంటల ఉత్పత్తి ఏ మేరకు పెరిగింది తదితరఅంశాల సగటు ఆధారంగా 2024 నాటికి రాష్ట్ర సాగునీటి, వ్యవసాయ, ఆర్థిక ముఖచిత్రం ఎలా ఉంటుందో వివరించనుంది. మిషన్ భగీరథ ప్రాజెక్టు రావడానికి ముందు ఎన్ని గ్రామాల్లో త్రాగునీటి సౌకర్యం ఉంది, ఆ నీటి వినియోగం ద్వారా ప్రజల ఆరోగ్యం ఎలా ఉండేది, ఎన్ని కుటుంబాలకు నీటి కనెక్షన్లు ఉన్నాయి, ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ఎన్ని కోట్లు కేటాయించింది, ఎన్ని గ్రామాలకు అదనంగా కుళాయిలద్వారా నీరు అందింది, ఎన్ని కుటుంబాలకు రక్షిత తాగునీరు అందనుంది, ఆరోగ్య రంగంపై వారు చేసే ఖర్చు ఏ మేరకు తగ్గనుంది.. ఇలా పలు అంశాలను సంవత్సరంవారీగా పేర్కొంటూ 2024 నాటికి తెలంగాణ ఎలా ఉంటుందో వివరించనుంది.

ఎపి పక్షవాతం!

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణకు 112.2 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 217.8 టిఎంసిల నీరు అందుతుంది. నవంబరు 4 నుంచి ఇప్పటి వరకు 57 రోజుల్లో 150 టిఎంసిలకు పైగా నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగించింది. తెలంగాణ ప్రభుత్వం కల్వకుర్తి ఎత్తిపోతలకు 16 టిఎంసిలు, సాగర్ ఎడమ కాలువ కింద 12 టిఎంసిలు, ఎఎంఆర్‌పి, హైదరాబాద్ తాగునీటికి 20 టిఎంసిల చొప్పున మొత్తం దాదాపు 48 టిఎంసిల వరకు తెలంగాణ వాడుకుంది. 112.2 టిఎంసిల కేటాయింపుల్లో 48 టిఎంసిలు మినహాయిస్తే ఇంకా తెలంగాణ వాటాగా దాదాపు 64 టిఎంసిల నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. మరోవైపు ఆంధ్రాకు ఇచ్చిన 217.8 టిఎంసిల నీటిలో సుమారుగా 151 టిఎంసిలు ఇప్పటికే వినియోగమైంది. ఇందులో కేవలం పోతిరెడ్డిపాడు నుంచే 80 టిఎంసిల వరకు మళ్లించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇంకా 67 టిఎంసిలు మాత్రమే మిగిలింది. కానీ శ్రీశైలంలో 854 అడుగుల ఎగువన దాదాపు 40 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. నాగార్జునసాగర్‌లో దాదాపు 78 టిఎంసిల నీరు ఉంది. ఈ రెండింటిలో కలిపి కనీస నీటిమట్టం ఎగువన 118 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ లెక్కల లోతుల్లోకి వెళితే వచ్చే యాసంగికి, హైదరాబాద్ తాగునీటి కోసం కనీస నీటి మట్టం దిగువకు వెళ్లాల్సిన పరిస్థితులు గోచరిస్తున్నాయి. ఇప్పటికే నాగార్జునసాగర్‌లో పలుమార్లు కనీస నీటిమట్టం దిగువకు దిగి నీటిని తీసుకున్నారు. ఇదే జరిగితే ఎఎంఆర్‌పి పంపుల మనుగడకే ప్రమాదం పొంచివుంది. నాగార్జునసాగర్‌లో 510 అడుగుల వద్ద నుంచి నీరు తీసుకునేలా ఆ పంపులను డిజైన్ చేశారు. అంతకు మించి కిందకు దిగితే పంపులపై భారం పెరిగి, సాంకేతిక అవరోధాలు వస్తే, హైదరాబాద్ తాగునీటికి ఇబ్బందులు వస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో డిమాండ్ ఎక్కువ, లభ్యత తక్కువగా ఉండడం, కృష్ణా బోర్డు అశక్తతకు తోడు, ఎపిపై పక్షపాత వైఖరే దీనికంతటికీ కారణమని అభిప్రాయం. ఈ నేపథ్యంలో బోర్డు ఇకపైన ఎలాంటి వైఖరి అవలంబిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

ఆదిలాబాద్‌లో చలి పంజా

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో చలి పంజా విసురుతోంది. తగ్గినట్లే తగ్గి కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి.ఆదివారం జిల్లాలో చలిగాలులు వీచడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత 5.7 డిగ్రీలు నమోదు కాగా.. గరిష్ఠ ఉష్ణోగ్రత 29డిగ్రీలు నమోదైంది. శనివారం 5.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. గరిష్ఠ ఉష్ణోగ్రత 30.4 డిగ్రీలుగా నమోదైంది. దక్షిణపీఠంపై జిల్లా ఎత్తైన ప్రదేశంలో ఉండడంతో శీతల పవనాలు వీస్తూ జిల్లాను తాకుతున్నాయి. దీంతో జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10గంటల వరకు చలి తీవ్రత తగ్గడం లేదు. విద్యార్థులు, వృద్ధులు రోజంతలా సైతం స్వెటర్లు, మంకీ క్యాపులనే ధరించే తిరుగుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచే చలి గాలులు వీయడంతో చలి మంటలు కాచుకుంటున్నారు.

S & D

ప్రమాదాల రహితంగా తెలంగాణ : మంత్రి మహేందర్‌రెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలో ఆధునికతకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ రాష్ట్ర రవాణ శాఖ నిలిచిందని, అదే స్ఫూర్తితో ప్రమాద రహిత తెలంగాణకు అడుగులు వేద్దామని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి అన్నారు. నూతన సంవత్సరం 2018ను పురస్కరించుకుని ఆదివారం రాత్రి తనను కలిసిన పలువురు రవాణ శాఖ అధికారులు, ఉద్యోగులకు, ప్రజలకు ఆయన నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది ప్రమాదాలను తగ్గించిన రాష్ట్రంగా తెలంగాణాకు గుర్తింపు వచ్చిందని, కొత్త ఏడాదిలో రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రాణ నష్టాన్ని మరింతగా తగ్గించాలని ఆయన కోరారు. 2016లో మొత్తం 21,202 ప్రమాదాలు చోటుచేసుకుని 7219 మంది మృతి చెందగా 23,719 మంది గాయపడ్డారని, 2017లో ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలిగామని, జూన్ నాటికి 9611 ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, 3028 మంది మరణించగా 10,402 మంది గాయపడ్డారని వివరించారు. రవాణ శాఖ ఆదాయం 2016 – 17 ఆర్థిక సంవత్సరం కంటే 22 శాతం పెరిగిందని, 2017 – 18 ఏడాది లక్ష్యం రూ.3401 కోట్లు కాగా ఇప్పటికే రూ.2123 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఆన్‌లైన్ విధానం, ఎం–వ్యాలెట్ తదితర స్మార్ట్ పద్ధతులతో రవాణ శాఖ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

డేంజర్ స్పాట్లలో స్పెషల్ డ్రైవ్

గత ఏడాదితో పోలిస్తే ఈ సారి ప్రమాదాలు కొద్దిగానే తక్కువ



మన తెలంగాణ / హైదరాబాద్ : కొత్త రోడ్ల నిర్మాణాలతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణపైనా ఆర్ అండ్ బి శాఖ ప్రత్యేక చర్యలను చేపడుతోంది. ప్రమాదాలు జరుగుతున్న రహదారులను గుర్తించి భవిష్యత్తులో మళ్లీ అక్కడే అవి జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యయనం చేయనుంది. ఇందు కోసం ప్రతి రెండు మాసాలకు ఒక సారి డేంజర్ స్పాట్లపై స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహించాలని నిర్ణయించింది. గతంతో పోలిస్తే రోడ్డు భద్రతపై ఎంతగా అవగాహన కల్పిస్తున్నా ప్రమాదాల సంఖ్యను మాత్రం ప్రభుత్వం తగ్గించలేక పోతోంది. రాష్ట్ర రహదారులే కాకుండా జాతీయ రహదారుల్లోనూ రోడ్డు ప్రమాదాల మూలంగా ఏటా వందల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2016 సంవత్సరంలో మొత్తం 22,811 రోడ్డు ప్రమాదాలు జరుగగా, ఈ ఏడాది 20,375 రోడ్డు ప్రమాదాలకు పరిమితమయ్యాయి. ఈ తగ్గుదల కూడా అంత గొప్పగా చెప్పుకునేంత స్థాయిలో లేదని చెప్పవచ్చు. జాతీయ రహదారుల్లోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం వివిధ రాష్ట్రాలకు కొన్ని భద్రత సూచనలు చేసింది. ప్రధాన పట్టణాల మీదుగా వెళ్లే జాతీయ రహదారుల్లో తరుచు ప్రమాదాలు ఎక్కడ జరుగుతున్నాయి? దానికి గల కారణాలు ఏమిటన్న దానిని పూర్తిగా విశ్లేషించుకోవాలని కోరింది. అలాగే ఈ ఏడాది వివిధ రాష్ట్రాల్లో హైవేలపై జరిగిన ప్రమాద గణాంకాలను కూడా రాష్ట్రం నుండి కేంద్ర ప్రభుత్వం కోరింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ అధికారులు ఈ మేరకు కేంద్రానికి పలు వివరాలను అందజేశారు.

మానవ తప్పిదాలే ఎక్కవ!

ప్రమాదాలకు గల ప్రధాన కారణాల్లో వంకరటింకర రోడ్లు, మలుపులు కూడా ఒకటని అధికారులు అభిప్రాయపడ్డారు. వంపులు, మలుపుల కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించడంలో లోపాలు ఎక్కువగా ఉంటున్నాయి. సిగ్నలింగ్, రోడ్డు వంకరను సూచించే బోర్డులను ఓవర్ స్పీడ్‌లో గమనించక పోవడం లాంటివి ప్రధాన కారణంగా నిలుస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. సికింద్రాబాద్ తాడ్‌బండ్‌లోనూ, కామారెడ్డి పట్టణంలోనూ, అలాగే జడ్చర్ల, హైదరాబాద్ భువనగిరి మధ్యన గల టోల్ గేట్ల వద్ద ఈ ఏడాదిలో జరిగిన రోడ్డు ప్రమాదాలను వారు ఉదహరించారు. తాడ్ బండ్ వద్ద ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు అతి వేగంగా వస్తూ రోడ్డు వంకరలో బండి అదుపు తప్పి అవతలి వైపు నున్న రోడ్డుపైకి దూసుకు పోయారు. ఈ క్రమంలో అటు వైపు నుండి వచ్చిన లారీ వారిపై నుండి వెల్లడంతో అక్కడికక్కడే ముగ్గురూ ప్రాణాలొదిలారు. కామారెడ్డి పట్టణంలోనూ ఒక లారీ కూడలి వద్ద సిగ్నల్‌ను పట్టించుకోకుండా వేగంగా వచ్చి యూ టర్న్ తీసుకుంది. ఈ క్రమంలో అవతలి వైపు నుండి వస్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోనూ డ్రైవర్లు ఇద్దరు చనిపోయారు. హైదరాబాద్– కర్నూలు జాతీయ రహదారిపై జడ్చర్ల టోల్ గేట్ వద్ద ఆగివున్న కారును వెనుక నుండి వచ్చిన లారీ ఢీ కొట్టడంతో కారులోని ముగ్గురు చని పోయారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి ఇండియన్ రోడ్ కాంగ్రెస్ పేరిట హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. వంకర టింకర రోడ్లు సరి చేయడం, ప్రమాద బోర్డులను పెట్టాల్సిన పెట్టక పోవడం, కనీసం జీబ్రా క్రాసింగ్ వేగ నిరోధక రోడ్లు కూడా డేంజర్ స్పాట్ల వద్ద వేయక పోవడం లాంటివి ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయని తెలుస్తోంది.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం



మన తెలంగాణ / హైదరాబాద్ : జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నగరంలో ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని పవన్ కల్యాణ్ తీసుకున్నారు. ఆ తర్వాత పార్టీలోని ముఖ్యులకు ఆయన సభ్యత్వాన్ని అందజేశారు. సభ్యత్వ నమోదు కోసం రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను పరిశీలించారు. కొత్త సంవత్సరం నుంచి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళే ఉద్దేశంతో సిద్ధాంతాలు, ఆశయాలపై అవగాహన కలిగించేందుకు ముఖ్యులతో గత మూడు రోజులుగా ఇష్టాగోష్టి చర్చలు జరిపారు. త్వరలో కార్యకర్తలకు శిక్షణా శిబిరాలను నిర్వహించడంపై చర్చించారు. మహిళలు, సీనియర్ సిటిజెన్లకు ప్రత్యేకంగా ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



మనతెలంగాణ/ మిర్యాలగూడ : రైలు కింద పడి గ్రూప్2కి ఎంపికైన అభ్యర్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రైల్వేపోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం...సూర్యాపేట జిల్లా మేళ్ల చెర్వుకు చెందిన ముడెం శ్రీనివాసరెడ్డి (31) మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 2016 గ్రూప్2కి ఎంపిక య్యాడు. కాగా అభ్యర్థులు కోర్టుకెళ్లగా నియామకాలు ఆగిపోయాయి. కాగా శ్రీనివాస రెడ్డికి అనారోగ్య సమస్య ఉండటంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నాడు. మృతునికి ఇటీవలనే వివాహం నిశ్చయమైంది. ఫిబ్రవరిలో వివాహం జరిపేందుకు నిర్ణయించారు. మృతుని తండ్రి బస్విరెడ్డికి ముగ్గురు కుమారులు. అందులో శ్రీనివాసరెడ్డి చిన్నకుమారుడు. శ్రీనివాసరెడ్డి తల్లి వరలక్ష్మి సంవత్సరం క్రితమే మృతి చెందింది. ఈ మేరకు రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. చేతికందిన కుమారుడు మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

మన తెలంగాణ/ లక్షెట్టిపేట : మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలోని చందారం గ్రామంలో వ్యవసాయం అనుకూలించక భార్యభర్తలైన బానవత్ విజయ, బాపులాల్‌లు శనివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడారు. భార్య విజయ మరణించగా భర్త ప్రాణాపాయ స్థితిలో మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ ఇసాక్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపులాల్ సుమారు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని పత్తి, వరి, కంది పంటలను సాగు చేశారు. పంట అనుకూలించక సుమారు ఐదు లక్షల వరకు అప్పు అయ్యింది, అదే విధంగా సొంత ఇల్లు నిర్మాణం చేపట్టగా వాటి అప్పులు కూడా పెరిగాయి. దీంతో భార్య భర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. మృతురాలికి ఇద్దరు ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ఉన్నారని ఆమె తండ్రి సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

భార్య, కుమారున్ని హతమార్చిన భర్త



మన తెలంగాణ/ మంచిర్యాల ప్రతినిధి : ఒకవైపు 2017 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ సంబురాలు జరుపుకుంటుండగా ఓ భర్త కత్తితో గొంతు కోసి భార్య, ఆరు నెలల కుమారున్ని కడతేర్చిన సంఘటన విషాదం నింపింది. తాగిన మైకంలో కుటుంబ కలహాల కారణంగా చిన్నపాటి గొడవతో ఉద్వేగానికి గురై భార్య, కుమారున్ని హతమార్చి పారిపోయాడు. ఈ సంఘటన ఆదివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలంలోని విద్యానగర్‌లో చోటు చేసుకుంది. విద్యానగర్‌కు చెందిన సంపంగి శ్రీనివాస్ ఆదివారం ఉదయం 9.30 గంటల సమయంలో అతని భార్య బాలమ్మ (25), కుమారుడు వివేక్ (6 నెలలు)లను కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనలో భార్య, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందడంతో శ్రీనివాస్ పారిపోయాడు. హుజరాబాద్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సంపంగి శ్రీనివాస్‌కు విద్యానగర్‌కు చెందిన బాలమ్మతో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరగ్గా ఆరు నెలల కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్ అనే యువకుడు వడ్డేర పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవలనే కుమారుడు జన్మించిన తరువాత వేరే కాపురం పెట్టిన శ్రీనివాస్ తరచూ భార్యతో గొడవ పడేవాడు కాగా శనివారం రాత్రి ఇరువురి మధ్య గొడవ చోటుచేసుకోగా తెల్లవారి తాగిన మత్తులో భార్యతో పాటు కుమారున్ని హత్య చేశాడు. కాగా సంపంగి శ్రీనివాస్‌కు ఇప్పటికే ముగ్గురు భార్యలు ఉన్నట్లు సమాచారం. సిసిసి విద్యానగర్‌కు చెందిన బాలమ్మను నాల్గో వివాహం చేసుకొని సంచార జీవనం గడుపుతున్నాడు. భార్య, కుమారున్ని హతమార్చడంతో వారి కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. కాగా మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంచిర్యాల సిసి ఇన్స్‌పెక్టర్ ప్రమోద్‌కుమార్, మంచిర్యాల సిఐ వేణుచందర్, ఎస్ఐలు సతీష్, ఉమాసాగర్‌లు, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.



హైదరాబాద్‌లో డ్రగ్స్‌ముఠా కలకలం



మన తెలంగాణ/ మన్సూరాబాద్ : నూతన సంవత్సర వేడుకల కోసం హైదరాబాద్ నగరానికి డ్రగ్స్ తీసుకోచ్చిన ముఠాను రాచకొండ పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. రాచకొండ కమిషన్‌రేట్ క్యాం ప్ కార్యాలయంలో సిపి మహేశ్ భగవత్, మల్కాజిగిరి డిసిపి ఉమ మహేశ్వర్‌రావు, ఎస్‌ఓటి అడిషనల్ డిసిపి రఫీక్‌లు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డ్రగ్స్ ముఠా సభ్యులు వివరాలు వెల్లడించారు. రూ. 16,70,000 లక్షల విలువైన కోకైన్, హెరాయిన్, ఆల్ఫాజోలం, గంజాయిను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. నగరంలో యాప్రాల్‌లో నివాసం ఉండే చిడుబుబే చుకు మా(19) సికింద్రాబాద్ పీజి కళశాలలో బియస్సీ విద్య అభ్యసిస్తున్నాడు. సండే (19) యువతి ఆర్‌బివిఆర్‌ఆర్ కళశాలలో బి–ఫార్మసీ చదువుకుంటున్నది. వారిద్దరిని అ రెస్ట్ చేయగా, బెంజిమన్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నా రు. కొత్త సంవత్సరం పురస్కరించుకుని డ్రగ్స్ అమ్మకాలు జరిపి సునయాసంగా డబ్బులు సంపాదించాలని ఆలచోనతో ఉన్నారు. ఎల్బీనగర్ ఎస్‌ఓటి పోలీసులు, జహవర్‌నగర్ పోలసులు సంయుక్తంగా డ్రగ్స్ ముఠాను పట్టుకున్నారని తెలిపారు. నైజరీయన్ల నుంచి డ్రగ్స్‌తో పాటు ఒక కారు, రెండు ల్యాప్‌ట్యాప్‌లు, ఒక పాస్‌పోర్టు, 5 సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకుని వారిద్దరిని రిమాండుకు తరిలించారు. ఈకేసును చేదించిన ఎస్‌ఓటి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వివి చలపతి. ఎస్‌ఓటి ఎస్సై కాశీవిశ్వనాథ్‌లను సిపి మహేష్ అభినందించారు.



రాత్రి ఒంటి గంటకే బార్లు మూసేయాలి

రాచకొండ కమిషన్‌రేట్ పరిధిలో రాత్రి 1గంటకే బార్లు మూసేయాలని, అనంతరం బార్ రెస్టారెంట్‌లు మూసివేయక పోతే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. మద్యం తాగి కారు, ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. వేడుకలు గత సంవత్సరం ఇచ్చిన వారికే అనుమతులు ఇచ్చామని, కొత్తగా ఎవ్వరికి కూడా అనుమతులు ఇవ్వలేదని, డిజే అనుమతి లేదని తేల్చి చెప్పారు.

కెల్విన్‌కు బెయిల్

మన తెలంగాణ/ హైదరాబాద్/సిటీబ్యూరో : దేశ వ్యాప్తంగా సినీ పరిశ్రమ వర్గాలను ఒక్కసారిగా ఆందోళనకు గురిచేసిన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కెల్విన్ చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. నాంపల్లిలోని సిబిఐ కోరుట అతనికి బెయిల్ మంజూరు చేయడంతో ఆదివారం ఉదయమే కారాగారం నుంచి బయటకొచ్చారు. మాదక ద్రవ్యాల కేసుకు సంబంధించి తనపై జరిగిన ప్రచారమంతా అవాస్తవమని కెల్విన్ చెప్పారు. తాను ఇక నుంచి కుటుంబ సభ్యులతోనే గడుపుతానని, తనమీద వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవమని పేర్కొన్నారు. తెలంగాణ ఆబ్కారి శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం కేసును విచారించింది. ఈవెంట్ మేనేజర్‌గా వ్యాపారం చేసుకునే కెల్విన్‌కు అంతర్జాతీయ, గోవా డ్రగ్స్ ముఠాలతో సంబంధాలున్నట్టు, తెలుగు చిత్రపరిశ్రమలోని పలువురు పేరున్న దర్శకులు, నటీనటులకు తాను మాదకద్రవ్యాలను సరఫరా చేసినట్టు ఆరోపణలున్నవి. పలువురు ద ర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎక్షైజ్ శాఖ ఉన్నతాధికారులను సిట్ విచారించింది.

దొంగల బీభత్సం

- **వృద్ధురాలిపై దాడి చేసి రూ. 8 లక్షల సొత్తును దోచుకెళ్లిన దొంగలు**



మన తెలంగాణ/ హైదరాబాద్/అమీర్‌పేట: సనత్‌నగర్‌లోని ఓ ఇంట్లోకి గుర్తుతెలియని దొంగలు ప్రవేశించి ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి ఇంట్లో ఉన్న దాదాపు 8 లక్షల విలువగల సొమ్మును దోచుకుని పారిపోయిన సంఘటన సనత్‌నగర్‌లోని తులసీనగర్‌లో ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సనత్‌నగర్ తులసీనగర్‌లో ప్రైవేటు ఉద్యోగి బి.అంథోనికి ఓ భవనంలో నివాసముంటుండగా ఇటీవల విదేశాలకు వెళ్లాడు. అయితే అంథోని ఇంట్లో ఆయన అత్త వృద్ధురాలు(75) 40 రోజులుగా ఒంటరిగా ఉంటుంది. ఇది గమనించిన దొంగలు ఆదివారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో ఇంటి తాళాలు పగులకొట్టి ఇంట్లో ఉన్న వృద్ధురాలిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం ఇంట్లో ఉన్న 6 లక్షల విలువ గల బంగారు నగలు, 2 లక్షల డబ్బును దోచుకుని పోయారు. దొంగల ఆనవాలు కనిపించకుండా ఇంట్లోని అన్ని గదుల్లో కారంపొడి చల్లి పారిపోయారు.

గంటల్లో అమెరికా నుంచి ఇంటికి యజమాని

సనత్‌నగర్ తులసీనగర్‌లో దోపిడీ జరిగిన ఇంట్లో గత ఆమె అల్లుడు, కూతురు వారి మనుమడితో కలిసి అమెరికాలో నివాసముంటున్న పెద్ద కూతురైన ఆరోగ్యదేవి దగ్గరికి గత 40 రోజుల క్రితం వారు విదేశానికి వెళ్ళారు. అయితే ఈ దోపిడీకి పాల్పడిన వారు వారికి బాగా పరిచయం ఉన్న వారై ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సంఘటన జరిగిన కొన్ని గంటల్లో తెల్లవారుజాము 5 గంటలకు ఇంటి యజమాని ఆంథోని తన కుటుంబ సభ్యులతో ఇంటికి రాగా జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్న ఆయన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించగా, వెంటనే సంజీవరెడ్డినగర్ పోలీసులు సంఘటన ప్రదేశానికి వచ్చి క్లూస్ టీంతో పరిశీలించి కేసు నమోదు చేసుకున్న సంజీవరెడ్డినగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

157 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు చేశాం: ఎస్‌పి నంద్యాల కోటిరెడ్డి



మన తెలంగాణ/ మరిపెడ : ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యంను లారీ, ఆటో వాహనాలన ద్వారా అక్రమంగా తరలిస్తుండగా 157 క్వింటాల రేషన్ బి య్యాన్ని పట్టుకున్నట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అక్రమ వ్యాపారులను చూపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మండల కేంద్ర శివారు చోక్లా తండా చెందిన బానోతు కిషన్ కొద్ది రోజులుగా చుట్టుప్రక్కల గ్రామాల నుండి రేషన్ లబ్ధిదారాల నుండి బియ్యాన్ని కొనుగోలు చేసి మహారాష్ట్రకు ఎగుమతి చేయడం కోసం అదే తండాకు చెందిన బానోతు శివ ఆటోలో బియ్యాన్ని తీసుకవచ్చి తండ శివారులోని బోడు వద్ద నిల్వచేసిన బియ్యాన్ని రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ బన్వారీగోదారా {RJ07GB0729} సహకారంతో బియ్యాన్ని లారీలో లోడు చేసుకొని బయలుదేరుతున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. అక్రమ బియ్యం తరలిస్తున్న వ్యాపారీ, లారీ, ఆటో డ్రైవర్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధి కల్పనపై దృష్టి పెట్టమని మోడీకి చెప్పండి

- **ట్విట్టర్‌లో రాహుల్**

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని మోడీపై మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. మోడీ అభిమానులను సంబోధిస్తూ పరోక్షంగా ప్రధానిని టార్గెట్ చేశారు. ప్రియమైన మోడీ భక్తులారా అంటూ ట్వీట్ మొదలు పెట్టారు. స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టు కోసం కేటాయించిన రూ. 9860 కోట్లలో కేవలం 7 శాతం నిధులు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేయడాన్ని రాహుల్ తన ట్వీట్లలో ప్రస్తావించారు. ఒక వైపు చైనా శరవేగంగా ముందుకు దూసుకుపోతుంటే ప్రధాని మోడీ మాత్రం శుష్కవాగ్దానాలను ఇస్తున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. దేశానికి ఉపాధి కల్పించే అంశంపై దృష్టిసారించాలని మీ గురువుకి సలహా ఇవ్వండని మోడీ అభిమానులకు రాహుల్ సూచించారు. దేశం మోసాల వలలో చిక్కుకుందని, అబద్దాలతో రాజకీయ లబ్ధిపొందుతుందన్నారు.

పురుషుల తోడు లేకుండా హజ్‌యాత్ర

మన్ కీ బాత్ లో ప్రధాని వెల్లడి



న్యూఢిల్లీ : హజ్ యాత్రకు ఒంటరిగా వెళ్లాలని కోరే ముస్లిం మహిళలకు ప్రధాని మోడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పురుషుని పర్యవేక్షణలోనే మహిళలు హజ్ యాత్రకు వెళ్లాలనే నిబంధనను తొలగిస్తున్నట్లు ప్రధాని మోడీ ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో తెలిపారు. పురుషుని పర్యవేక్షణ(మహరం)లోనే యాత్రకు వెళ్లాలనే నిబంధన చాలా చిన్నదిగా కనిపించవచ్చుగానీ, సమాజంపై దాని ప్రభావం చాలా అధికంగా ఉంటుందని మోడీ మన్ కీ బాత్‌లో అన్నారు. ఈ నిబంధన గురించి తాను మొదటి సారిగా విన్నప్పుడు చాలా ఆశ్చర్యానికి గురయ్యానని మోడీ తెలిపారు. మైనార్టీ వ్యవహారాల శాఖ సవరించిన నియమాల ప్రకారం ప్రస్తుతం 45 ఏళ్లు దాటిన మహిళలు హజ్‌యాత్రకు ఒంటరిగా ప్రయాణం చేయవచ్చు. అటువంటి మహిళలు నలుగురు ఒక గ్రూప్‌గా ఏర్పడిన అనంతరం వారికి హజ్‌యాత్రకు వెళ్లేందుకు అనుమతి లభిస్తుంది.

చాలా ముస్లిం దేశాల్లో ఇటువంటి నిబంధన లేదు : స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లు గడిచిన తర్వాత కూడా మహిళలు ఇంత వివక్ష ఎదుర్కొంటున్నారని, అయినా ఈ అంశంపై ఇప్పటి వరకు చర్చ జరగక పోవడం చాలా దారుణమని మోడీ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని చాలా ముస్లిం దేశాల్లో ఇటువంటి నిబంధన లేదని మోడీ గుర్తుచేశారు. పురుషుని తోడు లేకుండా హజ్ యాత్ర చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 1300 మంది దరఖాస్తు చేసుకోవడం తనకెంతో సంతోషం కలిగించిందని ప్రధాని అన్నారు. హజ్ యాత్రకు వెళ్లేవారిని ఎంపిక చేసేందుకు లాటరీ విధానాన్ని నుంచి ఒంటరి మహిళలను మినహాయించి, దరఖాస్తు చేసుకున్న మహిళలందరికీ అవకాశం కల్పించాలని మైనార్టీ శాఖను కోరిన విషయాన్ని మోడీ తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధిలో రైతు పాత్ర కీలకం : మంత్రి పోచారం



మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణ వ్యవసాయ రంగానికి 2017 ఒక మైలు రాయి వంటిదని రాష్ట్ర మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, తన్నీరు హరీశ్ రావు, ఈటల రాజేందర్ అన్నారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్ర రైతులకు ముంద స్తు పెట్టుబడిగా ఎకరాకు రూ.4000 ప్రకటించింది 2017లోనే అని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారుల సంఘం, విశ్రాంత అధికారుల సంఘాల ఆధ్వర్యంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో 2018 వ్యవసాయ డైరీని మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతు లేకపోతే తిండి, బట్ట రెండూ ఉండవని, గత ప్రభుత్వాల హయాంలో రైతులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని, అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలతో పాటు, ఎన్నికల మేనిఫెస్టోలో ఇవ్వని రైతు సంక్షేమ హామీలెన్నో ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. 2009 ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ 9 గంటల కరెంటుపై హామీనిచ్చినా, అమలు చేయలేకపోయారని గుర్తుచేశారు. నేడు 24 గంటల కరెంటు ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి మండల కేంద్రం ఎఓ, ఎఇఓలకు కలిపి కార్యాలయం, రైతు సమావేశ మందిరాలు నిర్మిస్తామని, అధికారులకు వాహన సౌకర్యం కల్పిస్తామని, దీనికి అవసరమైన నిధుల్ని మంజూరు చేయాల్సిందిగా ఆర్థిక మంత్రి ఈటలను పోచారం శ్రీనివాస్ రెడ్డి కోరారు.

నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు మాట్లాడుతూ బోర్ల నీటి కంటే ప్రకృతి సిద్ధమైన నదీ కాలువల ద్వారా వచ్చే నీటితో పంటల దిగుబడులు ఎక్కువగా ఉంటాయని అన్నారు. కోటి ఎకరాలకు కాలువల ద్వారా నీరిచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా చేయలేని పనులను టిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 40 నెలల్లోనే చేసి చూపించిందన్నారు. రైతులు అప్పులపాలు కాకూడదన్న ఉద్దేశంతో ఎకరాకు రూ.8000 ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నిర్ణయాన్ని చూసి, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలే ఆశ్చర్యపోతున్నాయని స్పష్టం చేశారు.

ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రతి 5000 ఎకరాలకో వ్యవసాయ విస్తరణాధికారిని నియమించామని, భవిష్యత్తులో కరెంటు, నీటి కొరత ఉండదని అన్నారు. రైతుల ఖర్చులు పోను ఎకరాకు రూ.50 వేలు మిగిలేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అప్పుల అవసరం లేకుండా సొంత పెట్టుబడితో వ్యవసాయం చేసే పరిస్థితులు రావాలని అభిలషించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గాలంటే, సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు ఉన్నాయని, అనారోగ్య రహిత రాష్ట్రం కావాలంటే, కేవలం రైతులతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఉద్యానపంటలతో తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలను పొందవచ్చని మంత్రి వివరించారు. ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు బిబి పాటిల్, జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఉప సంచాలకులు ప్రవీణ్‌రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్.వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ తలాక్‌ను రాజ్యసభ ఆమోదిస్తే సుప్రీంకోర్టుకెళ్తాం

కొచి: ఒకవేళ రాజ్యసభ కూడా ట్రిపుల్ తలాక్‌ను ఆమోదిస్తే సుప్రీంకోర్టుకు వెళతామని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయుఎంఎల్) నాయకుడు పి.కె. కుంజికుట్టి ఆదివారం చెప్పారు. ఏకబిగిన మూడు సార్లు తలాక్ చెప్పడాన్ని నేరంగా చేసే అంశంపై తాము సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామన్నారు. లోక్‌సభలో ఆమోదించిన ప్రతిపాదిత ట్రిపుల్ తలాక్ బిల్లులో అనేక వైవిధ్యాలు, లోపాలున్నాయని ఆయన అన్నారు. 'కుటుంబ సమస్యను నేరపూరితంగా' బిజెపి ప్రభుత్వం చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని ఆయన ధ్వజమెత్తారు. 'పర్సనల్ లాలో కేంద్రం జోక్యం చేసుకునే ప్రయత్నం చేస్తోందని' ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భర్త జైలుకు వెళితే భార్య, పిల్లల ఆలనాపాలన ఎవరు చూస్తారని ఆయన ప్రశ్నించారు. దేశంలో ట్రిపుల్ తలాక్ అంతగా ఆచరణలో లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ కూడా బిల్లుకు మద్దతు ఇస్తున్నందున రాజ్యసభలో ఆమోదం పొందే అవకాశం ఉంది. ఈ బిల్లును ఆర్‌జెడి, ఎఐఎంఐఎం, బిజెడి, ఎఐఎడిఎంకె , ముస్లింలీగ్ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ఈ బిల్లు ద్వారా ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ముస్లింలీగ్ నాయకుడు ఇ.టి.మహ్మద్ బషీర్, మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసి ఆరోపించారు.

అమ్మ స్థానాన్ని భర్తీ చేయలేరు



చెన్నై : రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశంపై శశికళ వర్గం నేత, ఇటీవల ఆర్‌కె నగర్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించిన టిటివి దినకరన్ స్పందించారు. రాజకీయాల్లోకి ఎంత మంది వచ్చినా.. తమిళనాడులో అమ్మ(జయలలిత) స్థానాన్ని భర్తీ చేసేవారు ఎవరూ ఉండరని దినకరన్ అన్నారు. 'అమ్మ విశ్వసనీయత ముందు ఏ కొత్త ముఖం నిలవదు. తమిళనాడులో ఉన్నది ఒక 'అమ్మ', ఒక ఎంజిఆర్ మాత్రమే. వీరితో ఎవరినైనా పోల్చి చూసుకోవచ్చు' అని వ్యాఖ్యానించారు.

చదువే రాదు..ప్రజలకేం నేర్పిస్తాడు



న్యూఢిల్లీ : రజనీకాంత్ రాజకీయ ప్రవేశంపై బిజెపి నేత సుబ్రహ్మణ్య స్వామి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన రాజకీయాల్లోకి వస్తున్నానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవినీతిపరుడైన రజనీకాంత్ అవినీతిని ఎలా అరికడతారు? అని ప్రశ్నించారు. తమిళనాడు సమస్యలపై రజనీకాంత్‌కు కనీస అవగాహన లేదన్నారు. చదువు రాని రజనీకాంత్ తమిళ ప్రజలకు ఏం నేర్పిస్తాడని సుబ్రమణ్యస్వామి విమర్శించారు. మీడియాలో విపరీతమైన ప్రచారం కోసమే రజనీకాంత్ ఇలా చేస్తున్నారని సుబ్రమణ్యస్వామి చెప్పారు. రజనీని వ్యతిరేకిస్తానని ఆయన తేల్చిచెప్పారు. రజనీకాంత్ ముందు తన పార్టీ విధివిధానాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చిక్కుల్లో ఉత్తరాఖండ్ సిఎం రావత్

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ సీఎం టిఎస్ రావత్ ఇరకాటంలో పడ్డారు. ఎన్నికలకు ముందు నామినేషన్ పత్రాల్లో తన వయసు, ఆస్తుల వివరాలను తప్పుగా చూపారంటూ దాఖలైన ఫిర్యాదుపై ఇసి చర్యలు చేపట్టింది. స్థిరాస్తులకు సంబంధించిన విలువను మదింపు చేయాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి)ను ఆదేశించింది. అధికార భాజపాకు చెందిన సీఎం త్రివేంద్ర సింగ్ రావత్‌పై ఆ పార్టీకి చెందిన మాజీ నేత రఘునాథ్ సింగ్ నేగి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల్లో వయసు, స్థిరాస్తులకు సంబంధించిన వివరాలను తప్పుగా చూపారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2007, 2012 అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2014 ఉప ఎన్నికల్లోనూ ఆయన తప్పుడు వివరాలు ఇచ్చారని తెలిపారు.

రూ.2వేల నకిలీ నోట్లు స్వాధీనం



మాల్దా: పశ్చిమ బెంగాల్ భారీగా రెండు వేల రూపాయాల నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని మాల్దా గులాప్ గంజ్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి నకిలీనోట్లను తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 298 నకిలీ రూ.2వేల నోట్లను సరిహద్దు భద్రతాదళం, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5.96 లక్షలు ఉంటుందని తెలిపారు. నకిలీనోట్ల ముఠా వివరాలు సేకరించేందుకు అదుపులోకి తీసుకున్న నిందితులను పోలీసులు విచారిస్తున్నారు.

తెలంగాణలో పులుల గణన



హైదరాబాద్: తెలంగాణలో పులుల జనాభా గణన చేపట్టబోతున్నారు. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత మొదటి సారిగా జనవరి మూడో లేదా నాలుగో వారం పులుల సంఖ్యను లెక్కించబోతున్నామని అటవీ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. తెలంగాణ దాదాపు 17 పులులున్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దేశ వ్యాప్తంగా జనవరి లేదా ఫిబ్రవరిలో పులులను గణించాలని ఆయన తెలిపారు. మాంసాహార జంతువులతోపాటు , ఏనుగు వంటి పెద్ద శాకాహార జంతువుల సంఖ్యను లెక్కించనున్నట్లు ఆ అధికారి తెలిపారు. దీంతోపాటు ఇతర పరిమితులను కూడాపరిగణలోకి తీసుకోనున్నట్లుతెలిపారు. ప్రధాన జంతువు పులి కావడంతో పులుల జనాభా గణనగా పేర్కొంటున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి నాలుగేళ్లకోకసారి చేపట్టే పులుల గణనలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఏజెన్సీ, సమన్వయం చేస్తుండగా, డెహ్రాడూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా సాంకేతిక మార్గదర్శకాలు ఇస్తుందని ఆయన తెలిపారు. అడవిలో ఒక నిర్ధారిత ప్రాంతాన్ని ఫారెస్ట్ బీట్ లేదా యూనిట్‌గా పరిగణించి పులుల జనాభా గణన చేపడతామన్నారు.

సిఆర్‌పిఎఫ్ క్యాంపుపై ఉగ్రదాడి

• నలుగురు జవాన్లు, ముగ్గురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్ : కొత్త సంవత్సరంలోకి అడుగిడే కొన్ని గంటల ముందు తీవ్రవాదులు దారుణానికి పాల్పడ్డారు. జమ్మూకశ్మీర్ పుల్వామాలోని సిఆర్‌పిఫ్ క్యాంపుపై ఆదివారం తెల్లవారుజామున పెద్ద ఎత్తున ఆయుధాలతో పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాదులు బాంబు దాడికి దిగారు. ఈ ఘటనలో నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు బుల్లెట గాయాలతో బాధపడుతున్నట్లు భద్రతా దళం అధికార ప్రతినిధి తెలిపారు. అయితే జవాన్లు అప్రమత్తమై ఎదురు కాల్పులు జరిపారని, ఈ కాల్పుల్లో మృతి చెందిన ఇద్దరు ఉగ్రవాదుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని సిఆర్‌పిఎఫ్ అధికార ప్రతినిధి రాజేష్ యాదవ్ చెప్పారు. మరో ఉగ్రవాది కూడా మృతి చెందినట్లు తాము భావిస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్ క్యాంపుపై ఉగ్రవాదులు గ్రెనైడ్లు విసురుతూ బీభత్సం సృష్టించారని ఓ సిఆర్‌పిఎఫ్ అధికారి స్పష్టం చేశారు. గ్రెనైడ్లతోనే కాకుండా వారి వద్ద పెద్ద ఎత్తున ఉన్న ఆ యుధాలు, అత్యాధునిక తుపాకులతో ఉగ్రవాదులు దాడి చేయగా, వెంట నే మేల్కొన్న జవాన్లు వారి దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టారన్నారు. అయితే ముగ్గురు జవాన్లపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు యాదవ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, డిజిపి ఎస్‌పి వాయిడ్ మాట్లాడుతూ కశ్మీర్ లోయలో ఉగ్రదాడి జరగవచ్చని మూడు రోజుల క్రితమే భద్రతా దళాలకు సమాచారం అందిందన్నారు. అయితే నూతన సంవత్సరంలోకి అడుగిడే ముందు ఈ దాడి జరగడం దురదృష్టకరమన్నా రు. పాకిస్థాన్ తరుచూ ఉగ్రవాదులు పంపుతోందని, ఈ సమస్యను భద్ర తా బలగాలు, కశ్మీర్ లోయ ప్రజలు వారి తరిమికొడుతూనే ఉన్నారన్నారు.

2018 ప్రపంచానికి కొత్త కళ



సిడ్నీలో నూతన సంవత్సర వేడుకలు

న్యూఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 2017కి వీడ్కోలు పలుకుతూ 2018 కి స్వాగతం పలుకుతున్నాయి. 2018 కి స్వాగతం పలికిన దేశాల్లో ముందుగా టోంగా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలు ఉన్నాయి. ఆ తర్వాత జపాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియాలు కొత్త సంవత్సర వేడుకల్లో మునిగి తేలాయి. భారత్ కన్నా ఏడున్నర గంటలకు ముందే న్యూజిలాండ్‌లో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి.న్యూజిలాండ్ తర్వాత ఆస్ట్రేలియా వాసులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. భారత్ కన్నా ముందే దాదాపు 12 దేశాలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికాయి.

ఆక్లాండ్‌లో ఘనంగా వేడుకలు : న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో కొత్త సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కళ్లు చెదిరేలా బాణాసంచా కాల్చుతూ ఆక్లాండ్ ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.ఆక్లాండ్ హార్బర్‌లో ఫెర్రీలో ప్రయాణం చేస్తూ కొందరు వేడుకలను తిలకించారు. అదే విధంగా స్కై టవర్ వద్ద జరిగిన వేడుకలు ప్రజలను కట్టిపడేశాయి. వెల్లింగ్‌టన్ వద్ద కూడా కళ్లు చెదిరే రీతిలో బాణాసంచా కాల్చి ప్రజలు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియాలో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇటీవలే గే వివాహాలను చట్టబద్ధం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకో వడంతో సంబరాలు అంబరాన్నంటాయి. సిడ్నీ హార్బర్ బ్రిడ్జి, సిడ్నీ ఓపెరా హౌస్ తదితర ప్రాంతాలు ప్రజలతో కిక్కిరిసి పోయాయి. వేడుకలను చూసేందుకు లక్షలాదిగా ప్రజలు ఆయా ప్రాంతాలకు తరలివచ్చారు. మెల్‌బోర్న్, హోబార్ట్, కాన్ బెర్రా ప్రాంత ప్రజలు కూడా బాణాసంచా కాల్పులతో హోరెత్తించారు. నూతన సంవత్సరానికి తమదైన శైలిలో స్వాగ తం పలికారు. మెల్ బోర్న్‌లోని ఎర్రా నదిపై జరిగిన వేడుకలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సింగపూర్‌లోని మెరీనా బే కొత్త సంవత్సర వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆ ప్రాంతమంతా బాణాసంచా వెలుగులతో కాంతివంతంగా మారింది.

రాజకీయాల్లోకి వచ్చేస్తున్నా

భ్రష్ట రాజకీయాల దుమ్ముదులుపుతా

అసెంబ్లీ ఎన్నికల్లోగా పార్టీ స్థాపన : రజనీకాంత్



చెన్నై: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ ప్రవేశంపై రెండు దశాబ్దాలుగా నెలకొని ఉన్న ఊహాగానాలకు ఆదివారం ఆయన చేసిన ప్రకటన తెరదించింది. ఇన్నాళ్లు 'రాజకీయాల్లోకి ఎప్పుడు వస్తారు?' అని ఎవరైనా అడిగినప్పుడల్లా ఆయన ఆకాశంవైపుకి చేతులెత్తి ' ఆ దేవుడు శాసించినప్పుడు' అంటుండేవారు. తమిళ వెండితెరపై ఆయనకంటూ ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆయన స్టైల్‌గా నడిచి వచ్చినా థియేటర్లో అభిమానులు చప్పట్లు, ఈలలు వేసి నానా హంగామా చేసేస్తుంటారు. తెరపై ఓ వెలుగు వెలిగిన ఆయన ఇప్పుడు రాజకీయాల్లోకి రానున్నారు. ' నేను రాజకీయాల్లోకి వస్తున్నాను. ఇది నిజం' అంటూ తెల్లని గడ్డంతో, తెల్లని కుర్తా ధరించి ఆయన వేదికపై నుంచి ప్రకటించారు. దీంతో 2017 చివరి రోజున ఆయన తన రాజకీయ రంగ ప్రవేశంపై స్పష్టత ఇస్తూ అందరి అనుమానాలను పటాపంచలు చేశారు. 'దేశ రాజకీయాలు భ్రష్టు పట్టాయి. వాటిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా కొత్త పార్టీ స్థాపిస్తా. మొత్తం 234 స్థానాల్లోనూ పోటీ చేస్తా. అయితే డబ్బు, పదవి వంటి ఆశలతో మాత్రం రాజకీయాల్లోకి రావడం లేదు' అంటూ ఆయన అభిమానుల ఎదుట ప్రకటించారు.

సుపరిపాలన కోసం

రాజకీయాల్లో నిజాయితీ కావాలని, సుపరిపాలన అవసరమని రజనీకాంత్ అన్నారు. 'ప్రతిది మార్చాల్సిన అవసరం ఉంది' అని ఆయన అన్నారు. 'ఆధ్యాత్మిక రాజకీయాలను' ఆరంభించాల్సి ఉందన్నారు. కుల, మత ఛాయలు లేని పారదర్శక పాలన చేపట్టాల్సి ఉందని అన్నారు. 'ఇదే నా నినాదం, కోరిక' అన్నారు. తానొక్కడినే ఏదీ సాధించలేనని, కనుక తన కార్యానికి ప్రజలంతా సహకరించాలని రజనీకాంత్ అభ్యర్థించారు. రాజుల కాలంలో రాజులు తమ శత్రువుల రాజ్యాలను కొల్లగొట్టేవారని, అయితే నేడు ప్రజాస్వామ్యంలో పార్టీలే ప్రజలను కొల్లగొడుతున్నాయని, ఇలాంటి విధానాన్ని 'ప్రజాస్వామికంగానే' మార్చాల్సి ఉందని ఆయన చెప్పారు. ప్రజలకు చేరే వసతులు, హక్కులు నొక్కేయకుండా స్వచ్ఛంద కార్యకర్తలు చూడాలని ఆయన కోరారు. ముడుపుల వ్యవహారం, బంధుప్రీతి వంటివి తాను సహించనని ఆయన అన్నారు. 'స్వార్థపరమైన అవసరాల కోసం అధికారులు, మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఎల వద్దకు పోకుండా నిఘా పెట్టగలిగే స్వచ్ఛంద కార్యకర్తలు తనకు కావాలి' అని రజనీకాంత్ చెప్పారు. 'తప్పు జరిగినప్పుడు ప్రశ్నించగలిగే స్వచ్ఛంద కార్యకర్తలు తన పార్టీకి అవసరం' అని ఆయన అన్నారు. 'నేను ప్రజా ప్రతినిధిని మాత్రమే. అలాంటి నిఘా పెట్టేవారిని పర్యవేక్షిస్తాను' అన్నారు.

మొదటి పని


'తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నమోదైన, నమోదుకాని అభిమాన సంఘాలను గాడిలో పెట్టడమే తన తొలి పని' అని రజనీకాంత్ చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను అమిమానుల క్లబ్‌లోకి తేవాలని, దాని తరువాతే పార్టీ రూపాంతరం చెందుతుందని అన్నారు. ' ఆ పని జరిగేంత వరకు నాతో సహా ఎవరూ రాజకీయాల గురించి మాట్లాడాల్సిన పని లేదు' అని చెప్పారు.

రాజకీయాలు, ప్రజాస్వామ్యం భ్రష్టు పట్టాయి

'రాజకీయాలు, ప్రజాస్వామ్యం చాలా వరకు భ్రష్టుపట్టాయి' అని రజనీకాంత్ అన్నారు. తమిళనాడులో గత సంవత్సర కాలంగా జరిగిన ఘటనలు తమిళులు సిగ్గుతో తలదించుకునేలా చేశాయన్నారు. వేరే రాష్ట్రప్రజలు తమిళులను చూసి నవ్వుకుంటున్నారని చెప్పారు. అధికారంలో ఉన్న ఎఐఎడిఎంకె పార్టీలో ఉన్న లుకలుకలను ఉద్దేశించి ఆయన ఈ మాట అన్నారు. అవినీతి, రాజకీయ అస్థిరత, పాలకుల నివాసాల్లో, కార్యాలయాల్లో ఆదాయపు పన్ను అధికారుల దాడులు, ముఖ్యంగా మంత్రులు, వారి అనుచరులపై దాడులను ఆయన ఉటంకించారు. డబ్బులు పంచారన్న కారణంగా ఆర్.కె.నగర్ ఉప ఎన్నికలను కూడా ఏప్రిల్‌లో రద్దు చేశారు. 'ఒకవేళ ఇప్పుడు కూడా నేను నిర్ణయం తీసుకోలేకపోతే, ప్రజాస్వామ్య పద్ధతిలో మంచి చేయకపోతే నేను చచ్చే వరకు నాకు మంచి జీవితం ఇచ్చిన తమిళ ప్రజలు మన్నించబోరు' అని భావోద్వేగంతో అన్నారు. పార్టీని ఆరంభించడం, అధికారాన్ని చేపట్టడం, పాలించడం అన్నవి 'సాధారణ విషయం' కాదని, అది 'సముద్రం నుంచి ముత్యాన్ని తీయడం వంటిది' అన్నారు. తాను చెప్పినవి సాధించాలంటే దేవుడి ఆశీస్సులు, ప్రజల మద్దతు అవసరం అన్నారు. ఈ సందర్భంగా ఆయన భగవద్గీత శ్లోకాన్ని ఉదాహరించారు. 'కర్తవ్యాన్ని నిర్వహించడమే మన వంతు, ఫలితాన్విడం అనేది దేవుని వంతు' అని ఆయన చెప్పారు. 'ఇది తప్పనిసరి పరిస్థితి' అన్నారు. ' దేశాన్ని పాలించాలనుకుంటే యుద్ధం చేయాల్సిందే. ఒకవేళ యుద్ధంలో చనిపోతే వీర స్వర్గం లభిస్తుంది. కానీ యుద్ధమే చేయకుండా మరణిస్తే మాత్రం ప్రజలు పిరికివాడిగా చెప్పుకుంటారు' అని ఆయన శ్లోకంలోని సారాన్ని వివరించారు. దీనికి అభిమానులు హర్షధ్వానాలు చేశారు. సమయం చాలా తక్కువ ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోనన్నారు. రాజకీయాల్లోకి పేరు, ప్రఖ్యాతుల కోసం రాదలచుకోవడంలేదని రజనీ అన్నారు. తనకు 45 ఏళ్ల వయసున్నప్పుడే దివంగత ముఖ్యమంత్రి జయలలితకు వ్యతిరేకంగా రాజకీయ సందేశం ఇచ్చిన తాను, ఇప్పుడు 68 ఏళ్ల వయస్సులో అధికారం కోసం అంగలారుస్తానా? అన్నారు.

అసెంబ్లీ ఎన్నికల ముందే పార్టీ ప్రకటన

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తగు సమయంలో తన పార్టీ గురించి ప్రకటిస్తానని ఆయన చెప్పారు. ఆ సమయంలోనే పార్టీ విధానల గురించి ప్రజలకు తెలుపుతానన్నారు. తన పార్టీ నినాదం 'సత్యం, కష్టించే తత్వం, అభివృద్ధి' అన్నారు. 'మంచినే మాట్లాడండి, చేయండి...దాంతో అంతా మంచే జరుగుతుంది' అనేదే తన మార్గదర్శక సూత్రం అన్నారు. అభిమానుల క్రమశిక్షణను ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. దాంతో ఏదైనా సాధించొచ్చు అని అన్నారు. 'నేను రాజకీయాల్లోకి రాడానికి భయపడ్డం లేదు. కాకపోతే మీడియాకే భయపడుతున్నాను. రాజకీయాల్లో తాను ఇప్పటికీ చిన్నపిల్లాడి వంటివాడినే' అన్నారు. 'రాజకీయాల్లోకి రావాలన్న నిర్ణయం నేను ఇప్పుడు తీసుకోకపోతే పెద్ద తప్పు చేసినవాడినవుతాను. రాజకీయాలు నాకు కొత్తేం కాదు. 1996 నుంచే నేను రాజకీయాల్లో ఉన్నాను' అని ఆనాటి రోజులను గుర్తు చేశారు.







రజనీ అభిమానుల సంబురాలు

'సత్యం..కార్యం..అభివృద్ధి'

చెన్నై : కొత్త రాజకీయ పార్టీని త్వరలో స్థాపించబో తున్నట్టు ప్రకటించి తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఊహా గానాలకు తెరదించారు. తాను నెలకొల్పబోయే పార్టీ ఎలా ఉంటుందో సూచనప్రాయంగా వెల్లడించారు. 'సత్యం, కార్యం, అభివృద్ధి' తమ పార్టీ మూల సూత్రా లుగా ఉంటాయని అభిమానులతో చెప్పారు. చెడిపోయిన రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే తాను రాజకీయ రంగంలోని దూకుతున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిజాయితీ, జవాబుదారీతనం పెంచాల్సిన అవసరముందన్నారు. రాజకీయాలంటే తనకు భయం లేదని..మీడియా అంటేనే భయపడతానని అన్నారు. ఈ విషయంలో తాను మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. దీని గురించిచో రామస్వామి గతంలో తనను హెచ్చరించారని, ఆయన లేకపోవడం పూడ్చలేని లోటన్నారు. ఆయన ఉండివుంటే తన కొత్త ప్రయాణంలో అండగా నిలిచేవారని పేర్కొన్నారు. తాను పార్టీ పెట్టే వరకు అభిమానులు ఎటువంటి రాజకీయ విభేదాల్లో చిక్కుకోవద్దని, పార్టీ నిర్మాణంలో పాలుపంచుకోవాలని అభిమానులను రజనీకాంత్ కోరారు. సరైన సమయంలో పార్టీని స్థాపిస్తానని, కలిసికట్టుగా పనిచేసి ముందుకు సాగుదామన్నారు. తలైవా ప్రకటనతో ఫ్యాన్స్ హర్షాతిరేకాలు తెలిపారు. తర్వాత అభిమానులతో రజనీకాంత్ ఫొటోలు దిగారు.

ఇవే రజనీ పార్టీ మూలసూత్రాలు

అభిమానుల కోలాహలం

రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నట్లు రజనీకాంత్ ప్రకటించడంపై అభిమానులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుని మరీ సందడి చేశారు. ప్రసంగానంతరం రజనీ తన స్టైయిల్‌లో కళ్యాణ మండపం హాల్ బాల్కనీ నుంచి దిగినప్పుడు అభిమానులు 'తలైవా' (నాయకుడా) అంటూ నినాదాలు చేశారు. ఆయన ఫోటోలున్న ప్లకార్డులు పట్టుకుని, ప్రసిద్ధ పాటలకు అనువుగా డ్యాన్సులు చేస్తూ కోలాహలం చేశారు. 'నూతన సంవత్సరానికి తమ తలైవా ఇచ్చిన బహుమానం ఇది' అని అభిమానులు చెప్పారు. సమావేశం జరిగిన రాఘవేంద్ర కళ్యాణ మండపం వద్ద, ఇతర ప్రాంతాల్లో అభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న వారికి కూడా మిఠాయిలు పంచారు. తెలుపు, ఎరుపు జెండా మధ్యన రజనీ బొమ్మ, నీలిగీతలు ఉన్న జెండాలను రజనీకాంత్ అభిమానులు ఊపుతూ సందడి చేశారు.

అమితాబ్, కమల్ సహా పలువురి అభినందనలు

సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ ప్రవేశ ప్రకటనను చేయగానే మెగాస్టార్(బిగ్ బి) అమితాబ్ బచ్చన్, కమల్ హసన్ సహా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 'నా మిత్రుడు, సహచర నటుడు, వినయవిధేయతలున్న రజనీకాంత్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించారు ఆయనకు విజయం కలగాలని నేను కోరుకుంటున్నా అని అమితాబ్ బచ్చన్ ట్వీట్ చేశారు. 'సోదరుడు రజనీ సామాజిక బాధ్యత, రాజకీయ ప్రవేశాన్ని నేను స్వాగతిస్తున్నా అని కమల్‌హసన్ పేర్కొన్నారు. 'రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు రజనీ ప్రకటించారు.ఆలోచించే వ్యక్తులెవరైనా ప్రత్యేకతను చాటుకుంటారు. భారత్‌లో సామరస్యం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం తిరిగొస్తాయని భావిస్తున్నా. ఆయన తన కార్యంలో విజయం సాధించాలని కాంక్షిస్తున్నా అని ఖుష్బూ స్వాగతించారు.



ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచిన పిఎన్‌బి

న్యూఢిల్లీ: నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) డిపాజిటర్లకు తీపి కబురు వినిపించింది. పలు రకాల డిపాజిట్లపై వడ్డీ రేట్లను 1.25 శాతం మేరకు పెంచింది. రూ.10 కోట్ల వరకు టర్మ్ డిపాజిట్‌లపై 1.25 శాతం వడ్డీ రేటును పెంచగా, 2018 జనవరి 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. 7–29 రోజుల కాలం వ్యవధిలో రూ.1 కోటి లోపు దేశీయ రిటైల్ టర్మ్ డిపాజిట్‌లపై వడ్డీ రేటు 1.25 శాతం పెరిగింది. దీంతో గతంలో ఉన్న 4 శాతం నుంచి 5.25 శాతానికి ఈ వడ్డీ రేటు పెరుగుతుంది. 46 నుంచి 90 రోజుల మెచ్యూరిటీ డిపాజిట్లకు వడ్డీ రేటును 5.50 శాతం నుంచి 6.25 శాతానికి పెంచింది. 91 నుంచి 179 రోజుల మెచ్యూరిటీ గల డిపాజిట్లపై వడ్డీ రేటును ప్రస్తుత 6 శాతం నుంచి 6.25 శాతానికి పెంచింది. ఏడాది వ్యవధి కలిగిన బల్క్ టర్మ్ డిపాజిట్లపై 5 శాతంగా ఉన్న వడ్డీని 5.7 శాతానికి పెంచింది. మూడునుంచి పదేళ్ల వ్యవధి గల డిపాజిట్లపై వడ్డీరేటును 5 నుంచి 5.25 శాతానికి పెంచింది. ఇతర బ్యాంకులు కూడా పిఎన్‌బిని అనుసరించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మన తెలంగాణ
9
హైదరాబాద్
సోమవారం
1, జనవరి 2018
www.manatelangana.news

లెక్కలు తేల్చండి



- పెరుగుతోన్న నిరర్థక ఆస్తులు
- తనఖా ఆస్తులపై తగిన నిర్ణయాలు తీసుకోవాలి
- ప్రభుత్వరంగ బ్యాంకులకు ఆర్థిక మంత్రిత్వశాఖ సూచన

న్యూఢిల్లీ: బ్యాలెన్స్ షీట్లు(ఆస్తి అప్పుల పట్టిక)ను పటిష్టం చేసేందుకు ప్రభుత్వరంగ బ్యాంకులు తమ వద్ద తనఖా పెట్టిన ఆస్తులను అమ్మడం, బదలీ చేయడం వంటి అవకాశాలను పరిశీలించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సూచించింది. తనఖా ఆస్తులను అమ్మడంలో బలంగా ఉన్న ఇతర బ్యాంకులను సంప్రదించాలని పేర్కొంది. ఇప్పటికే నిరర్థక ఆస్తులు, భారీ ఎగవేతదారులు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ విధంగా స్పందించింది. పటిష్ఠంగా ఉన్న బ్యాంకులు ఇతర సంస్థల రుణాలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. మొండిబకాయిలు పేరుకుపోవడంతో బ్యాంకులను పటిష్ఠపరిచేందుకు రూ.2.11 లక్షల కోట్ల మూలధనాన్ని అందిస్తామని ఇటీవల ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. రుణాల కోసం తనఖా పెట్టిన ఆస్తులు విక్రయిస్తే కొంత భారం తగ్గుతుందని, తద్వారా బ్యాంకు ముఖ్యమైన విధులు నిర్వర్తించుకునే అవకాశాలు ఉంటాయని ప్రభుత్వం సూచిస్తోంది. చిన్న, మధ్య తరహా సంస్థల వ్యాపారాలకు అధికంగా రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రత్యేక శాఖలు ఏర్పాటు చేయాలని కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో తయారీ రంగంలో 40 శాతం ఉద్యోగాలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలే కల్పిస్తున్నాయి. అందుకే క్లస్టర్ ఆధారంగా సంస్థలకు రుణాలు అందజేయాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందుకోసం ఇప్పటికే 50 క్లస్టర్లను గుర్తించింది.

కాగా ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) పేరుకుపోవడం వల్లే ఈ ఏడాది అక్టోబర్‌లో వాటికి జైట్లీ మూలధన నిధిని ప్రకటించారు. రెండేళ్లకు గాను రూ.2.11 లక్షల కోట్ల రీక్యాపిటలైజేషన్‌ను అందజేస్తున్నట్టు తెలిపారు. మొండి బకాయిలు పేరుకుపోయి డీలపడిన ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థకు ఈ మూలధనం ఉత్సాహాన్ని అందించింది. బాండ్ల ద్వారా రూ.1.35 లక్షల కోట్ల మూలధనాన్ని, కేంద్ర బడ్జెటరీ ఫండ్ నుంచి రూ.18,139 కోట్లు, మిగతా రూ.58 వేల కోట్లు ప్రభుత్వ ఈక్విటీని తగ్గించడం ద్వారా క్యాపిటల్ మార్కెట్ నుంచి సమీకరించనున్నట్టు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. నిరర్థక ఆస్తులు(ఎన్‌పిఎ) పెరిగిపోయి ప్రభుత్వరంగ బ్యాంకుల ఆస్తుల నాణ్యత ఆందోళనకరంగా మారింది.

పెనాల్టీల మోత

ఇప్పుడు బ్యాంకులు అంటే ప్రజలు బెంబేలెత్తే పరిస్థితి వస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు, డిజిటల్ విధానాలతో బ్యాంకుల చుట్టూ తిరిగి ప్రజలకు బేజారు వచ్చింది. మరోవైపు బ్యాంకుల్లో కనీస డిపాజిట్ ఉండాలని లేకపోతే ఫెనాల్టీలని చెప్పడంతో వినియోగదారులు కనీస బ్యాలెన్స్ కోసం నానా తిప్పలు పడుతున్నారు. ఈ వంకతో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్‌రంగ బ్యాంకులు ఎడాపెడా పెనాల్టీల మోత మోగిస్తున్నాయి. తమ సేవింగ్స్ అకౌంట్లలో బ్యాంకు చెప్పిన ప్రకారం కనీస బ్యాలెన్స్ ఉండకపోతే, ఇక అంతే సంగతులు. అయితే బ్యాంకులు విధించే ఈ ఛార్జీలు సరైన నిబంధనలకు లోబడి ఉన్నాయా? లేవా? అంటే తెలియదు అనే సమాధానం వస్తుంది. అయితే దీనిపై ఓ ప్రొఫెసర్ చేపట్టిన సర్వేలో మినిమమ్ బ్యాలెన్స్ నిర్వహించడం లేదని కస్టమర్లకు విధిస్తున్న ఛార్జీలు అసమంజసంగా ఉన్నాయని తేలింది. ఆశిష్ దాస్ ఈ సర్వే చేపట్టగా, యస్ బ్యాంకు, ఇండియన్ ఓవర్‌సీస్ లాంటి బ్యాంకులు విధిస్తున్న పెనాల్టీలు వార్షికంగా 100 శాతం కంటే పైననే ఉన్నాయని తేలింది. కనీస బ్యాలెన్స్‌లు నిర్వహించలేని కస్టమర్లకు విధించే ఛార్జీల విషయంలో ఆర్‌బిఐ రూపొందించిన మార్గదర్శకాలు, చాలా సమంజసంగా ఉన్నాయి. అయికే చాలా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు సగటున చాలా ఎక్కువ



మొత్తంలో ఉన్నాయని సర్వేలో వెల్లడైంది. ఈ వివరాల ప్రకారం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు వార్షిక ఛార్జీ 159.48 శాతంగా, యస్ బ్యాంకు ఛార్జీ 112.8 శాతంగా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఛార్జీ 83.76 శాతంగా, యాక్సిస్ బ్యాంకు ఛార్జీ 82.2 శాతంగా ఉన్నట్టు తెలిసింది. ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బిఐ విధించే పెనాల్టీలు కూడా 24.6 శాతంగా ఉన్నాయని ఈ సర్వే తెలిపింది.

బాధపడొద్దనుకుంటే.. మనం పనిచేయాలి

కొత్త సంవత్సరంలో సిబ్బందికి ఎయిర్ ఇండియా కొత్త చీఫ్ సందేశం





న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా సిబ్బందికి కొత్తగా వచ్చిన చీఫ్ ప్రదీప్ ఖరోలా నూతన సంవత్సరం సందర్భంగా ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. 'నశించొద్దు అనుకుంటే పనిచేయాలి' అంటూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎయిర్ ఇండియా ఉద్యోగులకు సందేశమిచ్చారు. వృత్తి నైపుణ్యం, నిర్మాణాత్మక పని సంప్రదాయం విమాన సంస్థకు ఎంతో కీలకమని ఆయన అన్నారు. ఖరోలా డిసెంబర్ 11న ఎయిర్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సంస్థల అప్పుల భారంలో ఉండడంతో నిరాశలో ఉన్న సిబ్బందిలో ఉత్సాహం నింపేందుకు గాను ఖరోలా సందేశమిచ్చారు. 'మనం తప్పనిసరిగా పనితీరును మెరుగుపరచుకోవాలి. తద్వారా సంస్థను నిలబెట్టేందుకు కృషి చేయాలి' అని ఆయన అన్నారు. అయితే విదేశాలకు పారిపోయిన పారిశ్రామికవేత్త విజయ్ మాల్యాకు చెందిన కింగ్‌ఫిషర్ మాదిరిగా ఎయిర్ ఇండియాను కానివ్వబోమని లోక్‌సభలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతి రాజు హామీ ఇచ్చారు. ఎయిర్ ఇండియాలో పనిచేస్తున్న ఏ ఉద్యోగి కూడా పనికోల్పోయే పరిస్థితి తీసురాబోమని ఆయన తెలిపారు. ఎయిర్ ఇండియా ఉద్యోగులెవరికీ ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి రాదని, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌లాగా ఎయిరిండియాను కానివ్వబోమని స్పష్టం చేశారు. ప్రజలకు, దేశానికి ఎయిర్ ఇండియా సేవలు అవసరమని అన్నారు. కాగా రూ.52 వేల కోట్ల అప్పులు ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు భారంగా మారాయి. దీంతో ఈ సంస్థను ప్రైవేటీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా సగం వర్కింగ్ క్యాపిటల్ రుణాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఎయిర్ ఇండియాకు మొత్తం 105 విమానాలు ఉన్నాయి. 2017 మార్చి నాటికి ఈ సంస్థల ఆస్తుల విలువ రూ.40 వేల కోట్లుగా ఉంది. పెట్టుబడుల ఉపసంహరణ, బిడ్డింగ్ విషయంలో ఆర్థికమంత్రి జైట్లీ ఆధ్వర్యంలో మంత్రుల బృందం నిర్ణయాలు తీసుకోనుంది. ఎయిర్ ఇండియా మొత్తం అప్పులు రూ.52 వేల కోట్లుగా ఉన్నాయి. వీటిలో రూ.20 వేల కోట్లు విమాన సంస్థకు చెందినవి కాగా, మిగతా రూ.32 వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌కు చెందినవి.

2018 స్టాక్ మార్కెట్ సెలవులు



1. రిపబ్లిక్ డే (జనవరి 26, 2018) శుక్రవారం
2. మహాశివరాత్రి (ఫిబ్రవరి 13, 2018) మంగళవారం
3. హోలీ (మార్చి 02, 2018) శుక్రవారం
4. మహావీర్ జయంతి (మార్చి 29, 2018) గురువారం
5. గుడ్ ఫ్రైడే (మార్చి 30,2018) శుక్రవారం
6. మహారాష్ట్ర దినం (మే 01, 2018) మంగళవారం
7. స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15, 2018) బుధవారం
8. బక్రీద్ (ఆగస్టు 22, 2018) బుధవారం
9. గణేష్ చతుర్థి (సెప్టెంబర్ 13, 2018) గురువారం
10. మొహర్రం (సెప్టెంబర్ 20, 2018) గురువారం
11. మహాత్మాగాంధీ జయంతి (అక్టోబర్ 02, 2018) మంగళవారం
12. దసరా (అక్టోబర్ 18, 2018) గురువారం
13. దీపావళి లక్ష్మి పుజ (నవంబర్ 07, 2018) బుధవారం
14. దీపావళి బలిప్రతిపద (నవంబర్ 08, 2018) గురువారం
15. గురునానక్ జయంతి (నవంబర్ 23, 2018) శుక్రవారం
16. క్రిస్మస్ (డిసెంబర్ 25, 2018) మంగళవారం





కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28200	30160.43	0.89%
ముంబై	28770	30770.05	–0.07%
ఢిల్లీ	28250	30213.90	0%
కోల్‌కతా	28850	30855.61	–0.14%
కేరళ	27200	29090.91	0.37%
బెంగళూరు	27300	29197.86	0%
హైదరాబాద్	27980	29925.13	0.11%
గల్ఫ్	1346.4	1440.00	0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	41000.00	40700.00	0.74
ముంబై	41000.00	40700.00	0.74
ఢిల్లీ	41000.00	40700.00	0.74
కోల్‌కతా	41000.00	40700.00	0.74
హైదరాబాద్	41000.00	40700.00	0.74



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	340	విశాఖపట్నం	352
వరంగల్	336	చిత్తూరు	363
విజయవాడ	346	చెన్నై	370
గోదావరి	346	బెంగళూరు	355

బిట్ కాయిన్ వాస్తవ విలువ 'సున్నా'



మోర్గాన్ స్టాన్లీ వెల్లడి

న్యూఢిల్లీ: క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ 2017 సంవత్సరంలో ఓ హాట్ టాపిక్‌గా మారింది. ఈ వర్చువల్ కరెన్సీ గతేడాదిలో దాదాపు 13 రెట్లు పెరిగింది. అయితే మోర్గాన్ స్టాన్లీ నిపుణుడు జేమ్స్ ఫాసెట్, ఆయన బృందం బిట్‌కాయిన్ విలువపై ఆశ్చర్యకరమైన ప్రకటన చేసింది. అమెరికా డాలర్ వంటి కరెన్సీగా బిట్‌కాయిన్‌ను ఏమాత్రం పోల్చలేమని, ఎందుకంటే క్రిప్టోకరెన్సీ విలువ ఎలాంటి వడ్డీ రేటును కలిగి ఉండదని, నగదు లభ్యత ఉండదని ఫాసెట్ అన్నారు. ఈ కరెన్సీ వెంట ప్రపంచం పరుగులు పెడుతోంది. సామాన్యుల ఆలోచనలు ఎలా ఉన్నప్పటికీ మోర్గాన్ స్టాన్లీ మాత్రం బిట్‌కాయిన్ విలువ సున్నానే అని పేర్కొంది. ఈ మేరకు తన క్లయింట్లకు నోట్ కూడా పంపారు. బిట్‌కాయిన్‌ను అమెరికా డాలర్ మాదిరిగా నిజమైన కరెన్సీగా చూడలేమని, కరెన్సీ కానందున క్రిప్టోకరెన్సీలు వడ్డీ రేట్లతో ముడిపడి ఉండవని, దీనికి నగదు లభ్యత ఉండదని పేర్కొంది. బిట్‌కాయిన్‌కు డిజిటల్ బంగారం మాదిరి లక్షణాలున్నా, వాటి మాదిరిగా ఎల్రక్టానిక్స్‌లో, ఆభరణాల్లో వినియోగించలేమని వెల్లడించింది. బిట్ కాయిన్ ధర ప్రధానంగా డిమాండ్, సరఫరా ఆధారంగానే నడుస్తోంది. కేవలం కొన్ని ఆన్‌లైన్ సంస్థలే బిట్‌కాయిన్లను ఆమోదిస్తున్నాయి. దీన్ని ఆమోదించే రిటైలర్ల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఎవరూ చెల్లింపులకు దీన్ని ఆమోదించకుంటే అప్పుడు దీని విలువ సున్నాయే అవుతుందని ఫాసెట్ అన్నారు.

ఫ్లిప్‌కార్ట్ 2018 మొబైల్ బొనాంజా సేల్



న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం పురస్కరించుకుని ఇ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ మొబైల్ ఫోన్లపై భారీగా ఆఫర్లను ప్రకటించింది. 2018 జనవరి 3 నుంచి 5 వరకు వివిధ రకాల స్మార్ట్‌ఫోన్లపై భారీగా డిస్కౌంట్ ఇవ్వనుంది. రూ. 99కే బైబ్యాక్ గ్యారంటీ సదుపాయాన్ని కల్పిస్తోంది. దీని కింద వినియోగదారుల పాత ఫోన్లకి పూర్తిగా 50 శాతం వరకు చెల్లించనుంది. నో కాస్ట్ ఇఎంఐ సదుపాయాన్ని కల్పిస్తూ పాత ఫోన్లను ఎక్స్‌ఛేంజ్ చేసుకునేవారికి కంపెనీ షరతుల మేరకు పూర్తిగా రూ. 18వేల వరకు చెల్లించే అవకాశముంది. దేశంలో ఎక్కువగా సేల్ అయ్యే స్మార్ట్‌ఫోన్ షియోమీ నోట్ 4 ధర ప్రస్తుతం రూ. 12,999గా ఉండగా, ఈ స్మార్ట్ ఫోన్ రూ. 10,999 కే లభించనుంది. అలాగే రూ. 14,999 విలువ చేసే షియోమీ ఎ1 రూ. 12,999కి లభించనుంది. గూగుల్ పిక్సెల్ 2 పై రూ. 13,001, పిక్సెల్2 ఎక్స్‌ఎల్‌పై రూ. 8,001 డిస్కౌంట్ లభించనుంది. వారి పాత మొబైల్‌ను ఎక్స్‌ఛేంజ్ చేసి కొత్త పిక్సెల్ 2ఎక్స్‌ఎల్ కొనే వినియోగదారులకు అదనంగా మరో రూ. 4 వేలు తగ్గనుంది. ఇదే వరుసలో మోటో జి5 ప్లస్, మోటో సి, మోటో సి ప్లస్, శాంసంగ్ గెలాక్సీ ఎస్7, గెలాక్సీ ఆన్ నెక్ట్స్(16జిబి) తదితర స్మార్ట్‌ఫోన్లపై ఫ్లిప్‌కార్ట్ భారీ డిస్కౌంట్లు అందిస్తోంది.

2017లో 1.85 లక్షలకు పెరిగిన ఉద్యోగాలు

న్యూఢిల్లీ: 2017 జనవరి–మార్చి వ్యవధిలో ఎనిమిది రంగాల్లో మొత్తంగా 1.85 లక్షలకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. దీనిలో 59 వేల మంది మహిళలు ఉన్నారు. అయితే 2017లో తొలి మూడు నెలల్లో 8 రంగాల్లో దాదాపు 53 వేల మంది దినసరి వేతన జీవులు ఉపాధి కోల్పోయారని లేబర్ బ్యూరో తాజా అధ్యయనం పేర్కొంది. ఐతే అదే మూడు నెలల్లో ఐటీ, తయారీ వంటి రంగాల్లో ఉద్యోగ పరిస్థితులు మెరుగయ్యాయి. మొత్తం 1.85 లక్షల ఉద్యోగాల పెరుగుదల కనిపించింది. 1.97 లక్షల క్రమబద్ధీకరించిన, 26 వేల ఒప్పంద ఉద్యోగాల్లో సానుకూల మార్పు కనిపించింది. దినసరి వేతన జీవులు 53 వేల మంది తగ్గారు' అని కార్మిక మంత్రిత్వ శాఖలోని లేబర్ బ్యూరో విభాగం తాజా త్రైమాసిక సర్వే తెలిపింది. స్వయం ఉపాధి పొందిన వారు 15 వేల మంది పెరిగారు. తయారీ, నిర్మాణం, వాణిజ్యం, రవాణా, విద్య, వైద్యం, ఆతిథ్యం, ఐటి, బిపివో రంగాల్లో లేబర్ బ్యూరో అధ్యయనం చేపట్టింది. ఈ అధ్యయనం ప్రకారం గతేడాది ఉద్యోగాలు పెరిగాయని సూచిస్తోంది.

టాప్ 10లో నాలుగు కంపెనీలు నష్టాల్లో..

మొత్తం రూ.21,319 కోట్ల మార్కెట్ విలువ మైనస్


ముంబయి: గత వారం టాప్ 10 బ్లూచిప్ కంపెనీల్లో నాలుగు కంపెనీలు దాదాపు రూ. 21,319 కోట్ల మార్కెట్ విలువ(ఎం–క్యాప్)ను కోల్పోయాయి. ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ కంపెనీలు భారీగా నష్టపోయాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి కూడా మార్కెట్ విలువను మరింతగా కోల్పోయాయి. మిగతా సంస్థలు రిలయన్స్ ఇండస్ట్రీస్, టిసిఎస్, హెచ్‌యుఎల్, మారుతీ సుజుకీ ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి, ఒఎన్‌జిసిలు మార్కెట్ విలువను పెంచుకున్నాయి. ఈ కంపెనీలు మొత్తంగా రూ.19,739.62 కోట్ల మార్కెట్ విలువను పెంచుకోగా, మిగతా కంపెనీల నష్టంతో పోలిస్తే ఇది తక్కువగానే ఉంది. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.11,542 కోట్లు కోల్పోయి రూ.2,26,978 కోట్లకు చేరింది. ప్రభుత్వం బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఎం–క్యాప్ రూ.8,934 కోట్లు పెరిగి రూ.2,67,162 కోట్లకు చేరగా, మరోవైపు హెచ్‌డిఎఫ్‌సి రూ.597.61 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయి రూ.4,85,273 కోట్లకు చేరింది. ఎఫ్‌ఎంసిజి దిగ్గజం ఐటిసి ఎం–క్యాప్ రూ.245 కోట్లు పడిపోయి రూ.3,20,731 కోట్లకు చేరింది. మరోవైపు టిసిఎస్ విలువ రూ.11,601 కోట్లు పెరిగి రూ.5,16,934 కోట్లు అయింది. హెచ్‌యుఎల్ ఎం–క్యాప్ రూ.3,560.56 కోట్లు పెరిగి రూ.2,96,122 కోట్లు అయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.1,615 కోట్ల మార్కెట్ విలువను పెంచుకుని రూ.5,83,347 కోట్లకు చేరింది. ఒఎన్‌జిసి మార్కెట్ విలువ రూ.1,604 కోట్లు పెరిగి రూ.2,49,799 కోట్లకు చేరింది. మారుతీ ఎం–క్యాప్ రూ.939 కోట్లు పెరిగి రూ.2,93,965 కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి మార్కెట్ విలువ రూ.419.82 కోట్లు పెరిగి రూ.2,73,252 కోట్లకు చేరింది. టాప్ 10 ర్యాంకింగ్‌లో ఆర్‌ఐఎల్ మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత వరుసగా టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, హెచ్‌యుఎల్, మారుతీ, హెచ్‌డిఎఫ్‌సి, ఎస్‌బిఐ, ఒఎన్‌జిసి, ఇన్ఫోసిస్‌లు ఉన్నాయి. కాగా గత వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితమైనప్పటికీ స్టాక్‌మార్కెట్లు సరికొత్త రికార్డులతో ముగిశాయి. ఈ ఏడాది ఆఖరి ట్రేడింగ్ వారం ఇదే..



కొత్త సంవత్సరంలోకి మదుపర్లు అడుగుపెట్టారు. అయితే మార్కెట్ చరిత్రలో తొలిసారి 34,000 పాయింట్ల మైలురాయిని అధిగమించగా, నిఫ్టీ 10,500 మార్క్‌ను చేరుకుంది. సెన్సెక్స్ నికరంగా 116 పాయింట్లు (0.35 శాతం) లాభపడి 34,057 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 38 పాయింట్ల (0.35 శాతం) లాభంతో 10,530 వద్ద స్థిరపడింది. బిఎస్‌ఇలో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 1.3 శాతం చొప్పున ఎగశాయి.

పాత్ర కోసం గుండు చేయించుకున్నాడు

మెగాస్టార్ చిరంజీవి 151వ సినిమా 'సైరా.. నరసింహారెడ్డి' రెండో షెడ్యూల్ కోసం రంగం సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర కోసం బ్రహ్మాజీని తీసుకున్నారు. నరసింహారెడ్డి పక్కన నమ్మిన బంటులా ఉండే ఈ పాత్ర ఒరిజినల్‌గా నున్నని గుండుతో పాటు గుబురు మీసంతో ఉంటుందట. సురేందర్ రెడ్డి ఈ పాత్ర గురించి చెప్పడంతో మరో ఆలోచన లేకుండా బ్రహ్మాజీ గుండు కొట్టించుకున్నాడట. నరసింహారెడ్డి అనుచరులుగా ఇప్పటికే ముగ్గురిని ఎంపికచేశారు. ఓబయ్యగా విజయ్ సేతుపతి కీలక పాత్ర చేస్తుండగా... పక్కనే ఉంటూ ద్రోహం చేసే రోల్‌లో జగపతిబాబు నటిస్తున్నాడు. ఇప్పుడు వీరితో పాటు డేగ కళ్లతో నరసింహారెడ్డికి కాపలా కాసే పాత్రలో బ్రహ్మాజీ ఖరారయ్యాడు. అయితే పాత్ర పేరు ఏమిటనేది ఇంకా తెలియలేదు. గత కొద్దిరోజులుగా బ్రహ్మాజీ బయట ఎక్కడ కనిపించినా తలపాగాతో కనిపిస్తున్నాడు. ఇప్పుడు ఆ గుండు రహస్యం కాస్తా బయటకు వచ్చేసింది. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న 'సైరా..'లో చిరంజీవికి గురువుగా అమితాబ్ బచ్చన్ నటించనున్నట్టు తెలిసింది.






రామ్‌చరణ్

రాజవంశీకుడిగా రామ్‌చరణ్

రామ్‌చరణ్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రంగస్థలం' చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. ఈ చిత్రాన్ని మార్చి 30న విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఈ చిత్రం తర్వాత రామ్‌చరణ్... బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు. ఈ చిత్రం షూటింగ్ జనవరి మూడో వారంలో ప్రారంభంకానుందని తెలిసింది.


జనవరి 18 లేదా 19 నుంచి చిత్రీకరణ మొదలవుతుందని సమాచారం. మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో చరణ్ రెండు షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తాడని టాక్. రాజస్థాన్ ప్రాంతాల్లో అధిక శాతం షూటింగ్ చేయబోతున్నారు. సల్మాన్‌ఖాన్ నటించిన 'ప్రేమ్ రతన్ ధన్‌పాయో' చిత్రం షూటింగ్ జరిగిన లొకేషన్స్‌ను ఇందుకోసం ఎంపిక చేశారని తెలిసింది. సినిమాలో రాజవంశీకుడిగా రామ్‌చరణ్ కనిపిస్తాడట. చిరంజీవి గతంలో రాజా విక్రమార్క, శివుడు శివుడు శివుడు సినిమాల్లో ఈ తరహా పాత్రను పోషించారు. డివివి దానయ్య నిర్మించే ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా తమన్‌ను ఎంపిక చేస్తారని తెలిసింది.



పవన్‌కళ్యాణ్

బ్రూస్‌లీకి మొగుడిలా ఉన్నాడు!

కొంచెం గ్యాప్ ఇచ్చి మళ్లీ పవన్‌కళ్యాణ్ మీద పడ్డాడు రామ్‌గోపాల్‌వర్మ. తాజాగా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ 'అజ్ఞాతవాసి' టీం ఈ సినిమా నుంచి మూడు, నాలుగు కొత్త పోస్టర్లను రిలీజ్ చేసింది. ఆ పోస్టర్లలో పవన్ సమ్‌థింగ్ స్పెషల్‌గా కనిపించాడు. వాటిని చూసిన వర్మ... పవన్ గురించి తనదైన శైలిలో అతిశయోక్తులతో ఫేస్‌బుక్‌లో మెసేజ్‌లు పెట్టాడు. ఇంతకి తన మెసేజ్‌లలో వర్మ...పవన్ గురించి ఏన్నాడంటే... ''నేను నా గత జన్మలో కూడా ఇలాంటి యాటిట్యూడ్ ఉన్న అతన్ని చూడలేదు. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ ఎందుకూ పనికి రారు పీకే ముందు. బ్రూస్‌లీకి మొగుడిలా ఉన్నాడు''అని పేర్కొన్నాడు. అంతేకాకుండా... ''నేను గే కాదని అందరికీ తెలుసు. కానీ ప్రపంచంలో ఉన్న మొత్తం అందమైన అమ్మాయిలు అందరూ ఒక వైపున్నా నేను ఈ పోస్టర్లలో ఉన్న అబ్బాయినే ఎంపిక చేసుకుంటా''అని వర్మ చెప్పాడు. ''పవన్‌కళ్యాణ్ ముందు పుట్టాడా? ఎమోషన్ తర్వాత పుట్టిందా? అనేది... చెట్టు ముందు విత్తు ముందా?, కోడి ముందా గుడ్డు ముందా? అనే అనాది ప్రశ్నకి నా సమాధానం... పవన్‌కళ్యాణ్ ముందు పుట్టి మనందరికీ ఇప్పుడు ఎమోషన్ నేర్పుతున్నాడని... హ్యాట్సాప్ పీకే''అని వర్మ ఫేస్‌బుక్‌లో పేర్కొన్నాడు.



రామ్‌గోపాల్ వర్మ

16 ఏళ్ల అమ్మాయి 'హార్ట్ బీట్'

ధృవ, వెంబ జంటగా దేవాస్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై శ్యామ్ దేవభక్తుని నిర్మాణ సారథ్యంలో ద్వారక్ రాజా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ''హార్ట్ బీట్'. డిఫరెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం సెన్సార్ పూర్తిచేసుకొని క్లీన్ యు సర్టిఫికెట్‌ను అందుకుంది. ఇటీవల విడుదలైన టీజర్, పోస్టర్లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అతి త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత శ్యామ్ దేవభక్తుని మాట్లాడుతూ ''16 ఏళ్ల అమ్మాయి తనకంటే వయసులో చాలా పెద్దవాడైన యువకుడిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రం 'హార్ట్ బీట్'. ఎక్కడా అసభ్యతకు, అశ్లీలతకు తావులేకుండా చాలా ఆసక్తికరంగా తెరకెక్కించాం. మా దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కించిన విధానం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాము''అని అన్నారు.



ధృవ
వెంబ

కొత్త తరం ప్రేమ కథ

సుధీర్‌బాబు హీరోగా మోహన్‌కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. బాలీవుడ్ భామ అదితీరావు హైదరీ ఈ సినిమాలో నాయికగా నటిస్తోంది. శ్రీదేవి మూవీస్ ప్రొడక్షన్ నంబర్ 10గా ఈ సినిమాను నిర్మిస్తోంది. నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ''డిసెంబర్ 11 నుంచి 23 వరకు హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్ పూర్తి చేశాం. హీరో ఇంటికి సంబంధించిన కీలక సన్నివేశాలను తెరకెక్కించాం. ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ రూపొందించిన హీరో హౌస్ సెట్ చాలా స్పెషల్‌గా ఉంటుంది. అవుట్‌పుట్ చాలా సంతృప్తికరంగా వస్తోంది. జనవరి 1 నుంచి రెండో షెడ్యూల్ ప్రారంభిస్తాం. అది కూడా భాగ్యనగరంలోనే ఉంటుంది. ఇంకా సినిమా టైటిల్ ఖరారు కాలేదు. సంక్రాంతి తర్వాత టైటిల్ ప్రకటిస్తాం. మే నెలలో చిత్రాన్ని విడుదల చేస్తాం''అని అన్నారు. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ ''రొమాన్స్, హాస్యం సమ్మిళితమైన కథ ఇది. ఈ సినిమాలో హీరో చిల్డ్రన్స్ బుక్ ఇల్లస్ట్రేటర్‌గా నటిస్తున్నారు. అనూహ్యమైన కథాంశంతో ఆద్యంతం వినోదాత్మకంగా నడిచే ఒక కొత్త తరం ప్రేమ కథా చిత్రమిది. పి.జి.విందా ఫొటోగ్రఫీ హైలైట్‌గా ఉంటుంది''అని అన్నారు. నరేష్, తనికెళ్ల భరణి, నందు, రాహుల్, రామకృష్ణ, పవిత్ర లోకేష్, కాదంబరి కిరణ్, హరితేజ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరామెన్: పి.జి.విందా, సంగీతం: వివేక్ సాగర్, ఎడిటింగ్: మార్తాండ్ కె.వెంకటేష్.





శృతిహాసన్

మానవ సంబంధాల బ్రిడ్జ్

ఎమ్‌విఈ స్టూడియోస్ ప్రై.లి. బ్యానర్‌పై రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరీ, మనాలీ రాథోడ్ హీరోహీరోయిన్లుగా రేవన్ యాదు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హౌరా బ్రిడ్జ్'. ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తిచేసుకొని సెన్సార్‌కు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా జనవరిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా హీరో రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ ''మానవ సంబంధాలకు ఈ కథ బ్రిడ్జ్‌గా ఉంటుంది. ఇందులో మరో బ్రిడ్జ్ కూడా ఉంటుంది. అది ఏమిటనేది ప్రస్తుతానికి సస్పెన్స్. చాందినీ చౌదరి ఇందులో చాలా మంచి క్యారెక్టర్‌లో నటించింది. మనాలీ రాథోడ్‌కు ఈ సినిమా చాలా మంచి పేరు తెస్తుంది. జనవరిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం''అని అన్నారు. దర్శకుడు రేవన్ మాట్లాడుతూ ''ఇది నా రెండో ప్రాజెక్ట్. బూచమ్మ బూచోడు నాకు చాలా మంచి పేరు తెచ్చింది. రాహుల్ రవీంద్రన్ అద్భుతంగా నటించాడు. చాందిని చౌదరి, మనాలీ రాథోడ్ అటు అందం, ఇటు అభినయంతో ఆకట్టుకుంటారు. బ్రిడ్జ్ నేపథ్యంలో ఆసక్తికరంగా సాగే స్టోరీ ఇది. కథలో అనేక ట్విస్టులుంటాయి. డిఫరెంట్ స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను అలరిస్తాం''అని తెలిపారు. రావు రమేష్, అజయ్, అలీ, పోసాని కృష్ణమురళీ, ప్రభాస్ శ్రీను తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి మ్యూజిక్: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రాఫర్: విజయ్ మిశ్రా, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు.



రాహుల్ రవీంద్రన్,
చాందినీ చౌదరి

డైరెక్షన్ చేస్తానంటోంది!

సినిమా ఇండస్ట్రీలో మల్టీ టాలెంటెడ్ గర్ల్ అనిపించుకుంది శృతిహాసన్. మ్యూజిషియన్‌గా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆమె ఆతర్వాత హీరోయిన్‌గా టర్న్ అయ్యింది. ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా పేరుతెచ్చుకుంది. అయితే ఆమెకు దర్శకత్వంవైపు మనసు మళ్లిందట. తన తండ్రి కమల్‌హాసన్‌లాగే శృతి కూడా ఆల్‌రౌండర్ అనిపించుకోవాలనుకుందన్నమాట. మరింతకీ ఆ సినిమాలో ఆమె నటిస్తుందా లేదా అన్నది తెలియరాలేదు. శృతిహాసన్‌కు దర్శకత్వంపై మొదటి నుంచి మక్కువ ఉందట. కానీ అనుకోకుండా హీరోయిన్ అయ్యిందట. హీరోయిన్‌గా బోలెడన్ని ఆఫర్లు దక్కించుకుంటున్నా అవేమంత ఆమెకు కిక్కివ్వడం లేదట. అందుకే తనలోని దర్శకత్వం టాలెంట్‌ను ప్రదర్శించి సంతృప్తిచెందాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. కానీ డైరెక్టర్ అయినప్పటికీ కథానాయికగా నటించడం మాత్రం మానుకోనని చెబుతోంది. శృతికి చిన్నప్పటి నుంచి కథలు చెప్పడం అలవాటు. చిన్నప్పుడు స్నేహితులకు భయంకరమైన కథలు చెప్పి వాళ్లను ఆశ్చర్యపోయేలా చేసేదట. అలాంటి కథనే తెరపై చూపించాలని ఆమె నిర్ణయించుకున్నట్టు తెలిసింది.



మనీషా రాజ్

నటనకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలు చేస్తా

సునీల్ కథానాయకుడిగా శంకర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం '2 కంట్రీస్'. మహాలక్ష్మి ఆర్ట్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రంలో మనీషా రాజ్ కథానాయికగా నటించింది. ఈ చిత్రం తాజాగా విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో ఆడుతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ మనీషా రాజ్ మాట్లాడుతూ ''మా కుటుంబం అమెరికాలో స్థిరపడింది. అక్కడి ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓర్లాండో పట్టణంలో నివాసముంటున్నాం. హైదరాబాద్, వరంగల్ నగరాలకు తరచుగా వస్తుంటాం. నేను సైకాలజీలో గ్రాడ్యుయేషన్ చేస్తున్నాను. ఇక నాకు చిన్నతనం నుంచే హీరోయిన్ కావాలనే కోరిక ఉండేది. దర్శకుడు శంకర్ సినిమా లొకేషన్ల కోసం అమెరికా వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చారు. ఆ సమయంలో నేను కొన్ని పాటలు పాడి ఆయనకు వినిపించాను. పాటలు బాగా పాడావని ప్రశంసించి ఈ సినిమా ఆడిషన్స్‌కు పిలిచారు. చివరికి ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికయ్యాను. '2 కంట్రీస్' చిత్రానికి మంచి స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం కావడంతో నా కోరిక నెరవేరింది. నేను చక్కగా నటించానని అందరూ అంటుండడంతో హ్యాపీగా ఉంది. భవిష్యత్తులో ప్రేమ కథా చిత్రాల్లో నటించాలని ఉంది. దాంతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలు చేస్తాను''అని అన్నారు.

మరో 20 ఏళ్లు ఉంటుందట!

ఇప్పటికే సన్నీలియోన్‌కు 35 ఏళ్లు వచ్చేశాయి. అయినప్పటికీ తన ఫిజిక్‌ను బాగానే మెయింటేన్ చేస్తూ యువకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇదేవిధంగా కొనసాగితే ఇంకో నాలుగైదేళ్లు బాలీవుడ్‌లో ఈ బ్యూటీ కొనసాగవచ్చు. కానీ సన్నీలియోన్ ఆలోచన మరో రకంగా ఉంది. ఆమె ఇంకో 20 ఏళ్లు బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలగాలని అనుకుంటోంది. ఇక్కడి నుంచి అప్పుడే కదిలే ఛాన్స్ లేదంటోంది. కేవలం తన అందాలతోనే నెట్టుకొస్తున్న సన్నీ మరి 20 ఏళ్ల పాటు ఇక్కడే ఉండాలని టార్గెట్ పెట్టుకోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. బాలీవుడ్‌లోకి వచ్చిన కొత్తలో తాను అనేక అవమానాలను ఎదుర్కొన్నానని... తన గురించి చాలా మంది చాలా రకాలుగా వ్యాఖ్యలు చేశారని సన్నీ చెప్పింది. తాను రెండేళ్లలో ఇక్కడి నుంచి అన్నీ సర్దుకొని వెళ్లిపోతానని ఎగతాళి చేశారని... కానీ తాను ఇంకో 20 ఏళ్లపాటు ఇక్కడే ఉంటానని అంటోంది.



సన్నీలియోన్



ఒబిఒఆర్‌ను ముందుకు తీసుకెళతాం : జిన్‌పింగ్

బీజింగ్: చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ ఆదివారం నూతన సంవత్సరాది ప్రసంగంలో వన్ బెల్ట్ వన్ రోడ్(ఒబిఒఆర్)ను చైనా ముందుకు తీసుకెళుతునందని పునరుద్ఘాటించారు. ఐక్యరాజ్యసమితి అధికారాన్ని, హోదాను చైనా నిలబెట్టేందుకు కట్టుబడి ఉందని ఆయన అన్నారు. రెండవసారి చైనా అధ్యక్ష పదవి చేపట్టాక చేసిన తొలి సంవత్సరాది ప్రసంగంలో ఆయన ఈ విషయాన్ని పేర్కొన్నారు. అంతర్జాతీయ అన్ని విధులను, నియమాలను చైనా పూర్తి చేస్తుందన్నారు. వాతావరణ మార్పు, బెల్ట్ అండ్ రోడ్(బిఆర్‌ఐ)ని క్రియాశీలకంగా ముందుకు తీసుకెళ్లడం, ప్రపంచ శాంతిని నిర్మించడం, ప్రపంచ అభివృద్ధికి సేవలందించడం, అంతర్జాతీయ ఆర్డర్‌ను నిలబెట్టడం వంటి వాటికన్నింటికీ చైనా కట్టుబడి ఉందని జిన్‌పింగ్ చెప్పారు. చైనా, పాకిస్థాన్ ఆర్థిక నడవ(సిపిఇసి) సహా ప్రపంచ దేశాలను రోడ్లు, రైళ్లు, రేవుల ద్వారా అనుసంధానిచ్చే ప్రాజెక్టులకు చైనా పట్టుబడుతోంది. ఇందుకు బిఆర్‌ఐ ద్వారా కృషి చేస్తూ ప్రపంచంలో తన పట్టును పెంచుకోవాలని ఆశిస్తోంది. ప్రపంచ దేశాల ప్రజల సౌభాగ్యం, శాంతియుత భవిష్యత్తుకు చైనా ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి సాధించినప్పటికీ ప్రజల సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేసినట్టు చైనా ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా తెలిపింది.

ఛత్తీస్‌గఢ్‌లో తల్లి, కొడుకును తొక్కి చంపిన ఏనుగులు

కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లో ఏనుగులు తల్లి, కొడుకును తొక్కి చంపాయి. బలరాంపూర్ జిల్లా అడవి ప్రాంతంలో అటౌరి బెల్సోటాకు చెందిన కుటుంబం, తమ బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యలో ఏనుగుల గుంపు ఎదురైంది. వాహనాన్ని వదిలి పారిపోతుండగా వెంబడించిన ఏనుగులు తల్లీకొడుకును తొక్కి చంపినట్లు డివిజన్ ఫారెస్ట్ అధికారి వివేకానంద ఝూ తెలిపారు. మృతులు, గీతా (30), ఆమె కొడుకు దిలేశ్(7)గా గుర్తించారు. శనివారం సాయంత్రం ఘటన చోటు చేసుకుంది. మృతురాలి భర్త, మరో కుమారుడు ఏనుగు ల బారి నుంచి తప్పించుకున్నారని తెలిపారు. మృతురాలి వారసులకు తక్షణ పరిహారం అందించామని ఫారెస్ట్ అధికారి తెలిపారు. గతంలో కూడా ఏనుగులు మనుషులపై దాడి చేసి చంపాయి. ఇళ్లు, పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని ఆయన తెలిపారు.

200 విమానాలు ఆలస్యం



ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల రద్దీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర పొగమంచుతో దాదాపు 200 విమానాలు ఆలస్యం కావడం, దారి మళ్లించడమో లేదా రద్దు చేశారు. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 50 మీటర్ల వరకు పొంగమంచుతో దృగ్గోచరత పడిపోయింది.. 150కి పైగా విమానాలు ఆలస్యం కాగా, దాదాపు 50కి పైగా విమానాలను దారి మళ్లించారు. మరో 20 విమానాలను రద్దు చేశారు. ఐజిఐ విమానాశ్రయం నుంచి ్ధంచి కావడానికి కనీసం 125 మీటర్ల రేంజ్‌లో దృగ్గోచరత అవసరం ఉంటుంది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిఎటి ఐఐబి పద్ధతిలో తక్కువ దృగ్గోచరతలో కూడా విమానాలను ల్యాండింగ్ చేస్తున్నారు. 25–50 మీటర్ల దృగ్గోచరత ఉన్న విమానాలు ల్యాండ్ అవుతున్నాయి. ఉదయం 5.30 గంటల నుంచి అత్యంత తీవ్రంగా పొగమంచు ఉన్నట్లు వాతావరణ శాఖ డైరెక్టర్ ఆర్‌కె జనమని తెలిపారు. ఈ సీజన్‌లో ఇదే అత్యంత దుర్భరమైన పొగమంచు అని ఆయన తెలిపారు. పగటి వేళ దృగ్గోచరత 2000 వరకు చేరుకోగానే విమానాలను యథావిధిగా నడిపుతున్నట్లు అధికారులు తెలిపారు.

వాహనాలను దగ్ధం చేసిన మావోలు

గయ : బీహార్‌లో జరుగుతున్న గ్యాస్ పైప్‌లైన్ పనులకు మావోలు ఆటంకం సృష్టించారు. జగదీశ్‌పుర్ హల్దియా గ్యాస్ పైప్‌లైన్ పనులకు ఉపయోగించే రెండు యంత్రాలను,ఒక వాహనాన్ని దగ్ధం చేశారు. ప్రాంతంలో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. సంఘటన జరిగిన ప్రాంతం గురారూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కాజ్ గ్రామంలో ఉంది. మావోలు డిమాండ్ చేసిన మొత్తాన్ని చెల్లించకపోవడంతో వారు ఈ పనికి పాల్పడ్డారని సిటి ఎస్పీ జె జల్లా రెడ్డి మీడియాకుతెలిపారు. తాము డిమాండ్ చేసిన మొత్తం చెల్లించకపోతే పనులు జరగనివ్వమని మావోలు డిమాండ్ చేశారని, అక్కడ ఉన్న ఏజెన్సీ సిబ్బందిని కొట్టారని ఎస్పీ వివరించారు. ఈ పనికి పాల్పడిన వారిపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశామని, వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

కొండపై దారి తప్పిన విద్యార్థులు

విశాఖపట్నం: సింహాచలం కొండపైకి సీతమ్మధార నుంచి ఆదివారం ఉదయం ట్రెక్కింగ్‌కు బయలుదేరిన ఆరుగురు విద్యార్థులు తప్పిపోవడం ఉత్కంఠ రేపింది. సుమారు 20 మంది ఆర్. ఎస్.ఎస్ కార్యకర్తలుగా పనిచేస్తున్న విద్యార్థులు ట్రెక్కింగ్‌కు వెళ్లారు. వారిలో ఆరుగురు సరదాగా మరో మార్గంలో వెళ్లి దారి తెలియక తప్పిపోయారు. అటవీ ప్రాంతం కావడంతో వారి వద్ద ఉన్న ఫోన్లు కూడా పనిచేయలేదు. వేరే మార్గంలో వెళ్లిన విద్యార్థులు ఎంతసేపటికీ రాకపోవడంతో తోటి విద్యార్థులు విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు సమాచారం అందించారు. దీంతో ఆయన సీపీ యోగానంద్, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌లకు సమాచారం ఇచ్చారు. తప్పిపోయిన వారి ఆచూకీ కోసం 60 మంది పోలీసులతో కూంబింగ్ పార్టీని ఏర్పాటు చేసి సింహాచలం కొండపై జల్లెడ పట్టారు. మరోవైపు నావీ అధికారులకు కూడా సమాచారం ఇచ్చి హెలికాప్టర్ ద్వారా గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు కొండపై చిక్కుపోయిన విద్యార్థులను పోలీసులు గుర్తించి క్షేమం గా తీసుకురావడంతో అంతా వూపిరి పీల్చుకున్నారు. డీసీపీ ఫకీరప్ప ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టారు.

ఎపి డిజిపిగా మాలకొండయ్య



అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన డిజిపిగా సీనియర్ ఐపీఎస్ అధికారి మాలకొండయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డిజిపి సాంబశివరావు నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు మాలకొండయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ ఎండీగా ఉన్న ఆయన్ని ప్రభు త్వం డిజిపిగా నియమించింది. నూతన డిజిపికి ఐపీఎస్ అధికారులు, ఇతర సీనియర్ అధికారులు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిర క్షణకు తొలి ప్రాధాన్యమిస్తానని స్పష్టం చేశారు.

భావోద్వేగానికి గురైన సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్ డిజిపి పదవికి ఉద్యోగ విరమణ చేసిన నండూరి సాంబశివరావు ఆదివారం భావోద్వేగానికి లోనయ్యారు. ఆరు నెలల పా టు మాలకొండయ్య డిజిపిగా కొనసాగనున్నా రు. పదవి విరమణ చేసిన సాంబశివరావుకు ఐపీఎస్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎక్స్ డిజిని సాంబశివరావును ఐపీఎస్ అధికారులు పోలీసు రథంలో కూర్చోబెట్టి సాధరంగా దాన్ని లాక్కెల్లి వీడ్కోలు పలికారు. కాగా, కొత్త డిజిపి మాలకొండయ్య రథం తాడును లాగడంతో సాంబ శివరావు భావోద్వేగానికి గురయ్యారు.

తిరిగి సొంత పార్టీలో చేరిన వైఎస్‌ఆర్‌సిపి నేత

గుడివాడ : ఇటీవల మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు సమక్షంలో టిడిపిలో చేరిన గుడివాడ మున్సిపల్ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రవికాంత్ తిరిగి సొంత పార్టీలో చేరారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి రవికాంత్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో ఆత్మాహుతి దాడి

15 మంది మృతి, 14 మందికి గాయాలు



జలాలాబాద్ : తూర్పు అఫ్ఘనిస్థాన్‌లో ఆదివారం జరిగిన ఓ అంతిమ యాత్రలో విషాదఛాయలు అలముకున్నాయి. ఓ ఆత్మాహుతి దళసభ్యుడు తనకు తాను పేల్చుసుకున్నాడు. ఈ ఘటనలో 15 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 14 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల మృతి చెందిన హస్కా మినా జిల్లా మాజీ గవర్నర్ అంత్యక్రియల ను నిర్వహిస్తుండగా ఆత్మాహుతి బాంబర్ అంతియాత్రలో చొరబడి తనకు తాను పేల్చుకున్నట్లు గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే ఈ బాంబుదాడిలో ఆరుగురు మరణించగా, 11 మంది క్షతగాత్రులైనట్లు ముందుగా గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. ఆ తరువాత మృతుల సంఖ్య 15కు, గాయపడిన వారు 14కు చేరినట్లు నంగార్‌హర్ గవర్నర్ అధికార ప్రతినిధి అత్తుల్హా ఖొగ్యాని మీడియాకు వెల్లడించారు. మృతుల సంఖ్యను ప్రావిన్సియల్ హెల్త్ డైరెక్టర్ నజీ బ్ కమవాల్ ధ్రువీకరించారు. కాగా, ఇంత వరకు ఏ ఉగ్రవాద సంస్థ కూ డా ఘటనకు తామే కారణమని ప్రకటించలేదు. కానీ ఐసిస్ ఉగ్రవాదులే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. షియాల సాంస్కృతిక కేంద్రంపై ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు దాడి చేసి 41 మందిని పొట్టనపెట్టుకున్న కొద్ది రోజులకే తాజాగా మరోసారి అంతియాత్రలో చొరబడి ఆత్మాహుతికి పాల్పడ్డారు.

ఆస్ట్రేలియాలో కూలిన సముద్ర విమానం

ఆరుగురు మృతి

సిడ్నీ : ఆస్ట్రేలియాలో ఆదివారం సముద్ర విమానం ఒకటి నదిలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. గజఈతగాళ్లు ముగ్గురు మృతదేహాలను బయటకు తీసినట్లు పోలీసులు చెప్పారు. సిడ్నీకి ఉత్తరాన 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న సబర్బ్ కౌన్ సమీపంలోని హవ్‌కేస్బురి నదిలో విమానం కూలియిందని కొత్త దక్షిణ వాల్స్ స్టేట్ పోలీసులు తెలిపారు. ఒకే ఇంజిన్‌గల ఈ సముద్ర విమానం 13 మీటర్ల (43 ఫీట్లు) ఎత్తు నుంచి నీటిలో పడిపోయినట్లు సూపరింటెండెంట్ మైఖెల్ గోర్మన్ మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. ఘటన అనంతరం సహాయక చర్యల్లో పాల్గొన్న గజఈతగాళ్లు ఇప్పటి వరకు మూడు మృతదేహాలను వెలికితీసినట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, వెలికితీసిన మృతులు ఎవరు అనేది ఇంకా తెలియలేదని, విమానం ఏ కారణంతో కూలిపోయిందో ఇంకా దర్యాప్తుదారులు తేల్చలేదన్నారు.

నితిన్ పటేల్‌కే ఆర్థికశాఖ

అమిత్ షా జోక్యంతో సమసిన వివాదం



అహ్మదాబాద్ : గుజరాత్ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ అనుకున్నది సాధించారు. ఆర్థిక శాఖను తిరిగి దక్కించుకున్నారు. దీంతో రెండు రోజులుగా గుజరాత్‌లో కొనసాగుతున్న గందరగోళానికి తెరపడింది. బిజెపి అధ్యక్షుడు అమిత్ షా ఆదివారం ఉదయం నితిన్ పటేల్‌ను కలిసి ఆయన స్థాయికి తగిన సరైన శాఖలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వంలో నెంబర్ 2 మీరేనని నితిన్ పటేల్‌కు స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించాలని కోరారు. అమిత్ షా జోక్యంతో సమస్య సమసిపోయింది. నితిన్ పటేల్ ఆదివారం ఉదయం 11.49 నిమిషాలకు బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నితిన్ పటేల్ నేరుగా తన నియోజకవర్గం మెహసానాకు బయలుదేరి వెళ్లారు. అక్కడ తన మద్దతు దారులతో సమావేశం అయ్యారు. తనకు అండగా నిలిచినందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ఆర్థిక శాఖను నితిన్ పటేల్‌కి కేటాయించామని మధ్యాహ్నం 2 గంటలకు గాంధీనగర్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెద్ద కుంటుంబం లాంటి బిజెపిలో ఇటువంటి చిన్న చిన్న సమస్యలు రావడం సహజమని ఆయన అన్నారు. శాఖలలో జరిగిన మార్పులను వివరిస్తూ గవర్నర్‌కు ఇప్పటికే లేఖ పంపినట్లు రూపానీ వివరించారు.

డిసెంబర్ 28 నుంచి డిసెంబర్ 31 వరకు : గుజరాత్ ఎన్నికల్లో విజయం సాధించిన బిజెపి డిసెంబర్ 28న మంత్రులకు శాఖలను కేటాయించింది. నితిన్ పటేల్‌కు రోడ్లు భవనాలు, వైద్య విద్య, ఆరోగ్యం వంటి శాఖలను కేటాయించారు గతంలో ఆర్థిక, పట్టాణాభివృద్ధి వంటి కీలక శాఖలను నితిన్ పటేల్ నిర్వహించారు.ఈ సారి సౌరవ్ పటేల్‌కు ఆర్థిక శాఖ దక్కగా, స్వయంగా ముఖ్యమంత్రి రూపానీ పట్టణాభివృద్ధి శాఖను తన వద్దే ఉంచుకున్నారు. ఈ పరిణామాలు నితిన్ పటేల్‌కు రుచించ లేదు. ఆయనకు కేటాయించిన శాఖలతో ఆయన తృప్తి చెందలేదు. బాధ్యతలు స్వీకరించేందుకు నిరాకరించారు. తన స్థాయికి తగిన శాఖలను కేటాయించాలని లేకపోతే క్యాబినెట్ నుంచి విముక్తి కల్పించాలని ఆయన అధిష్టానాన్ని కోరారు. పరిస్థితి తీవ్రతను గమనించిన అమిత్ షా స్వయంగా రంగంలో దిగి సమస్య పెద్దది కాకుండా నివారించారు. నితిన్ పటేల్‌కు ఆర్థిక శాఖను కేటాయించి ఆయనను శాంతింప జేశారు.

తిరుమలలో భక్తుల రద్దీ



తిరుమల : తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి దర్శనం కోసం ఎనిమిది కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనానికి ఐదు గంటలు, కాలినడక భక్తులకు రెండు గంటలు, ప్రత్యే ప్రవేశ దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 1,01,246 మంది దర్శించుకున్నారు. 22,333 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీకి శనివారం రూ.3.16 కోట్ల ఆదాయం సమకూరింది.

బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు

- క్రిమిలేయర్ ఎత్తివేయాలి
- ఈ నెల 8న విజయవాడలో విద్యుత్ ఉద్యోగుల భారీ సభ



మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్ : బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ ఎత్తివేయాలని ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఈ నెల 8న విజయవాడలో 10 వేల మందితో భారీ ఎత్తున బిసి విద్యుత్ ఉద్యోగుల మహా సభ జరపాలని ఆంధ్రప్రదేశ్ బిసి విద్యుత్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. ఆదివారం బిసి భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమి లేవన్నారు. గతంలో పాలించిన కేంద్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం,బిసి వ్యతిరేక వైఖరి అవలంభించడం మూలంగానే పెట్టలేదన్నారు. రాజ్యాంగ బద్ధమైన మండల కమిషన్ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసిందన్నారు. చట్ట బద్ధమైన పార్లమెంటరీ కమిటి ఛైర్మన్ నాచియప్పన్ కమిటీ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసిందని తెలిపారు. ఇక ఇటీవల సుప్రీం కోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్లు కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పిందన్నారు. అన్ని వైపుల నుంచి బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులు, తీర్పులు ఉంటే కూడా ప్రభుత్వం పెట్టకుండా అన్యయం చేస్తున్నారని విమర్శించారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు లేకపోవడం వలన ఉన్నత స్థాయి ఉద్యోగాలలో బిసిల ప్రాతినిధ్యం 3 శాతం దాటడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని కేటగిరి ఉద్యోగాలలో బిసిల ప్రాతినిధ్యం 9 శాతం దాటడం లేదు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడంతో పాటు, కేంద్రంలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలనీ కోరారు. అప్పుడే బిసిల ప్రాతినిధ్యం పెరుగుతుందని, న్యాయం జరుగుతుందన్నారు.బిసిలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక,రాజకీయ, సామాజిక రంగాలలో సమన్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్యవాటా రాజ్యాంగబద్ధంగా ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని కృష్ణయ్యాహెచ్చరించారు.

కొత్త రాష్ట్ర కమిటి ఎన్నిక : తాత్కాలికంగా కొత్త రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా వీరభద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా గణేష్‌ను ఎన్నుకున్నారు. పూర్తిస్థాయి కమిటీనీ జనరల్ బాడి సమావేశంలో ఎన్నుకోవాలని నిర్ణయించారు. జనరల్ బాడిలో సీక్రెట్ బ్యాలెట్ పెట్టి రాష్ట్ర కమిటిని ఎన్నుకోవాలని నిర్ణయించారు.

పాత కమిటి రద్దు

పాత కమిటిని రద్దు చేయాలని సమావేశం నిర్ణయించింది. పాత కమిటీ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పోలంకి శ్రీనివాసరావు, కాపు రిజర్వేషన్ సమర్థిస్తూ కాపు ఉద్యమంలో పాల్గొంటున్నందున ఆయన శాశ్వతంగా సంఘం నుంచి తొలగించారు. ఈ సమావేశంలో నారాయణరావు, శ్రీనివాసులు, శ్రీహరి, రామకృష్ణ, జి.రాంబాబు, చల పతి, శ్రీధర్, మురళి, ప్రసాద్ యాదవ్, శ్రీను, సుబ్ర హ్మణ్య, బిసి నాయకులు గుజ్జ కృష్ణ, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రజాసంకల్పయాత్ర@48



చిత్తూరు: అధికార పక్ష అన్యాయాలను ప్రజలకు వివరిస్తూనే.. వారికి నేనున్నానంటూ ప్రజాసంకల్పయాత్ర ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర 48వ రోజుకి చేరుకుంది. ఆదివారం ఉదయం చిత్తూరు జిల్లా మూలపల్లిక్రాస్ నుంచి వైఎస్ జగన్ తన పాదయాత్రను ప్రారంభించారు.

ఆ రహస్యం ఎవరికీ తెలియదు : నారాయణ

విజయవాడ: పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఎంతో అవసరమని సిపిఐ కేంద్ర కార్యదర్శి నారాయణ అన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రహ స్య ఎజండా ఉందని, ఆ రహస్యం ఎవరికీ తెలియదని నారాయణ తనదైనశైలిలో వ్యాఖ్యానించారు. జూన్ నుంచి వర్షాలు మొదలైతే 2018 నాటికి కాఫర్ డ్యామ్ ఎలా పూర్తి అవుతుందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా భూసేకరణ కూడా పూర్తి కాలేదని అన్నారు. ఎపిలో ఓట్లు పడవనే ఉద్దేశంతో రాష్ట్రానికి అన్యాయం చేయాలని బిజెపి చూస్తుందని ఆరోపించారు. కేంద్రంలో చక్రం తిప్పుతామన్న చంద్రబాబు మాటలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. బిజెపి మతోన్మాదాన్ని పెంచుతోందని విమర్శించారు.

చెట్టును ఢీకొన్న బైక్ : ఇద్దరు మృతి


గోకవకం: ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరో యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా గండిపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన గెడ్డం నాని(18), ఆదిత్య(16)లతో పాటు మరో యువకుడు ద్విచక్రవాహనంపై శనివారం అర్థరాత్రి సమయంలో గోకవరం వైపు వస్తున్నారు.సింగారమ్మచింత గ్రామం దాటిన తర్వాత మల్లవరం కూడలి మలుపు వద్ద బైకు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గెడ్డంనాని, ఆదిత్యలు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయలపాలైన మరో యువకుడిని 108 వాహనంలో రాజమహేంద్రవరం తరలించారు. గోకవరం ఎస్‌ఐ వెంకట సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

2017లో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైంది : బొత్సా

విశాఖ : 2017లో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత బొత్సా సత్యనారాయణ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తెలుగుదేశం పార్టీ చేర్చుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంత్రి మండలికి ఒక ఔన్నత్యం ఉందని, అలాంటి పార్టీ ఫిరాయింపుదారులకు మంత్రి పదవులు ఇవ్వడం కంటే దారుణం మరొకటి లేదని అన్నారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన మెట్రో రైలు

రెండు గంటల పాటు స్తంభించిన సేవలు



మన తెలంగాణ / హైదరాబాద్ సిటీబ్యూరో: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయించిన మెట్రో రైలు ఆదివారం మొరాయించింది. రైలులో సాం కేతిక సమస్య తలెత్తడంతో అమీర్‌పేట్ స్టేషన్‌లోనే నిలిచిపోయింది. దీంతో నాగోల్–అమీర్‌పేట్‌ల మధ్య రెండు గంటల పాటు మెట్రో సేవలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు కొద్దిసేపు తీవ్ర గందరగోళానికి గురైయ్యారు. అసలే ఆదివారంకు తోడు డిసెంబర్ 31 ఏడాది చివరి రోజు కావడంతో తమ తమ గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చాని రోజువారి కంటే మెట్రో రైళ్లు ప్రయాణానికి అసక్తి చూపిన నగర వాసులు మెట్రో ప్రయాణానికి భారీగా తరలివచ్చారు. అయితే నాగోల్ నుంచి అమీర్ పేట్‌కు బయలుదేరి వెళ్లిన ఓ మెట్రో రైలులో సాంకేతిక సమస్య తలెత్తడంతో అమీర్‌పేట్ స్టేషన్‌లో నిలిచిపోయింది. అప్పటీకే దీంతో రెండు గంటల పాటు టికెట్లు తీసుకుని ప్లాట్‌పామ్‌లపైకి వచ్చిన ప్రయాణికులు ప్రతి 15 నిమిషాలకు వచ్చే ట్రైన్‌లు గంట గడిచిన రాకపోవడంతో ఏమి జరిగిందో తెలియక ఆందోళనకు గురైయ్యారు. రైల్లు కోసం చాల సేపు ఎదురు చూసిన ప్రయాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చని వస్తే మరింత అలస్యమైందంటూ వెనుదిరిగారు. నెల రోజులకే ఇలా జరిగితే భవిష్యత్తులో ఏలా ఉంటుందోనంటూ విస్మయం వ్యక్తం చేశారు.

ప్రకాశ్ నగర్‌కు తరలింపు : సాంకేతిక సమస్య కారణంగా అమీర్ పేట్ మెట్రోస్టేషన్‌లో నిలిచిపోయిన రైలును నిలిచిపోవడంతో హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు హూటాహుటిన అమీర్‌పేట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆ రైలు బేగంపేట్‌లోని ప్రకాశ్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద నిర్మించిన అదనపు ట్రాక్‌పైకి తరలించి రైళ్ల రాకపోకలు అడ్డు తొలగించారు. దీంతో రెండు గంటల పాటు నిలిచిపోయిన మెట్రో సేవలు తిరిగి ప్రారంభం అయ్యాయి.



మన తెలంగాణ
12 హైదరాబాద్ సోమవారం 1, జనవరి 2018
www.manatelangana.news

సద్వినియోగం చేసుకున్నాడు: ద్రవిడ్



న్యూఢిల్లీ: అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని హార్దిక్ పాండ్య టీమిండియాలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడని జూనియర్ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ చెప్పాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్‌కు వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నా ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కొరత మాత్రం చాలా తీవ్రంగా ఉందన్నాడు. కపిల్‌దేవ్ తర్వాత అలాంటి ఆల్‌రౌండర్ భారత్‌కు మరొకరు దొరకలేదంటే దానిలో ఆశ్చర్యం లేదన్నాడు. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కోసం టీమిండియా చాలా ఏళ్లుగా ఎదురు చూస్తునే ఉందన్నాడు. అయితే ఎట్టకేలకు భారత్ నిరీక్షణ ఫలించిందని, హార్దిక్ పాండ్య రూపంలో ఓ అగ్రశ్రేణి ఆల్‌రౌండర్ భారత్‌కు అందుబాటులోకి వచ్చాడని ద్రవిడ్ వివరించాడు. అంది వచ్చిన అవకాశాన్ని హార్దిక్ చక్కగా సద్వినియోగం చేసుకున్నాడని ద్రవిడ్ ప్రశంసించాడు. రానున్న రోజుల్లో హార్దిక్ అద్భుతంగా రాణిస్తాడనే నమ్మకం తనకుందన్నాడు. భారత్‌లో ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవలేదని, అయితే చాలా మంది తీవ్ర పోటీ వల్ల వెలుగులోకి రాలేక పోతున్నారని తెలిపాడు. క్రికెట్‌లో ప్రవేశం కావాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదని, సిఫార్సు లేకుంటే వెలుగులోకి రావడం చాలా కష్టమని ద్రవిడ్ అభిప్రాయపడ్డాడు.

కష్టమే కానీ అసాధ్యం కాదు..



- సౌతాఫ్రికా సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి
- అందరి దృష్టి భారత్‌పైనే
- గెలుపు కోసం కోహ్లి సేన కసరత్తు

మన తెలంగాణ/ క్రీడా విభాగం

వరుస విజయాలతో దూకుడు మీదున్న టీమిండియాకు కొత్త ఏడాది ప్రారంభంలోనే గట్టి పోటీ ఎదురుకానుంది. 2017లో మరుపురాని విజయాలతో మురిపించిన భారత క్రికెట్ జట్టు 2018లో మాత్రం ఆ సంప్రదాయాన్ని కొనసాగించడం అంత సులువుకాదని చాలా మంది విశ్లేషిస్తున్నారు. బౌన్స్‌కు అనుకూలించి దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలలో భారత్ ఈ ఏడాది సిరీస్‌లు ఆడనుంది. ఇందులో విజయం సాధించడం టీమిండియాకు అంత తేలిక కాదని అందరు పేర్కొంటున్నారు. 2017లో ఒక్క సిరీస్ కూడా కోల్పోకుండానే భారత్ సీజన్‌ను ముగించింది. అయితే ఇందులో ఒక్క శ్రీలంకలో మాత్రమే భారత్ టెస్టు సిరీస్‌లో పాల్గొంది. ఇక, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంకలతో స్వదేశంలోనే పోటీ పడింది. దీంతో భారత్ పెద్దగా కష్టపడకుండానే విజయాలు అందుకుంది. టెస్టులు, వన్డేల్లో భారత్ నిలకడైన విజయాలతో ప్రపంచ క్రికెట్‌లో పెను ప్రకంపనలే సృష్టించింది. కానీ, 2018లో మాత్రం విరాట్ కోహ్లి సేనకు అత్యంత కఠిన పరీక్షలు తప్పేలా లేవు. జనవరిలో దక్షిణాఫ్రికాతో జరిగే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోహ్లి సేన సత్తాకు పరీక్షగా విశ్లేషకులు అంచన వేస్తున్నారు. ఇందులో గెలిస్తే మాత్రం టీమిండియాకు ఇక ఎదురే ఉండదు. గతంలో దక్షిణాఫ్రికా, విండీస్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు స్వదేశంతో పాటు విదేశాల్లోనూ వరుస సిరీస్‌లతో ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. అయితే భారత్ మాత్రం విదేశాల్లో ఎప్పుడూ కూడా ఆధిపత్యం చెలాయించలేదు. ఒక్క శ్రీలంక, జింబాబ్వే, బంగ్లాదేశ్ గడ్డపై మాత్రమే భారత్ హవా కొనసాగించింది. కానీ, విండీస్, సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో జరిగిన టెస్టు సిరీస్‌లలో అవమానకర ఓటములను చవిచూసింది. మిగతా దేశాలతో పోల్చితే కివీస్‌లో మాత్రమే భారత్‌కు కాస్త మెరుగైన రికార్డు ఉంది. ఇక, దక్షిణాఫ్రికాలో ఇప్పటి వరకు ఒక్క సిరీస్‌లో కూడా విజయం సాధించలేక పోయింది. కేవలం రెండు టెస్టుల్లో మాత్రమే విజయం సాధించింది. అంతేగాక వన్డేల్లోనూ టీమిండియా రికార్డు చాలా పేలవంగా ఉంది. 28 వన్డేలు ఆడితే అందులో కేవలం ఐదింటిలో మాత్రమే గెలుపొందింది. దీన్ని బట్టి సఫారి గడ్డపై టీమిండియా రికార్డు ఎంత పేలవంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే భారత్ దక్షిణాఫ్రికాలో పేలవంగా ఆడిన మాట వాస్తవమే అయినా ఇక్కడ ఒక్కసారి కూడా క్లీన్‌స్వీప్‌కు గురికాక పోవడం కాస్త ఊరట కలిగించే అంశమే. ఇది ఒక్కటే భారత్‌కు సానుకూలమైన అంశంగా చెప్పుకోవచ్చు.

ఈసారి మాత్రం..

ఇదిలావుంటే ఈసారి మాత్రం టీమిండియా తప్పక గెలుస్తుందనే నమ్మకం చాలా మందిలో ఉంది. దీనికి ఇటీవల కాలంలో కోహ్లి సేన ప్రదర్శనే నిదర్శనంగా చెప్పుకుంటున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ చాలా బలంగా మారింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు కొదవలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫాస్ట్ బౌలింగ్ చాలా పటిష్టంగా ఉంది. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లతో కూడిన బలమైన బౌలింగ్ లైనప్ టీమిండియాకు అందుబాటులో ఉంది. ఫాస్ట్ బౌలర్లకు సహకరించే సౌతాఫ్రికా పిచ్‌లపై భారత స్పీడ్‌స్టర్లు ప్రకంపనలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. మహ్మద్ షమి, ఇషాంత్ శర్మ, ఉమేశ్ యాదవ్, భువనేశ్వర్ కుమార్‌లతో భారత బౌలింగ్ చాలా బలంగా ఉంది. అంతేగాక హార్దిక్ పాండ్య, జస్‌ప్రిత్ బుమ్రాల రూపంలో మరో రెండు పదునైన అస్త్రాలు కూడా భారత్‌కు అండగా నిలువనున్నాయి. ఇక, ప్రపంచంలోనే అత్యుత్తమ స్పిన్నర్లుగా పేరు తెచ్చుకున్న రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు ఉండనే ఉన్నారు. వీరిద్దరూ కూడా నిలకడైన బౌలింగ్‌తో భారత్ విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. దీంతో సౌతాఫ్రికాను రెండు సార్లు ఆలౌట్ చేసే సత్తా భారత బౌలర్లకు ఉందని చెప్పవచ్చు.

ప్రస్థానం ఇలా..

ఇరు జట్లపై మధ్య జరిగిన టెస్టులు 17
భారత్ గెలిచినవి 2
సౌతాఫ్రికా గెలిచినవి 8
డ్రా అయిన టెస్టులు 7

అత్యధిక స్కోరు
భారత్ 459
సౌతాఫ్రికా 620/4 డిక్లేర్డ్

అత్యల్ప స్కోరు
భారత్ 66
దక్షిణాఫ్రికా 84

311 పుజారా సాధించిన పరుగులు
272 సఫారీ గడ్డపై కోహ్లి చేసిన పరుగులు





జోరుమీదున్నారు..

ఇక, భారత బ్యాట్స్‌మెన్ కూడా దూకుమీదున్నారు. కిందటి ఏడాది ఓపెనర్లు మురళీ విజయ్, శిఖర్ ధావన్, కెఎల్.రాహుల్‌లు నిలకడైన ఆటతో ప్రపంచ క్రికెట్‌లో పెను ప్రకంపనలు సృష్టించారు. ఈసారి కూడా వీరిపై జట్టు భారీ ఆశలే పెట్టుకుంది. గాయం వల్ల తొలి టెస్టుకు ధావన్ అందుబాటులో ఉండడం లేదు. అయితే రాహుల్ రూపంలో మరో అగ్రశ్రేణి ఓపెనర్ ఉండనే ఉన్నాడు. మురళీ విజయ్ శ్రీలంక సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. ఈసారి కూడా జట్టు అతనిపై భారీ నమ్మకాన్ని పెట్టుకుంది. అతను కూడా చెలరేగేందుకు తహతహలాడుతున్నాడు. రాహుల్ కూడా ఇదే లక్ష్యంతో ఉన్నాడు. మరోవైపు కొత్త వాల్‌గా పేరు తెచ్చుకున్న చటేశ్వర్ పుజారా రూపంలో భారత్‌కు మరో మెరుగైన అస్త్రం ఉండనే ఉంది. ఎటువంటి పరిస్థితుల్లోనైనా నిబ్బరంగా బ్యాటింగ్ చేసే సత్తా పుజారాకు ఉంది. ఇటీవల కాలంలో పుజారా ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడు. కిందటి ఏడాది టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌లలో రెండో స్థానంలో నిలిచాడు. దాదాపు 1300 పరుగులతో పుజారా సత్తా చాటాడు. ఇక, కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా కిందటి సీజన్‌లో అసాధారణ బ్యాటింగ్‌ను కనబరిచాడు. ఈసారి కూడా జట్టు అతనిపై భారీ ఆశలే పెట్టుకుంది. ప్రస్తుం టెస్టు ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్న కోహ్లి దక్షిణాఫ్రికా పిచ్‌లపై చెలరేగేందుకు ప్రత్యేక వ్యూహాలను రచించాడు. కోహ్లి సత్తాకు ఇది అసలైన సవాలు కావడంతో అతను సిరీస్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. ఆటగాడిగా, కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించేందుకు తహతహలాడుతున్నాడు. కాగా, శ్రీలంక సిరీస్‌లో పేలవమైన ఆటతో నిరాశ పరిచిన మరో అగ్రశ్రేణి ఆటగాడు అజింక్య రహానె తనకు అచ్చివచ్చే బౌన్సీ పిచ్‌లపై సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఎటువంటి బౌలింగ్‌నైన దీటుగా ఎదుర్కొనే సత్తా రహానెకు ఉంది. టీమిండియాకు అతనే కీలక అస్త్రంగా మారనున్నాడు. ఇక, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, అశ్విన్, జడేజా, భువనేశ్వర్‌లు కూడా బ్యాట్‌తో చెలరేగే సత్తా కలిగిన వారు. వీరంత నిలకడగా రాణిస్తే దక్షిణాఫ్రికా గడ్డపై చరిత్ర సృష్టించడం టీమిండియాకు కష్టమేమి కాదు.

అక్షయ్ శతకం.. విదర్భ 528/7

ఢిల్లీతో రంజీ ఫైనల్

ఇండోర్: తొలి రంజీ ట్రోఫీ దిశగా విదర్భ అడుగులు వేస్తోంది. ఢిల్లీతో జరుగుతున్న ఫైనల్ సమరంలో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 233 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్‌పై పట్టు బిగించింది. వికెట్ కీపర్ అక్షయ్ వినోద్ వాడ్కర్ 133 (బ్యాటింగ్) అజేయ శతకంతో కదంతొక్కడంతో విదర్భ ఆదివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 7వికెట్ల నష్టానికి 528 పరుగులు చేసింది. 206/4తో బ్యాటింగ్ చేపట్టిన విదర్భ ప్రారంభంలోనే వాంఖడే (17) వికెట్‌ను కోల్పోయింది. అయితే ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను అక్షయ్ వాడ్కర్ తనపై వేసుకున్నాడు. అతనికి ఆదిత్య అండగా నిలిచాడు. ఇద్దరు ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ జట్టును ఆధిక్యం దిశగా తీసుకెళ్లారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన వాడ్కర్ 16 ఫోర్లు, ఒక సిక్స్‌తో 133 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు ఆదిత్య 11 ఫోర్లతో 79 పరుగులు చేసి ఔటయ్యాడు. మరోవైపు సిద్దేశ్ నర్వాల్ 4 ఫోర్లు, 4సిక్సర్లత 56 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. దీంతో విదర్భ స్కోరు 528 పరుగులకు చేరింది. ఇప్పటికే భారీ ఆధిక్యం సాధించిన విదర్భ తొలి రంజీ ట్రోఫీ సాధించే అవకాశాలను మెరుగుపరుచుకుంది.

జాతీయ కబడ్డీ పోటీలు షురూ

మన తెలంగాణ/ హైదరాబాద్: 65వ జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా, పురుషుల జట్లు పాల్గొంటున్నాయి. అంతేగాక సర్వీసెస్, బిఎస్ఎన్ఎల్ వంటి డిపార్ట్‌మెంటల్ జట్లు కూడా టోర్నీలో పోటీ పడనున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య అధ్యక్షుడు జనార్ధన్ సింగ్ గెహ్లాట్, అఖిల భారత కబడ్డీ సమాఖ్య ప్రెసిడెంట్ డాక్టర్ మృదుల్ బాదౌరియా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు క్రీడాకారుల నుంచి గౌరవవందనాన్ని కూడా స్వీకరించారు. కాగా, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, తెలంగాణ కబడ్డీ సంఘం చైర్మన్, శాసనసభ సభ్యులు కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.